www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609

బుధవారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 24, జనవరి 2024

సంపుటి: 5 సంచిక: 245, పేజీలు: 12, వెల: రూ.5/-


## ఎన్నికల లబ్ది కోసం రామనామం: విహెచ్


హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
పార్లమెంట్ ఎన్నికల లబ్దికోసం ప్రధాని మోదీ శ్రీరాముడిని ఆయుధంగా వాడుకుంటున్నారని మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆరోపించారు. మంగళవారం నాడు గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మోదీ రాముడా.. రాహుల్ గాంధీ రావణుడా.. ఇది ఏం న్యాయం.. మణిపూర్‌లో వందల మంది మహిళలు చనిపోతే మోదీ వెళ్లారా.. తెలంగాణలో ఉన్న భద్రాద్రి ఆలయానికి ఎందుకు ఆహ్వానం పంపించలేదని ప్రశ్నించారు. రాముడు అందరివాడని.. ఓట్ల కోసమే మోదీ రాజకీయం చేస్తున్నారని వి. హనుమంతరావు మండిపడ్డారు.



# తప్పుల తడకగా ధరణి పోర్టల్

- తవ్వినకొద్దీ గుట్టలుగా లోపాలు
- మరింత లోతైన అధ్యయనం చేయాల్సిందే
- ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి వెల్లడి

హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
వీలయినంత తొందరగానే ధరణి సమస్యలపై మధ్యంతర నివేదిక ఇస్తామని కోదండరెడ్డి నేతృత్వంలోని కమిటీ తెలిపింది. మూడోసారి సీసీఎల్ఏ లో సమావేశమైన కమిటీ.. అనేక అంశాలపై చర్చించింది. ధరణి పోర్టల్ ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, బాధితులకు ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ధరణి వెబ్ సైట్ లోపభూయిష్టంగా ఉండటంతో...అనేక మంది రైతులు భూ హక్కులు కోల్పోయారని కమిటీ సభ్యులు కోదండరెడ్డి వెల్లడించారు. ఈ పోర్టల్‌లో పారదర్శకత లేదన్న ఆయన, భూమి యజమానికి తెలియకుండా లావాదేవీలు జరిగాయన్నారు. అనేక తప్పిదాల కారణంగా అన్నదాతలు... రైతుబంధు, ఇతర ప్రభుత్వ రాయితీలను పొందలేకపోయారని స్పష్టం చేశారు. ధరణి బాధితులకు త్వరితగతిన ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మరింత లోతైన అధ్యయనం చేయకుండా ముందుకు వెళ్లలేమని తెలిపారు. పోర్టల్ సమస్యలతో పాటు దానితో ముడిపడి ఉన్న అన్ని శాఖలతో చర్చించి సమగ్రమైన నివేదిక సిద్ధం చేయాల్సి ఉందని వెల్లడించింది. వాస్తవికతకు అద్దం పట్టేలా భూరికార్డుల కంప్యూటరైజ్డ్ చేయాల్సిన అవసరం ఉంటుందని ధరణి కమిటీ తెలిపింది. ధరణిలో ఒక సమస్యకు మరో సమస్యకు పొంతన లేకుండా ఉన్నాయని, ధరణి ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, ధరణి వల్ల భూ హక్కు హరించిపోయిందని చెప్పింది. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్లతో పాటు వ్యవసాయ, రిజిస్ట్రేషన్ శాఖలతో కూడా సమావేశమవుతామని కమిటీ తెలిపింది. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల్లోకి వెళ్లి, సమగ్రంగా అధ్యయనం చేశాకే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వెల్లడించింది. ధరణి వచ్చిన తర్వాత వెంటనే పనులు జరగడం బాగానే ఉన్న, పారదర్శకత కొరవడిందన్నారున ఇదొక పెద్ద సమస్యగా పేర్కొన్న కమిటీ, మరింత లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది. భూములు కంప్యూటరైజ్డ్ అంటే వాస్తవికతకు అద్దం పట్టాలని, ధరణిపై చాలా కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తెలిపింది. ధరణి స్జబెక్టుపై అవగాహన కలిగిన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్?లో పాల్గొంటామని, భూ యజమానికి తెలియకుండా భూ లావాదేవీలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించింది. పోర్టల్ పేరు ఏదైమైనా హక్కుదారి పేరు ఆలనైన్‌లో ఉంటే మిగతా.. 2లో



## మంత్రి పొంగులేటితో ధరణి కమిటీ భేటీ

- మధ్యంతర నివేదికపై మంత్రితో చర్చలు

హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ధరణి కమిటీ మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యింది. ధరణి సమస్యలపై తక్షణ పరిష్కారాల కోసం ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇస్తామని సోమవారం ధరణి కమిటీ చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మధ్యంతర నివేదికపై రెవెన్యూ శాఖ మంత్రితో కమిటీ సభ్యులు చర్చలు నిర్వహించారు. బుధవారం సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు మరో రెండు జిల్లాలు... మొత్తం నాలుగు జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏలో ధరణి కమిటీ సమావేశం కానుంది. క్షేత్రస్థాయి భూ సమస్యలపై కమిటీ ఆరా తీయనుంది. భేటీ అనంతరం రెవెన్యూ శాఖ మంత్రికి పూర్తి స్థాయి మధ్యంతర నివేదికను కమిటీ సభ్యులు ఇవ్వనున్నారు. త్వరలోనే కమిటీ మధ్యంతర నివేదికపై సీఎం రేవంత్ రెడ్డితో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చించనున్నారు.



## జనవరి 31 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- గత చేదు అనుభవాలతో సిఆర్‌పిఎఫ్‌కు భద్రత


న్యూఢిల్లీ,జనవరి 23(వెలుతురు):
గతేడాది శీతాకాల సమావేశాల సమావేశాల చేదు అనుభవం దృష్ట్యా, పార్లమెంట్ భద్రతపై మరింత దృష్టిని సారించారు. గత పార్లమెంటులో అలజడి ఘటన తీవ్ర కలకలం రేపడంతో స్థానికంగా భద్రతపై అనేక సందేహాలు తలెత్తాయి. దీంతో ఆ భవన సముదాయంలో సమగ్ర భద్రత బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కు అప్పగించాలని నిర్ణయించిన కేంద్రం.. తాజాగా 140 మంది సిబ్బందిని మోహరించింది. జనవరి 31 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల వేళ పార్లమెంటు కాంప్లెక్స్ వద్ద సందర్శకులు, సామగ్రి తనిఖీల బాధ్యతలను వీరు నిర్వహించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 140 మందిలో 36 మంది సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగానికి చెందినవారు.
డిసెంబరు 13న లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా.. ఇద్దరు వ్యక్తులు పబ్లిక్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వెదజల్లారు. మరో ఇద్దరు భవనం వెలుపల ఆందోళన చేశారు. దీంతో పార్లమెంటు భవన సముదాయంలో భద్రతపై కేంద్ర హోంశాఖ పూర్తిస్థాయి మిగతా.. 2లో

## రాహుల్ యాత్ర అసోంలో అడ్డగింత

- అడుగుడుగనా బారికేడ్లు ఏర్పాటు
- గౌహతి సిటీలోకి రాకుండా నిషేధాజ్ఞలు
- రాహుల్ నక్సల్స్ పంథా అనుసరిస్తున్నారు
- మండిపడ్డ సిఎం హిమంత బిశ్వశర్మ
- రాహుల్‌పై కేసు పెట్టాలని పోలీసులకు ఆదేశం
- తన యాత్రతో బిజెపిలో భయం పట్టుకుందన్న రాహుల్

గౌహతి,జనవరి 23(వెలుతురు):
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రను అస్సాం పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గువాహటి నగరంలోకి ప్రవేశించకుండా సరిహద్దుల వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు. అయినప్పటికీ దూసుకురావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం తర్వాత రాహుల్ యాత్ర అస్సాం నుంచి నాగాలాండ్‌లోకి మిగతా.. 2లో





## బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

- శతజయంతి వేళ కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ,జనవరి 23(వెలుతురు):
బీహార్ దివంగత మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న ప్రకటించింది. వెనుకబడిన కులాల కోసం చేసిన కృషిని గుర్తిస్తూ.. ఆయన శతజయంతి సందర్భంగా భారతరత్న ప్రకటించారు. జననాయక్‌కు ప్రజలకు కర్పూరీ ఠాకూర్ సుపరిచితుడు. రెండుసార్లు బీహార్ సీఎంగా పనిచేశారు ఠాకూర్. జనతా పార్టీ తరపున 1970 డిసెంబర్ నుంచి 6 నెలలు, 177డిసెంబర్ నుంచి 1979 ఏప్రిల్ వరకు బీహార్ సీఎంగా ఉన్నారు.
బడుగు ,బలహీన వర్గాల కోసం కృషి చేశారు. విద్యార్థిగా క్విట్ ఇండియా,స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకు కూడా వెళ్లారు. కర్పూరీ ఠాకూర్ 1924 జనవరి 24న జన్మించాడు. 1988 ఫిబ్రవరి 17న కన్నుమూశారు. మరణానంతరం భారతరత్న వరించింది.

## ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదు

- కాళేశ్వరం అక్రమాలపై విచారణ నడుస్తోంది
- అవినీతిపరులు జైలుకెళ్లక తప్పదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా ఉన్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి జైలు తప్పదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కవితకూ కారాగారం తప్పదని పేర్కొన్నారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. భూ దోపిడీ దారుడు జగదీశ్ రెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదని అన్నారు. మిగతా.. 2లో




# భక్తజనసంద్రంగా అయోధ్య

- అయోధ్యకు పోటెత్తిన భక్తులు
- బాలరాముడి దర్శనానికి లక్షలాదిగా తరలిన ప్రజలు
- భక్తులను నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించిన సిబ్బంది
- బాలరాముడి కోసం ఉదయం నుంచే క్యూ
- తొలి రోజు దాదాపు 5లక్షల మందికి దర్శనం

అయోధ్య,జనవరి 23(వెలుతురు):
అయోధ్య, జనవరి 23: అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరుగగా, మంగళవారం నుంచి సామాన్య భక్తులకు రామయ్య దర్శనభాగ్యం కల్పించారు. వేకువజామునే ఆలయం వద్దకు లక్షలాది మంది తరలివచ్చారు. ప్రధాన మార్గమైన 'రామ్‌పథ్' వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోకి భక్తులను అనుమతించారు.
భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారిని నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఆలయం వద్ద పెద్ద క్యూలు దర్శనమిచ్చాయి. కొంత మంది భక్తులు పోలీసు లైన్లను కూడా దాటుకొంటూ వెళ్లారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయం వద్ద తోపులాట జరిగింది.



మధ్యాహ్నం 2 గంటల సమయానికి దాదాపు 2.5 లక్షల మంది ఆలయానికి వచ్చారని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ పేర్కొన్నారు. తొలి రోజు దాదాపు 5 లక్షల మంది రాములోరిని దర్శించుకునే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనావేశారు. మిగతా.. 2లో



## చెత్తకుప్పలో ఆధార్, పాన్ కార్డులు

- పోస్ట్‌మెన్‌ను సస్పెండ్ చేసిన అధికారులు

వికారాబాద్,జనవరి 23(వెలుతురు):
ప్రజలకు భద్రంగా అందాల్సిన ఆధార్, పాన్ కార్డులు, పలు ఉత్తరాలు చౌడాపూర్ గ్రామంలో చెత్త కుప్పల్లో మిగతా.. 2లో

## వచ్చే నెల నుంచే ఉచిత విద్యుత్

- 200 యూనిట్ల వరకు అమలు చేస్తాం
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
కరెంట్ బిల్లులపై రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు హామీ అమలు చేస్తామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండు వందల యూనిట్లలోపు కరెంట్ బిల్లు వచ్చే వారికి ఫిబ్రవరి నెల నుంచి ఉచిత్ విద్యుత్ హామీ అమలులోకి వస్తుందని వెల్లడించారు. నగరంలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ మంగళవారం సమావేశమైంది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు సభ్యులు శ్రీధర్ బాబు, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల అమలుపై చర్చించిన కమిటీ.. ఉచిత విద్యుత్ అమలుపై కీలక నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం హామీల అమలుపై గాంధీ భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామన్నారు.
వచ్చే నెల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తామన్నారు. ఇప్పటికే రెండు హామీలను అమలు చేశామని పేర్కొన్నారు. హామీల అమలుపై ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతామని మిగతా.. 2లో



## సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం

- 25న హైదరాబాద్‌తో బూత్ లెవల్ మీటింగ్
- ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఖర్గే

హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):
రానున్న సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రస్థాయిలో కార్యకర్తల సమావేశాలు ప్రారంభించనుంది. సంస్థాగతంగా కార్యకర్తలను ఉత్తేజపర్చేందుకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా ఆఫీస్ బేరర్ల మీటింగ్‌లో పాల్గొననున్నారు. వీటిలో మిగతా.. 2లో

# భక్తజనసంద్రంగా అయోధ్య

**మొదటిపేజీ తరువాయి..**
ప్రాణప్రతిష్ఠ జరిగిన సోమవారానికి ముందే భక్తులు అధిక సంఖ్యలో అయోధ్యకు చేరుకొన్నారు. వీరంతా నగరంలోని పలు చోట్ల విడిది చేశారు. రామ్‌లల్లా దర్శనం కోసం వీరంతా మంగళవారం ఉదయాన్నే ఒక్కసారిగా ఆలయం వద్దకు చేరుకోవడంతో రద్దీ ఏర్పడింది. కొంత మంది సోమవారం రాత్రి నుంచే మెయిట్ గేట్ బయట వేచిచూస్తున్నారు. ఆలయం ప్రవేశమార్గం రామ్‌పథ్ వద్ద భక్తులు ఇసుకేస్తే రాలనంతగా



కనిపించారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఆలయంలోకి ప్రవేశించేందుకు ముందుకు కదిలారు. మధ్యాహ్నానికి ఈ సంఖ్య మరింత పెరుగడంతో.. భక్తులను నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది కష్టపడ్డారు. ప్రవేశ మార్గం వద్ద తోపులాటలో ఒక భక్తుడు స్పృహ తప్పి పడిపోయాడు. భక్తులు సజావుగా బాలరాముడిని దర్శించుకొనేందుకు క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలు తీసుకొంటున్నట్టు అధికారులు వెల్లడించారు. 8 వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, పరిస్థితి నియంత్రణలో ఉన్నదని యూపీ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ శిశిర్ తెలిపారు.

### 250 కోట్ల ఏండ్ల నాటి శిలతో బాలక్‌రామ్ విగ్రహం తయారీ

శతాబ్దాల ఎదురుచూపులు ఫలించి 500 ఏండ్ల తర్వాత అయోధ్యలో కొలువైన రామచంద్రుని చూసి కోట్లాది మంది భక్తులు పులకించిపోతున్నారు. అయోధ్య రామాలయంలోని గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన బాలరాముని విగ్రహంలో ఉట్టిపడుతున్న జీవకళ శిల్పకారుని చాతుర్యాన్ని చాటుతుండగా, ఆ ప్రతిమకు సంబంధించి కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 51 అంగుళాల బాలరాముడి విగ్రహాన్ని తయారు చేసిన శిల 250 కోట్ల ఏండ్ల నాటిదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతిమ తయారీకి వినియోగించిన శిలపై భౌతిక-యాంత్రిక విశ్లేషణ చేయగా అది 250 కోట్ల ఏండ్ల క్రితం నాటిదని నిర్ధారణ అయినట్టు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) డైరెక్టర్ హెచ్ఎస్ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ శిల చాలా పటిష్టమైనదని, ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకుంటుందని, కొద్దిపాటి నిర్వహణతోనే ఈ ఉష్ణమండలంలో వేల సంవత్సరాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుందని వెంకటేశ్ తెలిపారు.

భూమి ఏర్పడిన తర్వాత ఉడుకుతున్న లావా చల్లారినప్పుడు చాలా గ్రానైట్ రాళ్లు తయారవుతాయని, అలాంటి గ్రానైట్ చాల దృఢంగా ఉంటుందని ఆయన చెప్పారు. కాగా, ఆలయ నిర్మాణంలో సంప్రదాయ డిజైన్లతో తీర్చిదిద్దిన శిలలు చాలా నాణ్యమైనవని, వెయ్యేండ్లకు పైగా చెక్కుచెదరకుండా ఉండేలా ఆలయాన్ని నిర్మించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

### 'బాలక్ రామ్'గా అయోధ్య రామయ్య

అయోధ్యలో ఆలయంలో ప్రాణప్రతిష్ఠ జరుపుకొన్న బాలరాముడికి 'బాలక్ రామ్'గా నామకరణం చేసినట్టు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాలుపంచుకొన్న పూజారి అరుణ్ దీక్షిత్ మంగళవారం వెల్లడించారు. అయోధ్యలో కొలువుదీరన రామచంద్రమూర్తి ఐదేండ్ల పసిబాలుడిగా భక్తులకు దర్శనమిస్తున్నాడని, అందుకే ఈ పేరును నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.

### ఆలయంలోనే మరో రెండు విగ్రహాలు..

కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ నల్లరాయితో రూపొందించిన బాలరాముడి విగ్రహాన్ని అయోధ్యలో ఆలయంలో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. మరోవైపు రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ఎంపిక సమయంలో



పరిగణనలోకి తీసుకొన్న మరో ఇద్దరు శిల్పులు చెక్కిన విగ్రహాలను కూడా ఆలయంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంచనున్నట్టు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

అయితే ఆ రెండు విగ్రహాల ఫొటోలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు బయటకు రాలేదు. వాటిల్లో రాజస్థాన్‌కు చెందిన శిల్పి సత్యనారాయణ్ పాండే తెల్ల మార్బుల్‌తో రూపొందించిన రామ్‌లల్లా విగ్రహం ఫొటో ఒకటి తాజాగా బయటకు వచ్చింది. ఈ తెల్ల మార్బుల్ విగ్రహం ప్రస్తుతం ఆలయ ట్రస్టు వద్ద ఉన్నది. కుడి చేతిలో బాణం, ఎడమ చేతిలో విల్లుతో బాలరాముడు అందులో దర్శనమిస్తున్నాడు. విగ్రహం వెనుక భాగంలో విష్ణు అవతారాలకు సంబంధించిన చిన్న శిల్పాలు ఉన్నాయి.



# నల్లగండ బిఆర్ఎస్‌లో ముసలం?

### గుత్తా తీరుపై జగదీశ్ ఆగ్రహం
### ఓటమికి కారణం ఆయనేనంటూ వ్యాఖ్యలు
### రంగంలోకి దిగి సర్దిచెప్పిన కెటిఆర్
### కొడుకు ఎంపి సీటు కోసం గుత్తా పట్టు

**నల్లగొండ,జనవరి23(వెలుతురు):**
ఉమ్మడి నల్లగొండ బిఆర్ఎస్‌లో మెల్లగా ముసలం పుడుతోంది. మొన్నటి ఎన్నికల్లో సూర్యాపేట నుంచి మంత్రి జగదీవ్ రెడ్డి ఒక్కరే గెలుపొందారు. దీంతో ఆయన ఇతర నేతలపై పెత్తనం చెలయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మండలి ఛైర్మన్ గుత్తా సుకేందర్ రెడ్డి తీరుపైనా ఆయన వ్యాఖ్యలు చేయడంతో ఇప్పుడు సమస్య రాజుకుంది. ఆయన వల్లనే పార్టీ ఓడిందని వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై గుత్తా కూడా గట్టిగానే సమాధానం ఇవ్వాలని అనుకున్నారు. అయితే కెటిఆర్ వెంటనే రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించారని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి తానే కారణమైతే ఖమ్మం, మహబూబ్ నగర్ , వరంగల్ జిల్లాలో ఓటమికి ఎవరు కారణమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో గాలి వచ్చింది.. పార్టీ ఓడిపోయిందన్నారు. అభివృద్ధి చేసిన మంత్రులు కూడా ఓడిపోయారని చెప్పారు. ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎంపీ సీట్లతో పాటు నల్గొండ సీటు విషయంలో కూడా టఫ్ ఫైట్ ఉందన్నారు గుత్తా. పార్టీ అవకాశం ఇస్తే తన కొడుకు అమిత్ భువనగిరి లేదా నల్లగొండ సీటు నుంచి లోక్ సభకు పోటీ చేస్తారని చెప్పారు. దీనిపై మరో మూడు నాలుగు రోజుల తర్వాత అధిష్టానం క్లారిటీ వస్తుందన్నారు. ఇదే విషయాన్ని కెటిఆర్‌కు సూచించానని అన్నారు. కాంగ్రెస్ కు తాను దగ్గరయ్యేది ఉంటే బీఆర్ఎస్ నుంచి తన కొడుక్కి టికెట్ ఎందుకు అడుగుతానని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. తనపై కొందరు కావాలని బురద వేసే ప్రయత్నంలో ఉన్నారని పరోక్షంగా జగదీశ్ రెడ్డిపై మండిపడ్డారు. తాను పార్టీ వీడుతానని ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. ఇకపోతే కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్తే తెలంగాణకు గొడ్డలి పెట్టు లాంటిదని అభిప్రాయపడ్డారు. సాగు, తాగు నీళ్లకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్ట్ లు కెఆర్ఎంబి పరిధిలోకి పోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. ఉప ఎన్నికలు కాబట్టి ఎమ్మెల్యే కోటాలో రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు వేరువేరుగా జరిగాయన్నారు. బిఆర్ఎస్ బలంగానే ఉందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని గుత్తా చెప్పారు.

### ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు
# ఒక్క సీటూ రాదు

**మొదటిపేజీ తరువాయి..**
జగదీశ్ రెడ్డి రేపో, మాపో జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. జగదీశ్ రెడ్డి లీడర్ కాదని కేసీఆర్ దగ్గర బ్రోకర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు వేల ఓట్ల మెజార్టీతో బయటపడ్డ జగదీశ్ రెడ్డిది తనపై విమర్శలు చేసే స్థాయి కాదన్నారు. జగదీశ్ రెడ్డి హంతకుడు, దోపిడీదారు, అవినీతి పరుడని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో స్కూటర్ మీద తిరిగిన జగదీశ్ రెడ్డికి మెయినా బాద్ మండలంలో 80 ఎకరాల ఫాంహౌస్ ఎక్కడిదని ప్రశ్నించారు. నాగారంలో రూ. 60 కోట్లు పెట్టి ఇల్లు ఎలా కట్టారన్నారు. కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్? రావుకు మతి భ్రమించిందని, మెంటల్ ఆస్పత్రికి పోవడం పక్కా అని అన్నారు. అవినీతి కేసుల్లో విచారణ జరుగుతోందని,ఎంతటి వారైనా ఉపేక్షించమని అన్నారు. ఎంపి ఎన్నికల్లో బిఆర్ఎస్ ఖాళీ కాబోతోందని, ఆ పార్టీకి ఒక్కటంటే ఒక్కసీటు కూడా దక్కదని అన్నారు. బిఆర్ఎస్‌కు అబ్యర్థులు దొరకడం కూడా కష్టమేనని మంత్రి అన్నారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు పథకాలను ప్రారంభించామని, వచ్చే నెల నుంచి 200 యూనిట్ల లోపు వినియోగదారులకు ఫ్రీ కరెంటును అమల్లోకి తెస్తామని అన్నారు. ప్రతి రోజూ దాదాపు రూ. 10 కోట్లు వెచ్చించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. రెండు నెలల్లో సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ అందించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను నాశనం చేసిందని, నష్టాల ఊబిలోకి నెట్టేసిందని కోమటిరెడ్డి ఆరోపించారు. 82 ఏండ్ల యంగ్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డిని సీఎండీగా నియమించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని చెప్పారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులు, చత్తీస్ గఢ్ నుంచి కరెంటు కొనుగోళ్లను నామినేషన్ పద్ధతిన కాంట్రాక్టుకు ఇచ్చి 70వేల కోట్ల రూపాయల నష్టం చేసిన పెద్దమనిషి ప్రభాకర్ రావు అని ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి మీటింగ్ ఏర్పాటు చేసి రమ్మంటే ప్రభాకర్ రావు దాక్కున్నారని ఆరోపించారు. ఆయన ఎక్కడ దాక్కున్నా పోలీసులు వయస్సును చూడకుండా అరెస్టు చేసి తీరుతారని చెప్పారు. 200 యూనిట్లలోపు ఉచితంగా కరెంటు ఇవ్వకపోతే తమ ఇంటికి వెళ్లాలని జగదీశ్ రెడ్డి మాట్లాడటంపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.
గత ఎన్నికలకు ముందు కేసీఆర్ నిరుద్యోగులకు రూ. 3016 భృతి ఇస్తామని ప్రకటించారని, తాము రెచ్చగొట్టి ఉంటే కేసీఆర్ ఫాం హౌస్ ఉండేదా..? అని ప్రశ్నించారు.


# రాహుల్ యాత్ర అసోంలో అడ్డగింత

**మొదటిపేజీ తరువాయి..**
ప్రవేశించిన విషయం తెలిసిందే. తిరిగి మంగళవారం ఉదయం ఇరు రాష్ట్రాల సరిహద్దుకు చేరుకున్న రాహుల్.. స్థానిక యువతతో సంభాషించారు. అక్కడి నుంచి గువాహటి నగరానికి బయల్దేరారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తమ యాత్ర మార్గాన్ని మార్చు కోవాలని అంతకుముందు అస్సాం ప్రభుత్వం ఆదేశించింది. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా గువాహటిలో యాత్రకు అనుమతించడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఉదయం వెల్లడించారు. నగర బైపాస్ మీదుగా వెళ్లాలని సూచించారు. కానీ, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గువాహటి చేరుకున్నారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బారికేడ్లను దాటుకుని కార్యకర్తలు దూసుకొస్తుండగా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ అక్కడే ఉన్నారు. ఈ ఉద్రిక్తతలపై రాహుల్ మాట్లాడుతూ..ఇదే మార్గంలో బజ్‌రంగ్ దళ్ యాత్ర చేపట్టింది. భాజపా చీఫ్ నడ్డాజీ ర్యాలీ నిర్వహించారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. ఇప్పుడు మాత్రం మాకు బారికేడ్లు పెట్టారు. మేం వాటిని మాత్రమే దాటాం. చట్టాన్ని అతిక్రమించలేదని అన్నారు. దీనిపై అస్సాం సీఎం హిమంత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇది మా సంస్కృతి కాదు. మాది శాంతియుత రాష్ట్రం. ఇలాంటి నక్సలైట్ వ్యూహాలకు మేం వ్యతిరేకం. ఘర్షణలు జరిగేలా కార్యకర్తలను రెచ్చగొట్టినందుకు గానూ రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించా. కాంగ్రెస్ తమ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియోలనే సాక్ష్యాలుగా పరిగణించాలని చెప్పా అని సీఎం వెల్లడించారు. సోమవారం కూడా రాహుల్ యాత్ర సందర్భంగా అస్సాంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రముఖ వైష్ణవ సాధువు శ్రీమంత్ శంకర్‌దేవ జన్మస్థలి బతద్రవ సత్రను దర్శించుకోకుండా రాహుల్‌ను అడ్డుకున్నారు. దీనిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, మేఘాలయలో యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ ఇష్టాగోష్ఠికి స్థానిక అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మపై రాహుల్ గాంధీ మరోసారి ఫైర్ అయ్యారు. తానంటే హిమంత బిశ్వ శర్మకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. అసోం సీఎం హిమంత బిశ్వ ర్మ దేశంలోనే అత్యంత అవినీతిపరులైన ముఖ్యమంత్రులలో ఒకరని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అన్నారు. తన యాత్రకు బీజేపీ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. తనను ఎంత ఇబ్బంది పెడితే అంత మంచి జరుగుతుం దన్నారు. తనను కావాలనే కాలేజీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని అన్నారు. బీజేపీ తీరును యావత్ దేశం గమనిస్తోందన్నారు. మంగళవారం రాజధాని గౌహతి సమీపంలోని ఖానాపరాలో భారత్ జోడో యాత్రను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కాంగ్రెస్ శ్రేణులపై లాఠీ చార్చ్ చేశారు. వర్శిటీ బయటే మాట్లాడిన రాహుల్ తాను విద్యార్థులను కలిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందులేంటని ప్రశ్నించారు.

# సిఎం రేవంత్‌తో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేల భేటీ

### సిఎంను నివాసంలో కలుసుకున్న నలుగురు ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):**
సీఎం రేవంత్ రెడ్డిని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. సీఎం దావోస్ పర్యటన ఇటీవలే ముగించుకుని రావడంతో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. వీరు తమ తమ నియోజకవర్గాల్లో సమస్యలను, పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలవడంతో రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ కావటం చర్చనీయాంశం అయ్యింది.



రాబోయే లోక్ సభ ఎన్నికలపై బీఆర్ఎస్ పార్టీలో సమీక్షలు జరుగుతున్న సమయంలోనే.. నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కావటం ఆసక్తిగా మారింది. నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు.. మర్యాదపూర్వక భేటీ అని చెబుతున్నా రాజకీయంగా మాత్రం సంచలనంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ను వంద మీటర్ల లోతులో పాతిపెడతామని దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ రాజకీయాల్లో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలు 39 ముక్కలవుతారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కూడా కామెంట్స్ చేశారు. 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. మరో వైపు త్వరలో పులి బయటకొస్తది..ఆట మొదలు పెట్టదని బీఆర్ఎస్ నేతలు కౌంటర్ వేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తప్పుల తడకగా ధరణి పోర్టల్

**మొదటిపేజీ తరువాయి..**
అతనికి చట్టం పరంగా హక్కు ఉన్నట్లేనని, ధరణి కోసం పగడ్బందీగా చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని రెండు, మూడు అంచెలుగా పూర్తి చేయాలని కమిటీ భావిస్తోంది. ధరణి పోర్టల్ వల్ల భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా, చాలా సునిశితంగా చర్చించినట్లు కమిటీ తెలిపింది. మరోవైపు భూముల వివరాలను దాచి పెట్టుకునేందుకు ధరణిలో రైట్ టు ప్రైవసీ ఆప్షన్ కూడా ఉంది. దీనికి సంబంధించిన బటన్ నొక్కితే సంబంధిత భూముల వివరాలు పోర్టల్‌లో సాధారణంగా కనిపించవు. సాఫ్ట్‌వేర్ నిర్వహించే వ్యక్తులు, తహసీల్దారు, రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రమే కనిపిస్తాయి. అంది కూడా లాగిన్‌లోకి వెళ్లి చూడాల్సి ఉంటుంది. ఈ తరహా వెసులుబాట్లను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడినట్లు సర్కార్ భావిస్తోంది. హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో ప్రభుత్వ భూములు చేతులు మారాయి. ఏదో ఒక ఉత్తర్వును ఆధారంగా చేసుకొని అధికారుల సహకారంతో వారి పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ధరణిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తామని ఇప్పటికే స్పష్టం చేసింది. ఓ జిల్లా అధికారి 89 లావాదేవీలను ఆన్‌లైన్ చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. కొత్త ప్రభుత్వం అక్రమాలు జరిగినట్లుగా భావిస్తున్న సర్వే నంబర్లను ఇందులో ఉండటంతో తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం.

### జనవరి 31 నుంచి
# పార్లమెంట్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..**
సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలోనే సీఐఎస్ఎఫ్ బలగాలను రంగంలోకి దించింది. విమానాశ్రయాల్లో సెక్యూరిటీ తరహా సేవలను 'సీఐఎస్ఎఫ్' అందించనున్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌రే యంత్రాలు, డిటెక్టర్లతో సందర్శకులను, వస్తువులను తనిఖీ చేస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దాదాపు 1.70 లక్షల మంది సిబ్బందితో కూడిన 'సీఐఎస్ఎఫ్'.. కేంద్ర హోంశాఖ అధీనంలోని కేంద్ర సాయుధ పోలీసు దళం. ఇది దిల్లీలోని పలు కేంద్రశాఖల భవనాలతో పాటు 68 పౌర విమానాశ్రయాలు, అణుశక్తి, ఏరోస్పేస్ కేంద్రాలు, దిల్లీ మెట్రో వద్ద భద్రత కల్పిస్తోంది.

# సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం

**మొదటిపేజీ తరువాయి..**
భాగంగా తొలి సమావేశం తెలంగాణలో జరగనుంది. ఇటీవలే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎల్‌బి స్టేడియంలో జరిగే బూత్‌లెవర్ మీటింగ్‌లో ఖర్గే పాల్గొంటారు. జనవరి 28వ తేదీన ఉత్తరాఖండ్, 29న ఒడిస్సా, ఫిబ్రవరి 3న దిల్లీ, 4న కేరళ, 10న హిమాచల్ ప్రదేశ్, 11న పంజాబ్, 13న తమిళనాడు, 15న ఝార్ఖండ్ సమావేశాలు నిర్వహించ నున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. బూత్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు కేడర్‌తో ఖర్గే సమావేశమవుతారని తెలిపారు. వచ్చే ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తారన్నారు. ఇటీవల జనవరి 4వ తేదీన జరిగిన ఓ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ రేయింబవళ్లూ శ్రమించి 2024లో ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. విభేదాలను పక్కన పెట్టాలని, మీడియాలో పార్టీ అంతర్గత విషయాలను ప్రస్తావించవద్దని ఆయన శ్రేణులకు సూచించారు.

# వచ్చే నెల నుంచే ఉచిత విద్యుత్

**మొదటిపేజీ తరువాయి..**
మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు మంత్రి కోమటిరెడ్డి. గత ప్రభుత్వం కారణంగా లాభాల్లో ఉన్న రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, నిరుద్యోగ భృతి లాంటి ఎన్నో హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. లక్ష కోట్లను కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట నీళ్లపాలు చేశారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని తాను వదులుకున్నానని, అలాంటి తనపై బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అక్రమాలతోపాటు చత్తీస్‌గఢ్‌లో కరెంటు కొనుగోళ్లలో అవినీతి బయటపడుతుందన్న భయంతోనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లోపు అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా ఉచిత విద్యుత్ హామీ అమలుపై బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొత్త ఏర్పాటైన రోజు నుంచే ఎన్నికల హామీలను అమలు చేయాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు.. సీఎం రేవంత్ రెడ్డిని, మంత్రి కోమటిరెడ్డిని డిమాండ్ చేస్తున్నారు. రైతుబంధు నిధుల విడుదల తక్షణమే జరపాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన బీఆర్ఎస్ నేతలు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ హామీ ఏమైందని వీలు చిక్కినప్పుడల్లా నిలదీస్తున్నారు. అయితే గత ప్రభుత్వం చేసిన అప్పులు, ప్రాజెక్టులు, కరెంట్ పై విధివిధానాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాత సాధ్యమైనంత త్వరగా ఉచిత విద్యుత్ ను అమలు చేసి అక్కాచె÷-లలెమ్మలకు ఆర్థిక భారం తొలగిస్తామని చెబుతూనే ఉన్నారు. ఒకవేళ సాధ్యమైనంత త్వరగా ఉచిత్ విద్యుత్ పై ప్రకటన చేయకపోతే, రాష్ట్రం నుంచి కరెంట్ బిల్లులను ఢిల్లీలోని సోనియా గాంధీ ఇంటికి పంపించే ఉద్యమాన్ని చేపడతామని కేటీఆర్ ట్వీట్లు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచి రెండు వందల యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటన చేసింది.

# చెత్తకుప్పలో ఆధార్, పాన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి..**
లభ్యమైన ఘటనపై పోస్టల్ అధికారులు స్పందించారు. పోస్ట్‌మ్యాన్ నరసింహులను సస్పెండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం చౌడాపూర్ మండల పరిధిలోని చౌడాపూర్, మందిపల్, వీరాపూర్, విఠలాపూర్, అడవివెంకటాపూర్, మక్తవెంకటాపూర్ గ్రామాలకు నర్సింలు పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నాడు. 2011 నుంచి ప్రజలకు ఆధార్, పాన్ కార్డులు, ఇతర పోస్టు కార్డులు వందల సంఖ్యలో వచ్చాయి. వాటిని ప్రజలకు అందించకుండా ఇంట్లోనే సంచిలో దాచి ఉంచాడు. పోస్టుమ్యాన్ కూతురు అనుకోకుండా శనివారం గ్రామ పంచాయతీ ద్వారా చెత్త సేకరణకు వచ్చిన ట్రాక్టర్‌లో ఆ ఉత్తరాల సంచిని పడేసింది. సంచిని గమనించిన గ్రామస్థులు.. ట్రాక్టర్‌ను ఆపి చెత్తలో నుంచి ఐడీ కార్డులను తీసి చూడగా వందల సంఖ్యలో ఆధార్, పాన్ కార్డులు దొరికాయి. గ్రామానికి చెందిన చాలామంది అక్కడికి వచ్చి తమ ఆధార్ కార్డులను తీసుకున్నారు. మిగిలిన కార్డులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అప్పగించారు. దీంతో గ్రామస్థులు.. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోస్టుమ్యాన్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చెత్త ట్రాక్టర్‌లో దొరికిన ఆధార్ కార్డులపై నవాబుపేట్ పోస్టాఫీసు సిబ్బంది విచారణ చేపట్టి నరసింహులును సస్పెండ్ చేశారు.

### రాముడి స్ఫూర్తితోనే
# సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు లేఖలో మోడీ

**న్యూఢిల్లీ,జనవరి23(వెలుతురు):**
కేంద్ర ప్రభుత్వం పఠిస్తున్న 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రానికి రాముడే స్ఫూర్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీని ఫలితం ప్రస్తుతం అన్ని చోట్లా కనిపిస్తోందని చెప్పారు. గత దశాబ్ద కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందేందుకు ఈ మంత్రమే సహకరించిందన్నారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన లేఖ రాశారు. మీరు రాసిన లేఖ అందే సమయానికి నా మనసు భావోద్వేగంతో నిండిపోయి ఉంది. దాని నుంచి బయటపడేందుకు అది ఎంతగానో సహాయపడింది. అయోధ్య ధామ్‌లో గడిపిన క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. అయోధ్యను నా గుండెల్లో పెట్టుకొని దిల్లీకి తిరిగి వచ్చానని మోదీ తన లేఖలో పేర్కొన్నారు.అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని 11 రోజులపాటు ఎంతో నిష్ఠగా కార్యక్రమాలను నిర్వహించిన మోదీని అభినందిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల క్రితం లేఖ రాసిన సంగతి తెలిసిందే. సాహసం, కరుణ, కర్తవ్య నిష్ఠకు రాముడు ప్రతీక అని ఆమె అన్నారు. సుపరిపాలన అంటే ఇప్పటికీ రామరాజ్యమే గుర్తొస్తుందని, సత్యనిష్ఠ గొప్పతనాన్ని రాముడి వల్లే గ్రహించానని ఆమె లేఖలో పేర్కొన్నారు. జాతి నిర్మాతలకు రామాయణం ప్రేరణగా నిలిచిందన్నారు. పీఎం జన్‌మన్ ద్వారా గిరిజనుల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి చేసిన సంగతిని ముర్ము తన లేఖలో ప్రస్తావించారు.

# అధికారం కోల్పోయాక అమరులపై ప్రేమ

### త్యాగాలు చేసిన వారికి టిక్కెట్లు ఇస్తారా

### బిఆర్ఎస్‌కు బిజెపి నేత రఘునందన్ సవాల్

**హైదరాబాద్,జనవరి23(వెలుతురు):** అధికారం కోల్పోయాక కార్యకర్తలు గుర్తొచ్చారా అంటూ బీఆర్ఎస్‌ను బీజేపీ నేత రఘునందనరావు ఎద్దేవా చేశారు. త్యాగం చేసిన కుటుంబాలకు సీట్ల అవకాశం ఇస్తామని చెప్పే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్‌కు ఉందా అని నిలదీశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమకారులకు సీట్లు ఇస్తామంటోన్న కేటీఆర్.. మాటను నిలబెట్టుకోవాలన్నారు. శంకరమ్మ విషయంలో తమరు ఇచ్చిన మాట గుర్తు లేదా అని ప్రశ్నించారు. అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి అసలైన ఉద్యమకారులకు అవకాశం ఇస్తామని ప్రమాణం చేయాలన్నారు. మల్లన్న సాగర్, పోచమ్మసాగర్‌తో బీఆర్ఎస్ వందల కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. పొత్తు కుదరదని మోదీ చెప్పిన రోజే.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తెగదెంపులు అయ్యాయన్నారు. తెలంగాణా సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టారన్నారు. ఎంఐఎంతో నిన్నటి వరకు పొత్తు పెట్టుకుంది బీఆర్ఎస్ అని.. అదే ఎంఐఎంతో ఇప్పుడు కాంగ్రెస్ దోస్తీ చేస్తుందన్నారు. అప్పనంగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడికి భూములు అప్పగించి అధ్యక్షుడిని చేశారన్నారు. కవితకు సీటు ఇస్తారా?.. ఇవ్వరా? అసలు కవిత బీఆర్ఎస్‌లో ఉందా లేదా? అని ప్రశ్నించారు. మొదట శంకరమ్మ, ఎర్రోళ్ల శ్రీనివాస్ లాంటి వాళ్లకు సీట్లు ఇవ్వాలని రఘునందనరావు హితవుపలికారు. ఉద్యమకారులకు సీట్లు ఇస్తామంటోన్న కేటీఆర్..శంకరమ్మ విషయంలో మీరు ఇచ్చిన మాట గుర్తు లేదా అని నిలదీశారు. తెలంగాణా సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టి్రని అన్నారు. ఎంఐఎంతో నిన్నటివరకు పొత్తు పెట్టుకుంది బీఆర్ఎస్..అదే ఎంఐఎంతో ఇప్పుడు కాంగ్రెస్ దోస్తీ చేస్తుందని చెప్పారు. అప్పనంగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడికి భూములు అప్పగించారని విమర్శించారు.



# అయోధ్యలో దొంగల చేతివాటం

### భారీగా వచ్చిన భక్తులే లక్ష్యంగా దొంగతనాలు

### పరసులు, ఫోన్లు, బంగారం కొట్టివేత

**అయోధ్య,జనవరి 23(వెలుతురు):** అయోధ్యలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఇదే అదనుగా వారు తమ చోర నైపుణ్యంతో జేబులు గుల్ల చేశారు. దొరికింది దొరికినట్లుగా కొట్టేశారు. అయోధ్య ఆలయం ప్రారంభోత్సవం వరకు చీమ చిటుక్కుమన్నా పట్టేసిన పోలీసులు.. ప్రాణ ప్రతిష్ఠ వేడుకు ముగిసిన తర్వాత బాగా రిలాక్స్ అయ్యారు.. హై సెక్యూరిటీ అంతా మాయం అయ్యింది.. లోకల్ పోలీసులు కూడా కొంచెం సేదతీరారు. దీంతో రెండో రోజు అయోధ్య రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తుల తోపులాటలు జరిగాయి. ఇదే అదునుగా దొంగల చెలరేగి పోయారు.. దొంగతనాలకు పాల్పడ్డారు..ప్రాణప్రతిష్ట కార్యక్రమం వరకు భారీ భద్రతను ఏర్పాటు చేసిన యూపీ సర్కార్ ఇపుడు పూర్తిగా చేతులెత్తేసింది. జనవరి 23 నుంచి అయోధ్యలో భక్తులకు ఎంట్రీ ఇవ్వడంతో అయోధ్య రామ్ లల్లా దర్శనం కోసం భక్తులతో కిక్కిరిసిపోయింది. భద్రతను పెంచాల్సిన పోలీసులు అయోధ్య పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించారు. దీంతో వందలాది భక్తుల మొబైల్స్... పర్సులు... బంగారం చోరీకి పాల్పడ్డారు దొంగలు. స్థానిక పోలీస్ స్టేషన్లో భక్తులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు. భక్తుల నుంచి ఎఫ్ఐఆర్ తీసుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు పోలీసులు. దీంతో విలువైన వస్తువులు కోల్పోతున్నామని అయోధ్య భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గుండెపోటుతో విద్యార్థి మృతి

### కన్నీటి సంద్రంలో కుటుంబం

**హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):** హైదరాబాద్ నగరంలో విషాదం చోటు చేసుకుంది. కళ్ల ముందే కన్న కొడుకు గుండెపోటుతో చనిపోయాడు. కుందన్ బాగ్ లో నివాసం ఉండే డీసీపీ వెంకటేశ్వరుర్లు కుమారుడు చంద్రతేజ్(20) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం రాత్రి చంద్రతేజ్ కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనియినట్లు డాక్టర్లు తెలిపారు. చంద్రతేజ్ ఓ ప్రైవేట్ కాలేజీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఎన్నికల సమయంలో డీసీపీ వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. చంద్రదేజ్ మృతదేహాన్ని వారి స్వగ్రామం నల్గొండ జిల్లాకు తరలించారు. చంద్రతేజ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.


### మేడారం జాతర పనులు

# త్వరగా పూర్తి చేయాలి

**ములుగు,జనవరి 23(వెలుతురు):** మేడారం మహా జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా.ఎ.శరత్ అన్నారు. మంగళవారం ఆయన డైరెక్టర్ ఇ. వెంకట్ నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి, మేడారంలో చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వన దేవతలను దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు ఇప్పటి నుంచే వస్తున్నందున అందుబాటులోకి తేవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్యం తాగునీటి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేసేటట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, తాగునీరు, టాయిలెట్ తదితర అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలన్నారు. భక్తులకు చేపడుతున్న సౌకర్యాల కల్పనలో రాజీపడవద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, జాతరను విజయవంతం చేయాలన్నారు.

# పట్నవారం సందర్భంగా 70 లక్షల ఆదాయం

**చేర్యాల,జనవరి 23(వెలుతురు):** కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి పట్నం వారం సందర్భంగా రూ.70,22,307 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ



తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్జీత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా శనివారం రూ.11,84,726, ఆదివారం రూ.47,82,420, సోమవారం రూ.10,55,161 ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరం పట్నం వారానికి రూ. 49,83,819 ఆదాయం మల్లికార్జున స్వామి వారి ఖజానాకు సమ కూరినట్లు తెలిపారు.

నిరుడితో పోల్చితే ఈసారి రూ.20,38,488 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామి వారి ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# మేయర్ పీఠంకు ముప్పు..?

- గుప్పుమన్న అవిశ్వాసం
- మేయర్ అవినీతి అక్రమాలే అవిశ్వాసానికి కారణమా..?
- ఇన్నాళ్ల నుండి లేని అవిశ్వాసం ఇప్పుడెందుకు రగిలినట్టు..?
- అవినీతి వెనక ఉన్నదెవ్వరు...?
- మేయర్ పీఠం ఖాళీ అయితే పీఠం ఎవ్వరిని వరిస్తుంది...?

**వెలుతురు, పీర్జాదిగూడ:**
రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు చేర్పులు జరిగినట్టే.. అంతే స్పీడ్ గా మేడ్చల్ జిల్లాలో రాజకీయ మార్పులు జరుగుతున్నాయి.. బీఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుండి కాస్త గంపకింద కమ్మిన కోడి పిల్ల లాగే నిమ్మలంగానే ఉన్న మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు అవిశ్వాసం అనే పదం వినపడగానే ఉలిక్కి పడి లేచినంత పని చేశాడు.. అసంతృప్తితో ఉన్న కార్పోరేటర్లను విహార యాత్రల పేరుతోని చల్లబరిచేందుకు తీసుకెళ్ళాడు... అయినా వాళ్లు చల్లబడినట్టు ఏం కనిపించడం లేదు అనే వార్తలు జిల్లా అంతట గుప్పుమంటున్నాయి.. తాజాగా 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.. దీంతో పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి పదవీ గండం తప్పెట్లు లేదు అనుకుంటున్నా్రరు అక్కడి రాజకీయం తెలిసిన ఉద్దండులు.. మారుతున్న రాజకీయ సమీకరణాలు చూస్తుంటే మేయర్ పీఠం మార్పు జరుగుడు ఖాయమే అనుకుంటున్నారు..

### ఫలించని గోవా మంత్రం..

మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై స్వంత పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు గతం నుండే వ్యతిరేకంగా ఉంటూ.. అసమ్మతి స్వరం వినిపిస్తున్నారు అనేది ఓపెన్ సీక్రెట్. అయితే వీటన్నింటినీ పక్కన పెడుతూ మాజీ మంత్రి మల్లారెడ్డి ఇరువర్గాలను సమన్వయం చేస్తూ ముందుకు నడిపించారు.. తాజాగా రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సమీకరణాలు ఒక్కసారిగా తలక్రిందులయ్యాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.. జరగబోయే పరిణామాలాను ముందగానే గ్రహించిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. ముందస్తు చర్యల్లో భాగంగా పీర్జాదిగూడ కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లు అందరిని ఈ నెల మొదటి వారంలో విహార యాత్రలకు తీసుకెళ్లాడు.. గోవా, దుబాయ్ లలో తిప్పుతూ అసమ్మతి కార్పొరేటర్లు అందరిని శాంతింప చేసే ప్రయత్నం చేశారు.. ఇక పరిస్థితి సద్దుమణిగిందనే అందరూ




అనుకున్నారు.. కానీ ఇంతలోనే ఎమైందో ఏమో.. మూలిగే ముసలి మీద తాటి పండు పడ్డట్టు పాత సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. దీంతో మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు మల్లారెడ్డి చేసిన ప్రయత్నాలు, పెట్టిన ఖర్చులు అన్ని బూడిదలో పోసిన పన్నీరు లాగే అయ్యాయి అనుకుంటున్నారు రాజకీయ నిపుణులు..

### పీఠం కింద పోటు పొడిచింది అవినీతేనా...?

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో 26 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లే ఉన్నారు. ఇందులో మొదటి నుండి మేయర్ జక్క వెంకట్ రెడ్డి తీరును వ్యతిరేకిస్తూ అప్పుడప్పుడు అసమ్మతి స్వరం వినిపించింది కూడా వాళ్లే.. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ తోపాటు ఇంకొందరు కార్పొరేటర్లు జతకట్టి మీడియా ముఖంగానే మేయర్ ఏకపక్ష నిర్ణయాలను, అవినీతి అక్రమాలను పాల్పడుతున్నారంటూ మొదటి నుండి ఆరోపణలు చేస్తూ వస్తూనే ఉన్నారు.. అప్పుడు రాష్ట్రంలో బలమైన పార్టీగా బీఆర్ఎస్ ఉండడం, అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ అండదండలు మేయర్ వెంకట్ రెడ్డికి ఉండడంతో పెద్దగా పట్టించుకోలేదు.. అందుకు అనుగుణంగానే వ్యతిరేక స్వరం వినిపించిన కార్పొరేటర్లు కూడా మాట్లాడినంత వరకు మాట్లాడి తర్వాత గంప కింద కమ్మిన కోడిపిల్లల తీరుగానే వ్యవహరించారు.. కానీ నేడు రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోవడంతో గంపకింద కమ్మిన కోడి పిల్లలకు రెక్కలొచ్చినట్టు అయింది.. ఇదే అదునుగా భావించిన అసమ్మతి కార్పొరేటర్లు మేయర్ వెంకట్ రెడ్డిపై అవిశ్వాసం పంజా విసిరేందుకు తయారైనట్టు తెలుస్తుంది..

ఇందులో మేయర్ వెంకట్ రెడ్డి అవినీతి అక్రమాలు ఇక భరించలేకనే అందరం ఒక్కటయ్యామని ఒక కార్పొరేటర్ మీడియా ప్రతినిధులతో నేరుగా చెప్పిన దాఖలాలు కూడా లేకపోలేదు.. దీంతో మేయర్ అవినీతి అక్రమాలే తన పీఠం క్రింద మంటపెట్టాయంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.. అసమ్మతి సెగలు గట్టిగా రాజుకుంటె వెంకట్ రెడ్డి పీఠం దిగుడు ఖాయమే.. అదే జరిగితే ఆ పీఠం ఎవ్వరిని వరిస్తుందనే చర్చకూడా ఇప్పుడు జోరుగా నడుస్తోంది..

మరి మారుతున్న రాజకీయ పరిణామాలు ఎటు దారి తీస్తాయో వేచి చూడాల్సిందే..





**పటాన్ చెరు వెలుతురు జనవరి 23:**
పటాన్ చెరు లోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు ఉర్సుకు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## పటాన్ చెరులో ఉర్సు ఉత్సవంలో పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి - కాట శ్రీనివాస్ గౌడ్

# కాంగ్రెస్ చేతికి రెండు మున్సిపాలిటీలు

### నేరెడుచర్ల, భువగిరిల్లో నెగ్గిన అవిశ్వాసం

**నల్లగొండ,జనవరి 23(వెలుతురు):**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. తన చేతిలో ఉన్న రెండు మున్సిపాలిటీలను కోల్పోయింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మంగళవారం ఉదయం నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ విజయ బాబుపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే అవిశ్వాసానికి బీఆర్ఎస్ కుచెందిన మున్సిపల్ చైర్మన్ హాజరుకాలేదు.13 మంది కౌన్సిల్ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేసారు. దీంతో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనున్నది.



త్వరలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకునే అవకాశం ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్‌లపై కూడా అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించారు.

మొత్తం 35 మంది కౌన్సిల్ సభ్యులకు... అవిశ్వాసానికి అనుకూలంగా 31 మంది కౌన్సిలర్లు ఓటు వేశారు. వీరిలో బీఆర్ఎస్ కు చెందిన 16 మంది కౌన్సిలర్లు , 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు ఓటు వేశారు. చైర్మన్, వైస్ చైర్మన్, ఇద్దరూ కౌన్సిలర్లు తీర్మానికి గైర్హాజరయ్యారు. ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకాకుండానే అవిశ్వాసం నెగ్గింది. త్వరలో ఛైర్మన్, వైస్ చైర్మన్ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయం వద్ద టపాసులు పేలుస్తుండగా అపశృతి చోటుచేసుకుంది.

రవి అనే యువకుడి చేతిలోనే బాంబు పేలడంతో అతని చేయి పూర్తిగా ఛిద్రమైపోయింది. చికిత్స కోసం వెంటనే హాస్పిటల్‌కు తరలించారు.

# భూదాన్‌పోచంపల్లికి నకిలీల బెడద

### ఇక్కత్ ప్రింటెడ్ చీరల అమ్మకం

### నకిలీలపై ఫిర్యాదుతో విజిలెన్స్ దాడులు

**భూదాన్‌పోచంపల్లి,జనవరి23(వెలుతురు):**
భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చీరలకు నకిలీచెద పట్టింది. ఇక్కడి షాపుల్లో చీరలు అంటే నమ్మకంగా కొనుగోలు చేస్తారన్న బరోసాతో కొందరు సూరత్ నకిలీ ఇక్కత్ ప్రింటెడ్ చీరులు అమ్ముతున్నారు. భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలో కొన్ని షాపులు నకిలీ ఇక్కత్ చీరలు, నకిలీ ప్రింటెడ్ చీరలను విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం నాడు తనిఖీలు చేపట్టారు. హ్యాండ్లూమ్ షాపుల నుంచి నకిలీ ప్రింట్ ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు. ఆ షాపు యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఆ చీరలను పరిశీలించి చూస్తే తప్ప నకిలీవి అని తెలియదు. అచ్చం సూరత్ నుంచి తీసుకొచ్చిన చీరల మాదిరిగా కనిపించాయి. ఇక్కత్ చీరలు అంటే భూదాన్ పోచంపల్లి పెట్టింది పేరు. ఆ చీరలు ఇక్కడే పుట్టాయని చెబుతుంటారు. చీరలకు రంగులు వేసే సంప్రదాయ పద్ధతిని ఇక్కత్ అని జీవన ఆధారం చీరల నేయడమే. ఇక్కత్‌ను ఒక చీరల్లో కాదు సల్వార్లు, స్కర్ట్, అనార్కలీ,



పిలుస్తారు. చీరకు ఎక్కడ రంగు వేయాలో ఊహించుకొని అక్కడ వేస్తారు. ఈ పద్ధతిని రెసిస్ట్ డైయింట్ అంటారు. దారాలకు రంగులేసి, డిజైన్లను వేస్తారు. పురాతన పద్ధతుల్లో రెసిస్ట్ డైయింగ్ ఒకటి. పోచంపల్లి ఇక్కత్ చీరలు 1800 కాలంలోనే మంచి పేరు గడించాయి. పోచంపల్లిలో దాదాపు 10 వేల కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాల లెహంగాల్లో కూడా ఉపయోగిస్తారు. చీరల ప్రామాణికతను నిర్ధారించే జియగ్రాఫికల్ ఇండికేటర్ 2005లో పోచంపల్లికి లభించింది. పోచంపల్లి చీరలను సెలబ్రిటీలు ధరించారు. ఐశ్వర్యరాయ్ తన పెళ్లి, రిసెప్షన్‌లో పోచంపల్లి చీర కట్టుకున్నారు. అయితే ఇక్కత్‌కు కొందరు చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. భూదాన్ పోచంపల్లిలో గల షాపుల్లో కొందరు నకిలీ చీరలను విక్రయిస్తున్నారు. ఇతర చోట్ల నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి జనాలను మోసం చేస్తున్నారు. వారిని బురిడి కొట్టించి మోసం చేస్తున్నారు. విజిలెన్స్ అధికారుల సోదాలతో కొన్ని షాపు నిర్వాహకులు చేస్తోన్న మోసం బట్టబయలైంది. భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో వస్త్ర దుఖానాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్‌మెంట్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇక్కత్ వస్త్రాలను పోలిన డూప్లికేట్ చీరలను అమ్మకాలు జరుపుతున్నారన్న సమాచారంతో 15 మంది బృందంతో వస్త్ర దుఖానాల్లో తనిఖీలు చేపట్టారు. షాపుల్లో ప్రస్తుతం ఉన్న స్టాక్, బిల్లులను వారు పరిశీలించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఇక్కత్ చీరలకు బదులుగా సూరత్ నుంచి ప్రింటింగ్ చీరలు తీసుకొచ్చి ఇక్కత్ చీరెలు పేరుతో విక్రయిస్తున్నారనే సమాచారంతో ఉన్నతాధికారుల సూచన మేరకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# సంపాదకీయం..

## పన్నుల హేతుబద్ధతతోనే రామరాజ్యం!

రామరాజ్య స్థాపనకు కంకణం కట్టుకున్న ప్రధాని నరేంద్రమోడీ..అందుకు అనుగుణంగా అడుగులు వేయాల్సి ఉంది. మోడీ సమర్థత కారణంగానే అయోధ్య రామమందిర వివాదం సమసింది.దాదాపు 500 ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం దక్కింది. ఈ వివాదంలో ఎందరో అసువులు బాసారు. ఇది రావణకాష్టం లా ఇలాగే ఉంటుందా అన్న భయాలు ఉండేవి. అలాగే మోడీ సమర్థత కారణంగానే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దయ్యింది. ఆయన సమర్థత కారణంగానే పలు సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఈ క్రమంలో ఇక సామాన్యుల బతుకులు బాగుపడేలా చర్యలకు పూనుకోవాల్సి ఉంది. ఇవే ఇప్పుడున్న ప్రధాన సవాళ్లుగా గుర్తించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలుసుకుంటేనే ఈ సమస్యలు అర్థం అవుతాయి. ప్రధానంగా ఆహార ధాన్యాల ధరలను అదుపు చేయడం, పెట్రో ధరలను జిఎస్టీ పరిధిలోకి తీసుకుని రావాల్సి ఉంది. ఎందు కంటే ఏకీకృతపన్ను విధానం గురించి చెబుతున్న మోడీ ఇక్కడ మాత్రం ఇంకా వ్యాట్ అమలు చేయడం సరికాదు. అలాగే జిఎస్టీతో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రధానంగా జిఎస్టీని వ్యాపారులు కట్టే పన్నుగా చూడరాదు. ఇది నేరుగా ప్రజలపై భారం పడుతోంది. దీంతో బంగారం కొనేవాళ్లకు, ఇళ్లు కొందామను కున్న వారికి, ఇన్సూరెన్స్ తీసుకుంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతు న్నారు. మోయలేనంతగా పన్నుల భారం ప్రజల నడ్డి విరుస్తోంది. ఇన్‌కమ్ టాక్స్ కూడా వెసలుబాటు చూడాలి. నెలకు లక్షా 70 వేల కోట్ల ఆదాయం జిఎస్టీ ద్వారా వస్తుందని అనుకోవడం సరికాదు. హేతు బద్ధీకరణ చేస్తే 2 లక్షల కోట్లు కూడా రాబట్టవచ్చు. ఈ క్రమంలో ఎన్నికలకు వెళుతున్న వేళ సామాన్యుల గుండె చప్పుడు వినాలి. సామాన్యుల మన్‌కీ బాత్ వింటేనే సమస్యలు తెలుస్తాయి. ఢిల్లీలో అధికారులతో కూర్చుంటే సమస్యలు అర్థం కావు. జిఎస్టీ గురించి చర్చ పెట్టాలి. మరో వారం రోజుల్లో పార్లమెంట్ ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రానున్నాయి. ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్‌కు వెళతారు. ఇప్పటికే ఏ రంగానికి ఎంత కేటాయింపులో నిర్ణయించి ఉంటారు. అయితే ఎన్నికల కు ముందు అన్న ధోరణి చాలాకాలంగా నడుస్తోంది. అలా కాకుండా దేశంలో ప్రజలు తమ బతుకులు తాము బతికేలా చూడాల్సిన అవసరం ఉంది. పెట్రో, గ్యాస్, ఇంటి కొనుగోళ్లు, ఉద్యోగాలకు అవసరమైన అవకాశాలు రావాలి. కేంద్రంలో ఉన్న బిజెపి కావచ్చు..రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు కావచ్చు... ప్రజలను దృష్టిలో పెట్టుకుని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. ఉన్న దాంట్లో సర్దుకుని బతుకుదామనుకున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పన్నుల భారంతో ప్రజల నడ్డి విరుగుతోంది. భవిష్యత్తు మీద, దేశ ప్రజల మీద ఆలోచనలు లేని ప్రభుత్వాలు ప్రజల మీద స్వారీ చేస్తున్నాయి. కరోనాతో పూర్తిగా దివాళా తీసిన ప్రజలపై ధరలతో దాడులు చేస్తున్నారు. వారి నడ్డివిరిగి లేవలేని విధంగా మోదుతున్నారు. అధికార దండం ఉందికదా అన్న రీతిలో పాలకుల తీరు ఉంది. సామాన్యుడు బతకడమెలా అన్నది ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. ఏం చేస్తే బాగుపడతారు..ఎలా చేస్తే ఉపాధి దొరుకుతుంది..ఏ పథకాల వల్ల నిరుద్యోగం పోతుంది.. ఏం చేస్తే రైతులు బతుకుతారు.. నిరుద్యోగు లకు ఉపాధి లేదా ..ఉద్యోగం కల్పించడం ఎలా అన్నఆలోచనలను పాలకులు విస్మరించారు. తాము చేసేదే గొప్ప అన్న రీతిలో పాలకలు ముందుకు సాగుతున్నారు. దేశంలో ఇంధన ధరలు చూస్తుంటే పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు బలవుతున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కేంద్రం సామాన్యుల గురించి మాట్లాడడం లేదు. చాయ్‌వాలానని ఘనంగా చెప్పు కుంటున్న ప్రధాని మోడీ గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా..రెండు సార్లు ప్రధానమంత్రిగా వెలుగొందుతున్నా.. సామాన్యుల నాడి పట్టడంలో
విఫలమయ్యారు. అయోధ్య ప్రారంభోత్సవంలో రామరాజ్యం గురించి ప్రస్తావించారు కనుక..ఇప్పటికైనా ప్రజల మన్‌కీ బాత్ అర్థం చేసుకోవాలి. జిఎస్టీ పేరుతో లక్షల కోట్లు వసూలు చేయడం పరమావధిగా బిజెపి ప్రభుత్వం సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలతో ఓరకంగా చెప్పాలంటే సర్కార్ వ్యాపారం చేస్తుందనే చెప్పాలి. ఇబ్బడిముబ్బడిగా పన్నులు పెంచుతూ దానిని ప్రజలకు అందకుండా చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకు రవాణా భారం పెరిగి వివిధ రకాల వస్తువులపైనా ధరల మోత మోగుతుందన్న ఆలోచన చేయడం లేదు. పెట్రోల్ అన్నది సామాన్యుని వస్తువు. కార్లు, టూ వీలర్లు ఇప్పుడు సామాన్యుల కోసం మాత్రమే అని గుర్తించాలి. రవాణా కోసం వారు వీటిని ఉపయోగించక తప్పడం లేదు. మనదేశంలో సరైన ప్రజారవాణా లేకపోవడం వల్ల సామాన్యులు సైతం టూ వీలర్లను, కార్లను ఉపయోగిస్తున్నారు. ఇంధన ధరలు మండిపోతుండటంతో వినియోగ దారులపై భారాన్ని తగ్గించేం దుకు సుంకాన్ని తగ్గించాల్సి కేంద్రం,రాష్ట్రాలు దాని గురించి ఆలోచించడం లేదు. ఇప్పటికే ధరలమోత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య దేశంలో వంటగ్యాస్ భారం కూడా సామాన్యులపై పడింది. భారత్‌ను ఏళ్లుగా నిరుద్యోగ సమస్య వెంటాడుతోంది.

ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తక్షణమే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నా.. వాటిని విస్మరించారు. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పన, తయారీ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలకు కేంద్రం విరివిగా ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలి. అందుకు బడ్జెట్ సమావేశాల్లో ప్రణాళిక సాగాలి. బడ్జెట్ ద్వారా ప్రజల కష్టాలకు చెక్ పడాలి. ఉన్న ఆదాయవనరులను పేదలకు ఉపయోగపడేలా, సామాన్యులకు ఊరడింపు కలిగేలా చర్చలు చేయాలి. బడ్జెట్ అన్నది ఏటా జరిగే ఓ తంతుగా మారరాదు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకుని ముందుకు సాగాలి. ఎన్నికలు వస్తున్న తరుణంలో మోడీ ప్రభుత్వం మరోమారు ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నది. ప్రజలంతా నిస్సత్తువగా ఆశగా చూస్తున్న వేళ బడ్జెట్‌పై ఆశలు కలిగించాలి. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికి చర్యలు చేపడుతూనే దీర్ఘకాలంగా ఉన్న నిరుద్యోగం, ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.




### ఈ రామనామ తేజం - ఆ రసమయ సౌశీల్యం

- శ్రీతేజ కలం

హిమగిరుల వందన ప్రమోదం
గిరివరుల వసంత మేఘోత్సాతం !!

పడమటి సంధ్యల తోరణ శోభితం
శిశిర వర్ణముల అద్భుత మందారం !!

సప్తసంద్రముల సంతుష్ట సంగమం
ఐరావతముల ఘీంకార అభివందనం !!

నెమలి పింఛముల కళల అలంకారం
హంస వాహినుల ఓంకార వింజామరం !!

జలపాతముల సువర్ణ నందన గమనం
కోయిలమ్మ గానముల అమృత సంగీతం !!!



- శశికాంత్ మెంచు
(91)789-316-9944

### సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు

# జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ జీ

**సీనియర్ రాజకీయ నాయకులు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ**


సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ జీ శతజయంతి నేడు. కర్పూరీ ఠాకూర్ గారిని కలిసే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు. అయితే, , ఆయనతో సన్నిహితంగా పనిచేసిన కైలాసపతి మిశ్రా గారి నుంచి ఆయన గురించి చాలా విన్నాను. అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన నాయి సమాజ్‌కు చెందిన వ్యక్తి కర్పూరీ ఠాకూర్. ఎన్నో అడ్డంకులను అధిగమించి అకుంఠిత దీక్షతో శ్రమించి పనిచేసిన కర్పూరీ ఠాకూర్ సమాజ అభ్యున్నతికి కృషి చేశారు.

నిరాడంబరంగా జీవించిన జన్ నాయక్ కపూర్ ఠాకూర్ గారు సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారు. తన చివరి శ్వాస వరకు నిరాడంబరమైన జీవనశైలి అనుసరించిన ఆయన సామాన్య ప్రజలతో మమేకమై సమాజ న్యాయం కోసం కృషి చేశారు.

ఆయన నిరాడంబరత చాటిచెప్పే ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన కుమార్తె వివాహంతో సహా ఏదైనా వ్యక్తిగత వ్యవహారాలకు తన సొంత డబ్బు ఖర్చు చేయడానికి అతను ఇష్టపడేవారని అతనితో పని చేసిన వారు గుర్తు చేస్తారు. . బీహార్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో రాజకీయ నాయకుల కోసం కాలనీ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని, అయితే ఆయన స్వయంగా ఎలాంటి భూమి, డబ్బు తీసుకోలేదు. 1988లో ఆయన మరణించినప్పుడు పలువురు నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. ఆయన ఇంటి పరిస్థితి చూసి కన్నీటి పర్యంతమయ్యారు.ఒక గొప్ప వ్యక్తి అంత చిన్న ఇల్లు లో ఎలా నివసించారు!

ఆయన నిరాడంబరతకు అద్దం పట్టే సంఘటన ఒకటి 1977లో బీహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దీ రోజుల తర్వాత చోటు చేసుకుంది. అప్పుడు ఢిల్లీ, పాట్నా లో జనతా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో లోక్ నాయక్ జేపీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాట్నాలో జనతా నేతలు సమావేశమయ్యారు.జేపీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు అనేకమంది ప్రముఖులతో కలిసి చిరిగిన కుర్తా తో ముఖ్యమంత్రి హోదాలో శ్రీ కర్పూరీ ఠాకూర్ కూడా వెళ్లారు. ఇది చూసి శ్రీ చంద్రశేఖర్ గారు తనదైన శైలిలో కర్పూరీ ఠాకూర్ కొత్త కుర్తా కొనుక్కోవడానికి కొంత డబ్బు విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. డబ్బులు స్వీకరించిన కర్పూరీ ఠాకూర్ ఆ మొత్తాన్ని సీఎం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. అదీ కర్పూరీ ఠాకూర్ గొప్పతనం! తనకు సాటి ఎవరూ లేరని కర్పూరీ ఠాకూర్ తన ప్రవర్తనతో చాటి చెప్పారు.

సామాజిక న్యాయం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ పరితపించారు. సామాజిక హోదా తో సంబంధం లేకుండా వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని ఆయన కోరుకున్నారు. ప్రతి ఒక్కరికి అవకాశాలు లభించే సమాజాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కలలు కన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో




. భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి ఆయన పట్టుదలతో కృషి చేశారు.



కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న సమయంలో రాజకీయ రంగంలో ఉన్న జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు. , కాంగ్రెస్ దాని వ్యవస్థాపక సూత్రాల నుంచి పక్కదారి పట్టింది అని ఆయన చాలా ముందుగానే గుర్తించి ఆయన స్పష్టమైన కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు.

1950వ దశకం ప్రారంభంలో జన్ నాయక్ కపూర్ ఠాకూర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ప్రారంభం నుంచి ఆయన కార్మికవర్గం, కూలీలు, చిన్న రైతులు, యువకుల పోరాటాలకు అండగా నిలిచారు. చట్టసభల్లో కార్మికులు, కూలీలు, యువత గళం వినిపించి తిరుగులేని శక్తిగా ఎదిగారు. విద్య కు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తన రాజకీయ జీవితమంతా పేదలకు విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి కృషి చేశారు. స్థానిక భాషలో విద్యా బోధన జరగాలి అని సూచించారు. దీనివల్ల చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు జీవితంలో విజయం సాధించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఆయన భావించారు. ముఖ్యమంత్రి గా సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం అనేక చర్యలు అమలు చేశారు.

ప్రజాస్వామ్యం, చర్చలు, సమావేశాలు కర్పూరీ ఠాకూర్ వ్యక్తిత్వంలో అంతర్భాగంగా నిలిచాయి. . చిన్నతనంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సమయంలో, అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన సమయంలో ఈ స్ఫూర్తి ఆయనలో మళ్లీ కనిపించింది. జేపీ, డాక్టర్ లోహియా, చరణ్ సింగ్ వంటి వారు ఆయన ప్రత్యేక దృక్పథాలను ఎంతగానో ప్రశంసించారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ చేసిన భారతదేశ చరిత్రలో నిలిచిపోతుంది. వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు తగిన గుర్తింపు, అవకాశాలు, గౌరవం లభించాలని ఆయన పట్టుదలతో పని చేశారు. దీనికోసం ఆయన రూపొందించిన విధానాలకు తీవ్ర ర్వ వ్యతిరేకత వచ్చింది. అయితే, ఆయన వ్యతిరేకతకు తలొగ్గలేదు. ఒత్తిళ్లకు లొంగలేదు. పుట్టుక ఒకరి భవితవ్యాన్ని నిర్ణయించదు అన్న దృఢ విశ్వాసం తో ఆయన పనిచేసి విధానాలు రూపొందించారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసే విధానాలు అమలు చేశారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన ఆయన అన్ని వర్గాలకు చెందిన ప్రజల కోసం పనిచేశారు. సంకుచిత భావాలతో ఆయన పని చేయలేదు. ఈ స్వభావం ఆయనకు గుర్తింపు, గౌరవం లభించేలా చూసింది

జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకుని గత పదేళ్లుగా మా ప్రభుత్వం పని చేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది. అయితే, కర్పూరీ ఠాకూర్ వంటి కొద్దిమంది నాయకులకు మినహా సామాజిక న్యాయం నినాదం కేవలం రాజకీయ నినాదంగా మిగిలి పోవడం మన రాజకీయ వ్యవస్థలో అతి పెద్ద విషాదం. కర్పూరీ ఠాకూర్ విధానాల నుండి స్ఫూర్తి పొంది సమర్థవంతమైన పాలన విధానాన్ని అమలు చేస్తున్నాం. .గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం బారి నుంచి విముక్తి పొందారు. వీరంతా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వారు. వలస పాలన నుంచి విముక్తి పొంది దాదాపు 70 సంవత్సరాల తర్వాత కూడా వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభించ లేదు. సామాజిక న్యాయం సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తుంది. మా ప్రభుత్వ విధానాలు, సాధించిన విజయాలు చూసి జాన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను.


నేడు ముద్రా రుణాల వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న తరుణంలో కర్పూరీ ఠాకూర్ కళలు గన్న ఆర్థిక స్వావలంబన కార్య రూపం దాలుస్తోంది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను పొడిగించే అదృష్టం మా ప్రభుత్వానికే దక్కింది. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పనిచేస్తున్న ఓబీసీ కమిషన్ (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది) ఏర్పాటు చేసిన ఘనత కూడా మాకు దక్కింది. మా పిఎం-విశ్వకర్మ పథకం భారతదేశం అంతటా ఒబిసి వర్గాలకు చెందిన కోట్లాది మందికి శ్రేయస్సు కొత్త అవకాశాలు అందుబాటులోకి తెచ్చింది.

వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తి గా నేను జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం చాలా ఉంది. దురదృష్టవశాత్తూ 64 ఏళ్ల వయసులో కర్పూరీ ఠాకూర్ మరణించారు. చాలా అవసరమైన సమయంలో మనం కర్పూరీ ఠాకూర్ మనకు దూరం అయ్యారు. . అయినా ఆయన తన పని వల్ల కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నిజమైన ప్రజా నాయకుడు!

# ఆర్థికస్థితి గాడిన పడేనా..?

దేశంలో యువతకు ఉద్యోగాలను కల్పించాలంటే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడం కీలకం. భవిష్యత్‌లో ప్రభుత్వ ఖజానాకు స్థిర ఆదాయం రావాలన్నా, పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రావాలన్నా ఇందులో ప్రభుత్వ పెట్టుబడులు ముఖ్యం. ఎన్నికల ముందు ప్రవేశ పెట్టనున్న ఓటాన్ అకౌంట్‌లో ఇలాంటి కసరత్తు జరగాలి. అది కొత్తగా ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత సాకారం కావాలి. ఆర్థిక నిపుణులు సైతం మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడుల అవసరాన్ని పలుమార్లు ప్రస్తావించారు. దీంతో పాటు ద్రవ్యలోటును అధిగమించడం, ఆత్మ నిర్భర భారత్ సాధించే దిశగా అడుగులు వేయడం వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో కీలకం కావాలి. ఈ సవాళ్లను ఎలాంటి పరిష్కార మార్గాలు చూపుతారో చూడాలి. గత కొంతకాలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగు
తుండటం ప్రభుత్వం సమర్థతగా అంచనా వేస్తోంది. ఇదంతా ప్రజల జీవనప్రమాణాలు పెరిగాయన్న ధోరణిలో ఉంది. ప్రతి పనికి జిఎస్టీ వసూలు చేయడం దారుణం కాక మరోటి కాదు. ఇన్సూరెన్స్‌పైనా జిఎస్టీ వసూళ్లు సామాన్యులకు భారంగా మారింది. ఇదంతా అభివృద్ధికి సూచిక అన్న రీతిలో ప్రధాని మోడీ భావిస్తున్నారు. ప్రజల ఆదాయాలు మునుపటి స్థాయిలో లేని కారణంగా జిఎస్టీ స్లాబులను తగ్గించాలన్న డిమాండ్ వస్తోంది. అయితే, డిమాండ్‌ను బడ్జెట్‌లో చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం కొన్ని రాయితీలు ప్రకటించడం అనివార్యం కావాలి. కరోనా సంక్షోభం తర్వాత అన్నీ ఇప్పుడిప్పుడే సర్దుకుంటు న్నాయి. ఈ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్టింగ్ ఇచ్చే బాధ్యత కేంద్ర ఆర్థిక మంత్రిపై ఉంటుంది. ఇలాంటి ప్రతికూల సమయంలో పెడుతున్న బడ్జెట్ తయారీ విషయంలో మంత్రి నిర్మలా సీతారామన్ ఆచితూచి ఆడుగేయాల్సి ఉంది. బాగా దెబ్బతిన్న రంగాలను గాడిలో పెట్టాల్సిన సమయం కావడంతో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ఎలాంటి నిర్ణయాలు, కేటాయింపులు చేయాలన్నదే చాలా కీలక అంశం. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాలలో అనేక మంది ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయి కనీసం బతుకు బండిని నడిపించడానికి కూడా చాలా అవస్థలు పడ్డారు. వారికి ఆశాదీపంలా బడ్జెట్ ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు. బడ్జెట్ అనగానే సగటు మనిషి ఎదురు చూసేది ఆదాయపు పన్ను శ్లాబు గురించే. వార్షికాదాయం రూ.5లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించాలన్న డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. అయినా, గత కొన్ని బడ్జెట్‌ల నుంచి ఆ ఊసే లేకుండా పోయింది. ఇటీవల జరిపిన ఓ సర్వేలో బడ్జెట్‌లో 40 శాతం మంది పన్ను ఊరట గురించే ప్రస్తావించడం బట్టి వారి ఆకాంక్షను అర్థం చేసుకోవచ్చు. పైగా కొవిడ్ కారణంగా ఆదాయాలు పడిపోయిన నేపథ్యంలో ఈ సారి ఈ డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది. వేతన జీవికి ఊరట కల్పించే ఈ నిర్ణయంపై ఆర్థికమంత్రి ఆలోచనల ఎలా ఉన్నాయో చూడాలి.

అతలాకుతలమైన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉంటుందా? కుదేలైన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు ఉంటాయా? వరాలు ప్రకటిస్తారా లేక పన్నులు వడ్డిస్తారా? లాంటి ఎన్నో ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో ఉన్నాయి. అటు ప్రభుత్వ, ప్రతిపక్ష, పారిశ్రామిక వర్గాల్లోనే కాకుండా ఇటు సామాన్య ప్రజలు సైతం ఈ బడ్జెట్‌పై ఉత్కంఠగా



ఎదురు చూస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇంతకుముందెన్నడూ లేనిదిగా ఈ బడ్జెట్ తయారు చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరికీ కేంద్ర బడ్జెట్ పై ఆశలు, అంచనాలు పెరిగిపోయాయి. కరోనా పుణ్యమా అని మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో లోటుపాట్లు బయటపడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు కేటాయింపులు పెంచాల్సి ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే ఆరోగ్య సంరక్షణకు మన దేశం వెచ్చిస్తున్న మొత్తం తక్కువగా ఉందనే చెప్పాలి. భవిష్యత్‌లో కరోనా లాంటి వైరస్‌లు వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను చక్కదిద్దు కోవాలి. జీడీపీలో కనీసం ఈ రంగానికి 2.5 శాతం కేటాయింపులు జరపాలి. వైద్య రంగానికి విడిగా ఒక 'నిధి' ని ఏర్పాటు చేయడంతో పాటు వైద్య రంగంలో పరిశోధనలకు మరిన్ని నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వైద్య రంగంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బలోపేతం చేయాలి. ప్రస్తుతం జీడీపీలో 1.4 శాతంగా ఉన్న వైద్య రంగ వ్యయాన్ని 2024 నాటికి 4శాతానికి పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం విధించుకున్న లక్ష్యాన్ని అందుకునేలా కేటాయింపులు ఉండాలి. ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెంపు, అసంఘటిత రంగాలు బలోపేతం చేయడం, మార్కెట్ గిరాకీ పెంచడం, దెబ్బతిన్న అన్ని రంగాలను గాడిలో పెట్టడం, పన్నుల భారం వేయకుండా, జనాల కొనుగోలు శక్తి పెంచేలా నిర్ణయాలు, కేటాయింపులు ఉండాల్సిన కీలక బడ్జెట్ ఇది. కరోనా కారణంగా ఎక్కువ దెబ్బపడింది టూరిజంపైనే. ప్రత్యేకించి విమానయానం, హోటళ్ల బిజినెస్ దారుణంగా దెబ్బతిన్నది. లక్షల మంది నిరుద్యోగులుగా మారారు. ఆ రంగాలను ఆదుకునేందుకు వాటిలో ఈక్విటీ పెట్టుబడులు పెట్టడం, పన్ను రిబేట్లు, పన్ను రాయితీలు కల్పించడం చాలా అవసరం. అదేవిధంగా భారీ వివాహాల వంటి ఎలాంటి వేడుకలు లేకపోవడంతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగం కుంగిపోయింది. ఆ రంగానికి అండగా నిలిచే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయాలి. ఉపాధి కల్పనకు మరో ప్రధాన రంగం రియాల్టీ ,హౌసింగ్. దేశంలో అసంఘటిత రంగానికి చెందిన కోట్లాది మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. ముఖ్యంగా ఎంఐజీల అర్హత, ప్రిన్సిపల్, వడ్డీ తిరిగి చెల్లింపు పరిమితులు పెంచితే ఈ రంగంలో డిమాండ్ పెరుగుతుంది. రియాల్టీ, హౌసింగ్ రంగంపై ఆధారపడ్డ సిమెంట్, ఐరన్, పెయింట్ వంటి ఇతర ఉప రంగాలు ప్రభావితమై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీని ద్వారా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి జనాలకు పనులు పెరిగితే వాళ్లకు కొనుగోలు శక్తి మెరుగవుతుంది. దీని ద్వారా మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. పారిశ్రామిక రంగంలో ఉపాధి పెంచే ఉద్దీపనాలు ఈ బడ్జెట్ లో ఉండాలని ఆ వర్గాల ప్రతినిధులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా మైక్రో, స్మాల్, మీడియం స్కేల్ పరిశ్రమ పన్నుల చెల్లింపుల విషయంలో ఒక ఏడాది పాటు రాయితీలు ప్రకటించాలని కోరుకుంటున్నారు. మన దేశంలో 50 శాతంఎగుమతులు మైక్రో, స్మాల్, మీడియం స్కేల్ సంస్థల ద్వారా జరుగుతున్నాయి. కాబట్టి వాటి ఉత్పత్తులపై ఎక్స్‌పోర్ట్ ట్యాక్స్ తగ్గించాలి. గడిచిన కొన్ని నెలలుగా జీఎస్టీ వసూళ్లు పెరిగినప్పటికీ, మార్కెట్లో గిరాకీ లేకపోవడంతో పరిశ్రమల టర్నోవర్ పెరగడంలేదు. ఉపాధి అవకాశాలు పెరిగితేనే మార్కెట్లో కొనుకోలు శక్తి పెరిగి గిరాకీ ఏర్పడుతుంది. బీమా, పింఛన్ విభాగాల్లో 49శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నారు. ఈ రంగంలో ఎఫ్‌డీఐలను 75 శాతం వరకు అనుమతించాలన్నది దీర్ఘకాల డిమాండ్. ఈ నేపథ్యంలో ఆ రంగంలోకి విదేశీ పెట్టుబడులు మరింతగా వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మరోవైపు ప్రస్తుత సంక్షోభ పరిస్థితులలో పరిశ్రమలకు కావలసిన 'వర్కింగ్ కాపిటల్'ను సమకూర్చడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలి. అలాగే ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బాకీలు మార్చి నాటికి 12.5 శాతానికి పెరుగుతాయన్న అంచనాలు ఉన్నాయి. వాటి నిరోధానికి సంబంధించి కూడా బ్జడెట్‌లో ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితులలో పన్నులు పెంచి ప్రజలపై భారం వేయడం ఏమాత్రం మంచి ఆలోచన కాదు. ట్యాక్సులు పెంచితే మార్కెట్‌లో డిమాండ్ పడిపోయే ప్రమాదం ఉంది. అందుకని కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయం పెంచుకోవాలి. ఇన్‌ఫ్రాస్టక్చర్, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు పెంచాలి. అలాగే ఎగుమతి, దిగుమతి సుంకాల విషయంలో లగ్జరీ వస్తువులపై ట్యాక్సులు పెంచవచ్చు. ఆటోమొబైల్, రిటైల్, ఇతర రంగాలపై పన్నుల విధానంలో మార్పులు చేయకపోవడమే మేలు. తిరిగి ఆర్థిక పరిస్థితి పట్టాలెక్కాలంటే ఈ సమయంలో ఉద్యోగ అవకాశాలు పెంచేవిధంగా, మార్కెట్ గిరాకీ పెరిగే బడ్జెట్ రావాలి.

# గిర్గెట్‌పల్లి బ్రిడ్జి దగ్గర సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
చాలా రోజులుగా స్థానిక గిర్గెట్ పల్లి వాసులు రైల్వే బ్రిడ్జి దగ్గర రోడ్డు సరిగ్గా లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందిని గుర్తించిన స్థానికులు మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్ ని మరియు కొంత మంది దాతల సహకారాన్ని కోరారు. ప్రజల ఇబ్బందినీ దృష్టిలో పెట్టుకొని కొంత మంది దాతలు మరియు మున్సిపల్



చైర్ పర్సన్ మంజుల రమేశ్ దీనికి ఆర్థిక సహాయం అందించారు. ఈ రోడ్డు నిర్మించడంలో సహకారం అందించిన దాతలు మరియు మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ గిర్గేట్ పల్లి గ్రామస్థులు ధన్య వాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సామ రాంచంద్ర రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సామ ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ అభినందనలు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా పామేన జ్యోతి భీమ్ భరత్ ఎన్నిక

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునీత రావు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను ఎంతో క్రమశిక్షణతో ప్రజలలో కి తీసుకు వెళ్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని అదేవిధంగా 6



గ్యారంటీలలో మహిళలకు పెద్ద ఎత్తున ప్రో సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకంతో పదవి అప్పచెప్పినందుకు దీనికి తగిన న్యాయం చేసే విధంగా కష్టపడి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులందరూ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఘనంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల స్థాయి, కార్యాలయాలు, పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉదయం 8:00 గంటలకే



పతావిష్కరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9:00 గంటలకు పతవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కలెక్టరేట్ లోని అన్ని శాఖల అధికారులు వారి సిబ్బందితో తప్పక కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారంగా అందరిని ఆహ్వానించాలని, ప్రాంగణంలో పారిశుద్ధ్యం, త్రాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టాల్స్‌తో పాటు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జీడిగడ్డతాండలో ఘనంగా 24వ పాత పంటల జాతర

**బండ్లకు పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించిన ఊరి పెద్దలు**

**చిరుధాన్య పంటల ద్వారా మనుషులకు మంచి తిండి దొరుకుతుంది**

**చిరుధాన్య పంటల ద్వారా భూసారాన్ని, వాతావరణాన్ని కాపాడగలుగుతున్నాం**

**నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా పంట భీమ నష్టం అందించాలి**

**జహీరాబాద్, 23 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం జీడిగడ్డ తాండలో డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ, పస్తాపూర్ ఆధ్వర్యంలో సంక్రాంతి రోజున ప్రారంభమైన 24వ పాత పంటల జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ జాతరలో తాండలోని ఊరి పెద్దలు బండ్లకు పూజ చేసి ఊరేగింపు ప్రారంభించినారు. గిరిజన నృత్యలతో, పాటలతో వీది వీదిన బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించినారు.

చంద్రమ్మ, విత్తనాల సంరక్షకురాలు, డిడియస్ సీనియర్ మెంబర్ మాట్లాడుతూ చిరుధాన్య పంటల ద్వారా మనుషులకు మంచి తిండి దొరుకుతుంది, అంతే కాకుండా పశువులకు కూడా మేత దొరుకుతుందని, భూసారాన్ని మరియు వాతావరణాన్ని కాపాడగలుగుతున్నామని తెలిపారు. ఈ జాతర ద్వారా ఎక్కువ మంది రైతులు పాత పంటలు పండించుకోని మన ఆరోగ్యం కాపాడుకోవలసిన అవసరం ఎంతైన ఉంది అని తెలిపినారు. లక్ష్మమ్మ, విత్తనాల సంరక్షకురాలు మాట్లాడుతూ పాత పంటలు పండించడం వల్ల మనకు మంచి తిండి దొరుకుంది, జీవాలకు మేత లభిస్తుంది. భూమికి కూడా ఈ పంటల ఆకు రాలి భూమికి బలాన్నిస్తుంది. ఈ పంటల తిండి ద్వారా మనిషికి అన్ని రకాల పోషకాలు లభిస్తాయి. ఎప్పటికి మనకు తిండి భద్రత కూడా ఉంటుంది. దేవిబాయి, రైతు జీడిగడ్డతాండ మాట్లాడుతూ డిడియస్ ఆఫీస్ ద్వారా మా తాండ వాసులకు ఈ పాత పంటలు పండించుకోవడానికి ఆర్థిక సహాయం అందించినారు, దీని వల్ల మేము మా తాండలో ఎక్కువ రకాల తిండి పంటలు పండించి,



మాకు కావలసిన తిండికి సరిపడ ధాన్యం పెట్టుకోని మిగిలింది డిడియస్ మార్కెటుకు అమ్ముతున్నాము అన్నారు. అనంతరం యన్. వినయ్ కుమార్, జాతర కో ఆర్డినేటర్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుండి పాత పంటల జాతర్లు చేసున్నాము. ఇప్పుడు మన పాత పంటలకు ప్రభుత్వం కూడా



గుర్తించింది, మన కుటుంబానికి సరిపడే. తిండి కొరకు ఈ పంటలను పండించుకోవాలి అన్నారు. ఈ పంటలు పండిస్తున్నటువంటి రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఎక్కువ పంటలు పండించే విధంగా ప్రోత్సాయించాలి అని తెలిపినారు.
సమయానికి వర్షాలు సరిగ్గా పడనందున కొన్ని పంటలు పోయినాయి, ఆ పంటలకు ప్రభుత్వం ద్వారా పంట భీమ నష్టం అందించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో డిడియస్ గ్రామ సూపర్వైజర్ కె. విజయలక్ష్మి మరియు డిడియస్ సిబ్బంది చుక్కమ్మ, పూలమ్మ, చిన్న నర్సమ్మ, జనరల్ నర్సమ్మ, లక్ష్మమ్మ, మంజుల, అల్గోల్ నర్సమ్మ, బాలయ్య, వినయ్కుమార్, కెవికె శాస్త్రవేత్త రమేష్ మరియు ఈ జాతరను తిలకించడానికి నర్సపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నుండి ఎ, ఉదయ్ కిరణ్, పవన్, రుక్మిణి దేవిగారు అంతే కాకుండా సి.యస్.ఎ నుండి సి.యస్.ఎ. ప్రతినిధులు మరియు ఆస్ట్రేలియా నుండి వచ్చినటువంటి వారు మరియు గ్రామానికి చెందిన రైతులు, డిడియస్ మహిళా సంఘం మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ఠ...

# ఆలయాలలో ప్రత్యేక పూజలు

**జహీరాబాద్, 23 జనవరి, వెలుతురు :**
అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని నారాయణ నగర్, రెడ్ హిల్స్ కాలోని, వెంకట రమణ కాలోనిలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుండి కాలోనిలలోని మహిళలు పురుషులు, చిన్నారులు, వివిద రకాల సంకృతిక



కార్యక్రమాలు భక్తులకు మంత్ర ముగ్ధులను చేశాయి. పట్టణంలోని హౌసింగ్ బోర్డు హనుమాన్ మందిరం నుండి నారాయణ నగర్ లో గల శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ఠ మంటపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నారాయణ నగర్, వెంకట రమణ కాలోని , రెడ్ హిల్స్ కాలోనివాసులు పాల్గొన్నారు. కరసేవకులు జనార్దన్ రెడ్డి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణలో భారీ సంఖ్యలో భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాల నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, పురుషులు





పాల్గొన్నారు. కార్యక్రమానికి వక్తగా కట్టా రాజగోపాల్, స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాలోనికి చెందిన ముఖ్య నాయకులు భక్తులకు అన్ని వసతులు కల్పించారు. కార్యక్రమంలో భాగంగా రాత్రి 10 గంటల నుండి భవాని మాత భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు.

# జహీరాబాద్‌లో మట్కా నిర్వాహకుని అరెస్టు

**ఎవరైన మట్కా జూదము నిర్వహించిన, లేదా ఆడిన వారిపై కఠిన చర్య తీసుకోనబడును :**

**జహీరాబాద్ టౌన్ ఎస్ ఐ శ్రీకాంత్**

**జహీరాబాద్, 23 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములో హౌజింగ్ బోర్డు కాలోని చివరన గల యమున వెంచర్ యందుతేది తేది : 11-01-2024 నాడు మహ్మద్ రఫి ఏ డ్రాగన్ రఫి ఆన్లైన్లో తన సెల్ ఫోన్ లో మట్కా జూదము నిర్వహిస్తుండగా అతనికి పట్టుకొని అతని వద్ద నుండి నగదు ఒక లక్ష రూపాయలు మరియు సెల్ ఫోన్ ను స్వాదీన పర్చుకోనైనదని జహీరాబాద్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీకాంత్ ప్రకటనలో వెల్లడించారు. అదేవిదంగా అతనికి సహకరించిన మరో నేరస్థుడగు మహ్మద్ సమియెద్దిన్ తండ్రి సలీమొద్దీన్, నివాసము శాంతినగర్, జహిరాబాద్ ను ఈ రోజు తేది: 23-01-2024 నాడు ఆరెస్టు చేసి ఆతని వద్ద నుండి నగదు ఒక లక్ష ఇరువై వేల




రూపాయలు (1,20,000) మరియు ఒక సెల్ ఫోన్ ను స్వాదీన పర్చుకోనైనదని మరియు ఎవరైన సరె మట్కా జూదము నిర్వహించిన, లేద ఆడిన వారి పై కఠిన చర్య తీసుకోనబడునని ఎస్ ఐ కె. శ్రీకాంత్ తెలిపారు.






## దత్తత ద్వారా తీసుకున్న పిల్లల పాలన బాగా చూసుకొని వారికి మంచి భవిష్యత్తు చూడాలి..

**- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశు గృహ ద్వారా నిర్వహించిన దత్తత కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దంపతులకు పిల్లలను దత్తత ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టబద్ధంగా దత్తత తీసుకున్న పిల్లల పాలన పాలనతో పాటు వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలన్నారు. పిల్లలు ఇద్దరి సంపద అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి, శిష్టుగృహ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## వాయిస్ టుడే తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

**క్యాలెండర్ ఆవిష్కరించిన మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి.**

**మేడిపల్లి, వెలుతురు:** సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలపై ఉక్కు పాదం మోపుతూ జర్నలిజం విలువలను కంటికి రెప్పలా కాపాడుతూ అత్యంత ప్రజాదారణ పొందిన వాయిస్ టుడే



తెలుగు దినపత్రిక 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మేడిపల్లి పోలీస్ స్టేషన్ (SHO) గోవిందరెడ్డి చేతుల మీదుగా వారి సమక్షంలో క్రైమ్ (CI) ఉపేందర్ రావు, ఎస్సైలు, మరియు రఘు, రాజ్ కుమార్, మల్లేష్, రమేష్ బాబు, బివి. రాజు, మమత తదితరులు వాయిస్ టుడే జనగాత్రం - మన నేత్రం తెలుగు దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

## రోడ్డు భద్రత అందరు పాటించాలి

**జహీరాబాద్ ఎమ్ వి ఐ జై. ప్రకాష్ రెడ్డి**

**జహీరాబాద్, 23 జనవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లాలో శాసనసభ నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణం పస్తపూర్ ఎక్స్ రోడ్డు 65 వ నంబరు జాతీయ రహదారి పక్కన ఆర్ టి ఓ ఆఫీస్ వద్ద మంగళవారం ఉదయం 35వ జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన



కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు వాహన దారులకు రోడ్డు భద్రత అవగాహనను వెకిల్ ఇన్స్పెక్టర్ జై. ప్రకాష్ రెడ్డి, ఎల్ అండ్ టి పెట్రోలింగ్ మరియు ఆర్టీసీ డీఏమ్ సూర్యనారాయణ, సంతోష్.. ద్విచక్ర వాహన దారులకు, ఆటో, బస్సు, లారి డ్రైవర్ కు రోడ్డు భద్రత కరపత్రాలను పంచుతూ ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్టీసీ సిబ్బంది, ఎల్ అండ్ టి సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## హెూతి (బి) గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం

**జహీరాబాద్, 23 జనవరి వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హెూతి (బి ) గ్రామానికి చెందిన వ్యక్తి సిరిసిగా మొగులప్ప తండ్రి సిరిసిగా తుల్జారం సోమవారం నుండి కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్టు జహీరాబాద్ రూరల్ ఎస్ ఐ తెలిపారు. జహీరాబాద్ రూరల్ ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం... జహీరాబాద్ మండలం హెూతి (బి ) గ్రామానికి చెందిన వ్యక్తి సిరిసిగా మొగులప్ప తండ్రి సిరిసిగా తుల్జారం, వయస్సు: 19 సం. లు, కులం: గొల్ల, ఇంటర్మీడియట్ MPC 1వ సంవత్సరం శ్రీరామ జూనియర్ కాలేజ్, మియాపూర్‌లో చందువుతున్నాడు. గత నెల డిసెంబర్-2023లో అతని ఆరోగ్యం సరిగలేనందున ఇంటికి వచ్చినాడు, ఇంటివద్ద పిచ్చిపిచ్చిగా చేయడం వలన తిరిగి అతనిని కుటుంబ సభ్యులు కాలేజీకి పంపలేరు. నిన్న తేదీ: 22.01.2024 నాడు సాయంత్రం 05:30 గంటలకు అతని నానమ్మ బాగమ్మ వద్ద 10 రూపాయలు



తీసుకొని ఇంటి నుండి వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. ఇట్టివిషయంలో అతని కుటుంబసబ్యులు చుట్టుప్రక్కల మరియు బందువుల వద్ద వెతికినారు అయిన కూడా అతని ఆచూకీ తెలియక పోవడంతో ఈరోజు 23.01.2024 నాడు 03:00 గంటలకు అతని తండ్రి సిరిసిగా తుల్జారం జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కు వచ్చి పిర్యాది ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనదని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫొటోలోని వ్యక్తి ఆచూకీ తెలిసినచో జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, యస్. ఐ. కు ఫోన్ 8712656764 ద్వారా తెలుపగలరని తెలిపారు.

# సిద్దిపేటలో భారత్ వికసిత సంకల్ప యాత్ర

**సిద్దిపేట వెలుతురు 23 జనవరి 2024:** భారత్ వికసిత సంకల్ప యాత్ర అన్ని గ్రామ పంచాయతీలను మరియు పట్టణ స్థానిక సంస్థలను కవర్ చేయడానికి భారత్ ప్రభుత్వం యొక్క అతిపెద్ద ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా భారత వికసిత సంకల్ప యాత్ర 499 గ్రామ పంచాయతీ లో నిర్వహించారు ఈ కార్యక్రమం జిల్లా ప్రభరి శ్రీ అజయ్ గుప్తా అదనపు కలెక్టర్ , జిల్లా నోడల్ అధికారి మరియు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ సత్యజిత్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి ఎంపిడిఓ లు , బ్రాంచ్ మేనేజర్ బీసీ లు, సిఏఫ్ఎల్ లు మరియు అన్ని ప్రాంతీయ మేనేజర్లు సహాయంతో విజయవంతమైంది. మంగళవారం రోజున వరకు మేము 499 గ్రామ పంచాయలో మరియు వికసిత భారత్ సంకల్ప యాత్ర పోర్టల్ ల్ సంబధిత డేటాను అప్లోడ్ చేశారు. పోర్టల్ ను అప్లోడ్ చేయడంలో సిద్ధిపెట్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఈ పథకంలో ఇప్పటి వరకు 118079 మంది కార్యక్రమం లో పాల్గొని సంకల్పం తీసుకున్నారు . ఇప్పటివరకు మొత్తం 46885 మందిని ఆరోగ్య శిబిరానికి హాజరు అయి, 4991 ప్రజలు టీబీ స్క్రీనింగ్ మరియు సెకిల్ సెల్ స్క్రీనింగ్‌లో పాల్గొన్నారు.

1391 మంది స్వచందంగా సేవకుల కింద నమోదు చేసుకున్నారు . 2597 కొత్త ఉజ్వల రిజిస్ట్రేషన్ లు, 33 అయుష్మాన్ భారత్ కార్డు. 6063 మంది సురక్ష భీమ కింద మరియు 4689 మంది జీవన జ్యోతి భీమ యోజన



బ్యాంకులు ద్వారా నమోదు చేసుకున్నారు . అలాగే 184 డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించ బడ్డాయి ఈ యాత్ర లో బ్యాంకులు పీఎం కీసాన్ లబ్ధిదారులకు 3865 రుణాలు మరియు 3213 %ఎెఎెషె% రుణాలు రైతులకు మంజూరు చేయబడ్డాయి . 1779 జన్ ధన్ ఖాతాలు, 632 ఆధార్ దిద్దుబాటు మరియు ఎస్ ఎల్ బి సి ద్వారా భారత ప్రభుత్వం పేరుకొన్న అన్ని ఇతర కార్యకలాపాలు 100 శాతం పూర్తి చేయబడ్డాయి . జిల్లాలో లీడ్ జిల్లా మేనేజర్ శ్రీ సత్యజిత్ సమన్వయంతో విజవంతంగా ఈ క్యాంపెయిన్ అమలు చేస్తున్నారు. మంగళవారం రోజున జిల్లాలోని 499




గ్రామ పంచాయతీ లో క్యాంపెయిన్ పూర్తి అయింది. నేటి నుండి మున్సిపాలిటీలు లలో జరుగుతుంది . నేడు హుస్నాబాద్ లో జరుగుతుంది మరియు జనవరి 25 వ సిద్దిపేట , చేరియల్, గజ్వేల్ మరియు దుబ్బాక లో నిర్వహించబడుతుంది. యాత్రలో 418 మంది సభ్యులు తమ విజయగాథలను పంచుకున్నారు మరియు 477 సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ఎస్ఎల్బిసి డేటాను 100 శాతం అప్‌లోడ్ చేయడంతోపాటు రాష్ట్రంలో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు అధికారులను ప్రశంసించారు.

### తూప్రాన్‌లో సుభాష్ యూత్ అధ్వర్యంలో

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**తూప్రాన్ వెలుతురు జనవరి 23:** తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఉదయం ఆజాద్ హిందూ ఫౌజ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతి సందర్భంగా సుభాష్ యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ లాంటి దేశభక్తులను ఆదర్శంగా తీసుకొని యువతి యువకులు సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అజాధి హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసి భారత దేశ స్వాతంత్ర్యం కోసం తనదైన శైలిలో పోరాటం చేసిన మహా నియుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎక్కల్ దేవ్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ మామిడి వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ జానకిరామ్ సిఆర్, స్వర్గం వెంకట నారాయణ, ఆకుల శ్రీరాములు, బీయాని తిరుపతి రెడ్డి, మామిండ్ల యాదగిరి, కుమ్మరి చెలిమెలా జయరామ్, జంగం రాములు, పసుల నారాయణ, జయ, విజయ్, తుమ్మల మెల్లేష్ ముదిరాజు, మాలజంగం రాజు, గుమ్మడి జనార్ధన్, ఆర్కలి





సత్య నారాయణ, మాలే నగేష్ గుప్త, బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు మన్నె శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్ ,బిఆర్ఎస్ పార్టీ 15వ వార్డు అధ్యక్షులు బాయికాడి ఆంజనేయులు , ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి, గడ్డం వెంకట్, దామోజీ రవిచారి, దాసరి ఆంజనేయులు, తలారి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## అందుకే కలిశాం.... అనవసరంగా ఊహాగానాలు సృష్టించవద్దు

**- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు**

**జహీరాబాద్, 23 జనవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మంగళవారం వారి నివాసంలో మెదక్ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మరియు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లతో కలవడంపై పెద్ద రాజకీయ దుమారం చెలరేగింది. ఇదే విషయంపై జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు స్పందించి వివరణ ఇచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసమే కలిశానని అదేవిదంగా శాసనసభ్యుల ప్రోటోకాల్ విషయంపై ఫిర్యాదు చేయడం జరిగిందని వివరించారు. ఈ అంశంపై అనవసరంగా ఊహగానాలు సృష్టించవద్దని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ నాయకత్వంలో జహీరాబాద్ స్థానంలో గులాబీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.




### నేడు లలిత కళాతోరణంలో టీఎన్జీఓఎస్ యూనియన్

## డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 23:** టీఎన్జీఎస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్.ఎస్. ఎం.హుస్సేని (ముజీబ్) మరియు జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రోజున నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లోని లలిత కళాతోరణంలో సా.5గం పెద్దలు గౌరవనీయులు శ్రీ. గడ్డం ప్రసాద్ కుమార్, శ్రీ. పొన్నం ప్రభాకర్, శ్రీ. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జనాబ్ మొహమ్మద్ అలీ షబ్బీర్, శ్రీమతి సీతక్క, శ్రీ. కోదండరామ్ మరియు శ్రీ. అద్దంకి దయాకర్ గారందరి సమక్షంలో 2024 డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ సభకు జిల్లా యూనిట్ అధ్యక్షులు కార్యదర్శులు ప్రాథమిక సభ్యులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొనవలసిందిగా ప్రత్యేక విజ్ఞప్తి.





## అయోధ్య రామున్ని దర్శించుకున్న కరీంనగర్ జిల్లా బిజెపి నేతలు రాపర్తి ప్రసాద్, ఈసంపల్లి మహేష్

**అయోధ్య వెలుతురు జనవరి 23:** కరీంనగర్ బిజెపి జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, బీజేవైఎం నాయకులు ఈసంపల్లి మహేష్ అయోధ్యలోనీ బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొని, మంగళవారం అయోధ్య రామున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య రామ మందిర ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామ న్నారు. ఐదు శతాబ్దాల హిందూ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిన సందర్భం, కొలువుదీరిన అయోధ్య రామున్ని దర్శించుకున్న సందర్భంతమ జీవితంలో మరువలేని ఘట్టాలుగా మిగిలిపోతామన్నారు.



### కే.ఎ.టి క్యాట్ లెవల్ 2 పరీక్షల్లో

## శ్రీ చైతన్య ప్రభంజనం

**తూప్రాన్ వెలుతురు జనవరి, 23:** కే.ఎ.టి క్యాట్ లెవల్ 2 పరీక్షల్లో తూప్రాన్ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. క్యాట్ లెవల్ 2 పరీక్షల్లో 99 మంది విద్యార్థులు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొనగా 94మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధించిన వారికి వెయ్యి రూపాయల నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇందులో ఆరుగురికి నగదు పారితోషికం మెడల్ం మెరిట్ సర్టిఫికెట్ సాధించగా 38 మంది విద్యార్థులు మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు అందకున్నారని అన్నారు.

అలాగే 50మంది విద్యార్థులు మెరిట్, సర్టిఫికెట్‌లు అందుకున్నట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్స్ పాల్ రామకృష్ణ, డీన్ నవీన్, సి.ఇంఛార్జి అశోక్ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నీ కంఠాలకు
ఉలి కాట్లు
ఎన్నీ ముఖాలకు
యెదపోట్లు
కంఠాలను చీల్చుకొని
ఒల్లంత గాయమై
బతుకంత బారమై
ఓరిమి కల్పవృక్షమై
ఒడులు నింపే
కల్పతరువు నిను
మదినిండా కొలిచెదం
వనవాసిని

- మోకు శ్రీ





## గిరిజనుల ఆచారాలను గౌరవించాలి

### జంగుబాయి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సీతక్క

**కుమ్రం భీం ఆసిఫాబాద్,జనవరి 23(వెలుతురు):** ఎవరి ఆచారాలు వారికి ఉంటాయని, వారికి దైవికంగా ఉండే నమమకాలు కూడా ఉంటాయని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఎవరి ఆచారాలు ఎలా ఉన్నా గౌరవించాల్సిందేనని అన్నారు. అలాగే వారికి మర్యాదుల ఇవ్వాలన్నారు. ఆదివాసీ, గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ జంగుబాయి అమ్మవారిని సీతక్క దర్శించుకున్నారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో రివ్యూ సమావేశానికి హాజరయ్యారు. మంత్రి తన పర్యటనలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి మండలంలోని దేవస్థానానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆలయ అభివృద్ధి పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీమ్ అసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ సహదేవ్ రావు, అదనపు కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, ఆదివాసి పటేళ్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు 1నే జీతాలు

### బడ్జెట్ సన్నాహక సమీక్షలో మంత్రి పొన్నం వినతి

**హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):** ప్రతి నెలా ఒకటో తారీఖున ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పడేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన రవాణా, బీసీ సంక్షేమ శాఖలపై బడ్జెట్ సన్నాహక సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావు, ఫైనాన్స్ జాయింట్ సెక్రెటరీ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ బ్జడెట్



కేటాయింపుల్లో రవాణా, బీసీ శాఖలకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతుందని.. రోజుకు 27 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని వెల్లడించారు. ఈ పథకం వల్ల ఆదాయం తగ్గి ఖర్చు పెరుగుతుందని తెలిపారు. అదనంగా కొత్త బస్సుల కొనుగోలుకు సహాయం చేయాలని కోరారు. బ్యాంకు లోన్ లు , కొత్త నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన బాండ్లు, పీఎఫ్, సీసీఎస్ బకాయిలు దృష్టి సారించాలని కోరారు. ప్రతి నెలా ఫస్టుకే ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పడేలా చూడాలని.. మహాలక్ష్మి విజయవంతానికి సహకరించాలని సూచించారు.

## జనం సానుభూతి పొందేందుకు జగన్ ఎత్తు

### అందుకే వారిని స్టార్ కాంపెయినర్లు అంటూ పొగడ్తలు

### విసుగెత్తినమే జగన్‌నె ఓడించే స్టార్ కాంపెయినర్లు

### ఉరవకొండి టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల విమర్శలు

**అనంతపురం,(వెలుతురు):** జనం సానుభూతి పొందేందుకు సిఎం జగన్ నానా తంటాలు పడుతున్నారని, అందుకే వారిని తన స్టార్ కాంపెయినర్లుగా చెప్పకుంటున్నారని టిడిపి ధ్వజమెత్తింది. జగన్ పతనానికి జనమే స్టార్ క్యాంపెయినర్లు అని, ఆయన నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నవారే తమ స్టార్ క్యాంపెయినర్లు అని ఉరవకొండ తెలుగుదేశం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌అన్నారు. మంగళవారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్ ఈరోజు ఆసరా సమావేశంలో.. టీడీపీ అధినేత చంద్రబాబు, మీడియాను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఓ రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి అంత బలహీనంగా... తనకు మీడియా లేదు అన్నట్లు సానుభూతి కోసం మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. రాయలసీమలో చుక్క నీటి కోసం ఆందోళన చేసిన ప్రతి రైతు స్టార్ క్యాంపెయినరే నని.. వైసీపీ స్టార్ క్యాంపైనర్లు దోపిడీలు చేస్తున్న ముఠా అని ఎద్దేవా చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో జగన్ 80 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి.. 8 ఎకరాలకు కూడా చుక్క నీళ్లు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఉరవకొండ వైసీపీ ఇన్‌చార్జి విశ్వేశ్వరరెడ్డి మోసానికి నిలువెత్తు రూపం... ప్రజలు తనకు ఎన్ని పేర్లు పెట్టారో జనాలను అడిగితే తెలుస్తుందని దెప్పిపోడిశారు. తాను వలస పక్షి అయితే ఆయన వసూళ్ల పక్షి... 2019లో ఇంత గాలిలో అతను గెలవలేక... ప్రజలు తప్పు చేశారని అంటున్నారన్నారు. జాతీయ రహదారి, ఉరవకొండ ఆస్పత్రి, మేఘా డ్రిప్ ప్రాజెక్ట్ అన్ని తాను తెచ్చినవేనని స్పష్టం చేశారు. తాను తెచ్చిన మేఘా డ్రిప్ గుట్టలుగా పడి ఉంటే సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. 30 వేల ఎకరాల్లో పంటలు కోల్పోయి మూడు వేల కోట్లు నష్టపోతే నీళ్లివ్వలేని దద్దమ్మవిశ్వేశ్వరరెడ్డి అని మండిపడ్డారు. తాను దొంగ పట్టాలు ఇచ్చానని ఆయన చెబుతున్నాడు .. ఆ రోజు తన పక్కన వచ్చి నిల్చొని పట్టాలు ఇచ్చింది తనకు గుర్తులేదా అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు.

## పులులను చంపడం నేరం

### అలాంటి చర్యలను సమించేది లేదు

### సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్ నగర్,జనవరి 23(వెలుతురు):** అటవీ ప్రాంతాల్లోని పులుల సంరక్షణలో అటవీ శాఖ అధికారులకు అందరూ సహకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం వంజిరి గ్రామంలో మంగళవారం అటవీ అధికారుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పులి దాడిలో మరణించిన పశువుల యజమానులకు చెక్కులు పంపిణీ చేశారు. పులులకు క్రిమి సంహారక మందులు, కరెంట్ వైర్లు పెట్టి అంతమొందించడం దారుణమని ఎమ్మెల్యే పాల్వాయి అన్నారు. తమ పశువులను దాడి చేసి చంపేస్తున్నాయనో.. తమపై దాడి చేస్తున్నాయనే భయంతో రైతులెవరూ ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పోడు రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న అటవీ భూముల విషయంలోనూ అటవీ అధికారులు వారిని ఇబ్బంది పెట్టడం మానుకోవాలని సూచించారు. వారి జీవన భృతి విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఉన్న భూమిని వదిలేది లేదు, కొత్త భూమిని కొట్టేది లేదు అనే నినాదాన్ని గ్రామస్థులు, రైతులు, అటవీ శాఖ అధికారులు అమలు చేయాలని చెప్పారు. అనంతరం పులి దాడిలో చనిపోయిన పశువుల యజమానులకు చెక్కుల పంపిణీ, స్కూల్ పిల్లలకు అటవీ శాఖ అధికారుల అధ్వర్యంలో బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ నీరజ్ కుమార్, జెడ్పీ ఇంఛార్జీ ఛైర్మన్ కోనేరు కృష్ణ రావు, రూరల్ సీఐ నాగరాజు, రమాదేవి, ఎస్ఐ సానియా, సర్పంచ్ లు ముంజం రమేష్, పుల్ల అశోక్, జంగు, లబ్దిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# నేతాజీ మృతి మిస్టరీ తేల్చరేం

### ఏళ్లు గడుస్తున్నా ఏమయ్యాడో తెలియదు

### దర్యాప్తు చేస్తామన్న బిజెపి నోరు మెదపడం లేదు

### నేతాజీ జయంతి సభలో సిఎంమమతా బెనర్జీ విమర్శలు




**కోల్‌కతా,జనవరి 23(వెలుతురు):** నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యమై ఏళ్లు గడుస్తున్నా.. ఆయనకు ఏమైందనే విషయం కాని, ఆయన మరణించిన తేదీ కాని దేశ ప్రజలకు ఇప్పటికీ తెలియకపోవడం అవమానకరమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. నేతాజీ అదృశ్యంపై దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చిన భాజపా ప్రభుత్వం.. దాన్ని ఇంతవరకు నిలబెట్టుకోలేదని విమర్శించారు.
'ఎన్నో ఏళ్లు గడుస్తున్నా.. నేతాజీ చనిపోయిన తేదీ తెలియకపోవడం దేశ దురదృష్టం. ఆయనకు ఏమైందో మనకు తెలియదు. నిజంగా దేశానికి ఇది సిగ్గుచేటని మమతా బెనర్జీ పేర్కొన్నారు. నేతాజీ 127వ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని ఆయన విగ్రహానికి నివాళు లర్పించిన ఆమె.. భాజపా ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. నేతాజీ అదృశ్యంపై దర్యాప్తు చేస్తామని అధికారంలోకి వచ్చే ముందు భాజపా హామీ ఇచ్చింది. 20 ఏళ్లుగా నేతాజీ జన్మదినం నాడు జాతీయ సెలవు ప్రకటించాలని ప్రయత్నాలు చేస్తున్నా అవి విఫలమయ్యాయి. నన్ను క్షమించండి' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. రామమందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ఒక పూట సెలవు ప్రకటించడాన్ని ప్రస్తావించిన దీదీ.. ఈ రోజుల్లో రాజకీయ ప్రచారానికీ సెలవు ప్రకటిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారికి మాత్రం ఏమీ చేయడం లేదని విమర్శించారు. భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యమైన ఘటన ఏడు దశాబ్దాలుగా మిస్టరీగానే మిగిలిపోయింది.

1945, ఆగస్టు 18న తైపిలో విమాన ప్రమాదంలో బోస్ మరణించారనే వాదన ఉంది. నేతాజీకి చెందినవిగా చెబుతోన్న చితాభస్మం నింపిన పాత్రను 1945 సెప్టెంబరు నుంచి టోక్యోలోని రెంకోజి ఆలయంలో భద్రపర్చారు. నేతాజీ మరణంపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు మూడు దర్యాప్తు కమిషన్లు వేసింది. కాంగ్రెస్ హయాంలో రెండు, భాజపా ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ఓ కమిటీ ఇచ్చిన నివేదికలు భిన్నంగా ఉన్నాయి. దీంతో అస్థికలను భారత్‌కు తెప్పించి, డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలని బోస్ కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం

### మేనిఫెస్టో కమిటీ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, (వెలుతురు):** ఎన్నికల ముందు ఒక మంచి మేనిఫెస్టో అందించగలిగామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మంత్రి అధ్యక్షతన టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్నింటికంటే మంచి మేనిఫెస్టో ఇవ్వగలిగామన్నారు. మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలు ఇచ్చామని.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసే దిశగా అడుగులు వేశామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రెండో రోజు మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఆరోగ్యశ్రీలో పది లక్షల ఆరోగ్య పథకాన్ని అందించామ న్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎంతో విశ్వాసాన్ని చూపారన్నారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శలు చాలా తొందరపాటుగా ఉన్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హమీలను నేరవేర్చుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హమీల అమలుపై సమీక్ష చేశామని.. వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. వచ్చే నెల నుంచి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హమీ నేరవేరబోతుందన్నారు. కేసీఆర్ సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం గుల్ల అయ్యిందని విమర్శించారు. అందుకే హమీల్లో కాస్త జాప్యం నడుస్తోందన్నారు. నిరుద్యోగ భృతి మొదలుకుని డబుల్ బెడ్ రూంల వరకు అన్ని హామీలను బీఆర్ఎస్ విస్మరించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదన్నారు. మాజీ మంత్రి



జగదీష్ రెడ్డి జైలుకు పోవడం ఖాయమన్నారు. కాళేశ్వరంతో పాటు అన్ని అక్రమాలపై విచారణ కొనసాగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అక్రమాలతోపాటు చత్తీస్‌గఢ్‌లో కరెంటు కొనుగోళ్లలో అవినీతి బయటపడుతుందన్న అక్కసుతోనే ఆయన తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లోపు అమలు చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసి తీరుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, 200 యూనిట్ల కరెంట్..100 రోజుల్లో ఇచ్చి.. హామీ నిలబెట్టుకుంటాం అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో దళితుణ్ణి సీఎం చేస్తా అని చెప్పిన కేసీఆర్ ఏం చేశాడు.. దళితుణ్ణి సీఎం చేయకపోతే మెడ మీద తల నరుక్కుంటా అన్నాడు.. 9 ఏండ్లు తల నరుక్కున్నాడా..? అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ దోపిడీతో.. మేము ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయలేకపోయామన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తా అని కేసీఆర్ ఇవ్వలేదు.. నిరుద్యోగులను బీఆర్ఎస్ మోసం చేసింది.. పదేళ్లు వారికి ఉద్యోగాలు ఇవ్వకూండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది.. ఇప్పుడు నిరుద్యోగులను కేసీఆర్ ఇంటికి పంపాలా.. కేటీఆర్ ఇంటికి పంపాలాఅని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం గుల్ల అయ్యిందన్నారు. కేసీఆర్ నిరుద్యోగ భృతి మొదలుకుని డబల్ బెడ్ రూంల వరకు అన్ని హమీలను మీరు విస్మరించారన్నారు. మేము ప్రజలను మీలాగా రెచ్చగొడితే ఫార్మ్ హౌస్ దాటకపోయే వారని హెచ్చరించారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు రాదని స్పష్టం చేశారు. కాలేశ్వరంతో పాటు అన్ని అక్రమాలపై విచారణ కొనసాగుతొందన్నారు.

# అయోధ్య రాముడు..ఇక బాలక్ రామ్

### ఆలయం ఇక..బాలక్ రామ్ మందిర్



**అయోధ్య,జనవరి23(వెలుతురు):** రామభక్తుల శతాబ్దాల కల సాకారమై అయోధ్యలోని భవ్య మందిరంలో సోమవారంనాడు కొలువైన రామ్‌లల్లాను ఇక నుంచి 'బాలక్ రామ్'గా పిలువనున్నారు. ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించిన ట్రస్టు పూజారి అరుణ్ దీక్షిత్ ఈ విషయాన్ని వెల్లడించారు. అయోధ్యలో కొలువుతీరిన రామయ్య ఐదేళ్ల పసిబాలుడుగా దర్శనమిస్తున్నందున ఆయన పేరును 'బాలక్ రామ్'గా నిర్ణయించినట్లు చెప్పారు. ఆయన కొలువైన మందిరాన్ని బాలక్ రామ్ మందిరంగా పిలుస్తామని తెలిపారు. తొలిసారి నేను విగ్రహం చూసినప్పుడు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. కళ్ల నుంచి ఆనందభాష్పాలు రాలాయి. అప్పటి నా అనుభూతిని మాటల్లో చెప్పలేను అని ఇంతవరకూ తన జీవిత కాలంలో 50 నుంచి 60 ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించిన వారణాసి పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. ఇప్పటివరకూ తాను నిర్వహించిన విగ్రహ ప్రాణప్రతిష్ఠల్లో ఈ విగ్రహం అత్యంత అలౌకికమైన, అత్యున్నతమైనదిగా తనకు అనిపించిందని చెప్పారు. జనవరి 18న తాను తొలిసారి రామయ్య విగ్రహాన్ని చూసినట్టు చెప్పారు. భారతదేశంలోని ప్రతీ హిందువు గర్వపడేలా అయోధ్యలోని రామ మందిరంలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన విషయం తెలిసిందే. ఎంతో అట్టహాసంగా జరిగిన బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ప్రపంచనలుమూల అనేక మాధ్యమాల ద్వారా వీక్షించారు. దేశ ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ ఘట్ట జరిగింది. అయితే అక్కడ కొలువైన బాల రాముడిని ఇప్పటి వరకు రామ్ లల్లా అని పిలిచారు. ఇప్పుడు బాల రాముడి పేరును మార్చారు. మందిరంలో కొలువైన శ్రీరాముడు ఐదేళ్ల పసిబాలుడని.. అందుకే బాలక్ రామ్ పేరును నిర్ణయించినట్లు తెలిపారు.స్వామికి రోజుకు ఆరుసార్లు హారతిని ఇస్తారని ట్రస్ట్ కు నిర్వాహకులు ఆచార్య మిథిలేశ్ నందిని తెలిపారు. మంగళ, శ్రింగార, భోగ, ఉతపన్, సంధ్యా, శయన హారతి ఇస్తామని చెప్పారు. పూరి, కూరతో పాటు పాలు, పండ్లు, రబ్ డీ ఖీర్, పాలతో చేసిన స్వీట్లను నైవేద్యంగా సమర్పిస్తామని వివరించారు. మంగళవారం నుంచి సామాన్య ప్రజలను కూడా ఆలయానికి అనుమతించడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు.

# తెలంగాణలో రష్యా ఎక్సలెన్స్ సెంటర్

### మంత్రి శ్రీధర్ బాబుతో ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్,జనవరి 23(వెలుతురు):** ప్రపంచ ఆర్థిక సదస్సుతో తెలంగాణలో దాదాపు 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంస్థలు ముందుకొచ్చాయి. తాజాగా తెలంగాణలో మరో అంతర్జాతీయ ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకుంది. డిజిటల్ ఫోరెన్సిక్, డేటా రికవరీలో దిగ్గజ కంపెనీ అయిన రష్యా కు చెందిన ఏఈసీ ల్యాబ్ జూమ్ టెక్నాలజీస్ కంపెనీ తో కలిసి హైదరాబాదులో ఫోరెన్సిక్ సెంటర్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం నాడు ఏసీఈ లాబ్ సీఓఓ మ్యాక్స్ పుతివ్ సేవ్, జూమ్ టెక్నాలజీస్ సీఓఓ, ఆ సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. తాము ఏర్పాటు చేయబోతున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రతిపాదనలపై మంత్రికి వివరించారు. ప్రభుత్వపరంగా కావాల్సిన సహాయ సహకారాల గురించి వారు చర్చించారు. 129 దేశాల్లో తమ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆయా దేశాల దర్యాప్తు సంస్థలతో కలిసి పనిచేస్తున్న అనుభవం తమకు ఉందని వివరించారు. డేటా లాస్, డిజిటల్ ఇన్వెస్టిగేషన్ సవాళ్లను అధిగమించడానికి భారతీయ వ్యాపారాలు, బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, దర్యాప్తు సంస్థలకు తాము సహకరిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేకమైన సాంకేతికతతో ఉన్నత స్థాయి నైపుణ్యాలు కలిగిన సాంకేతిక నిపుణులతో ఆయా సంస్థలకు తాము వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడంలో నిష్ణార్థులమని తెలిపారు. తెలంగాణలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డేటా సెంటర్ ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున కావాల్సిన తోడ్పాటును అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వారికి హామీ ఇచ్చారు. తెలంగాణలో ఆ సంస్థ యూనిట్ ను ఏర్పాటు చేయడాన్ని మంత్రి స్వాగతించారు. ఇదిలావుంటే బ్రిటన్ పార్లమెంట్ ఇన్ ఎక్సైల్ ప్రతినిధులు మంగళవారం నాడు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. టిబెట్ కు సార్వభౌమాధికారాన్ని కల్పించడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో మాంక్ గేశే అతుక్ సెతాన్, ఎంపీ సెరింగ్ యంఫ్నెన్, దొండప్ తాషి తదితరులు ఉన్నారు.

# ఏప్రిల్ 16న ఎన్నికలు అంటూ ప్రచారం

### ఫేక్ న్యూస్ అని తేల్చిన సీఈవో కార్యాలయం

### ఏప్రిల్ 16 లోపు ఎన్నికల పనులు పూర్తి చేయాలనుకుంటున్నామన్న సీఈవో

**న్యూఢిల్లీ, వెలుతురు:**
యావత్ భారతదేశం లోక్ సభ ఎన్నికలకు సమాయత్తమవుతోంది. మరి కొన్ని నెలల్లో పార్లమెంటు ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, ఏప్రిల్ 16 నుంచి లోక్ సభ ఎన్నికలు అంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం స్పందించింది.



ఏప్రిల్ 16 నుంచి లోక్ సభ ఎన్నికలు అనే వార్త నిజమేనా అని కొన్ని మీడియా సంస్థలు తమను వాకబు చేస్తున్నాయని ఢిల్లీలోని సీఈవో కార్యాలయం వెల్లడించింది. ఏప్రిల్ 16 అనేది లోక్ సభ ఎన్నికల తేదీ కాదని, దేశవ్యాప్తంగా ఉన్న సిబ్బంది ఎన్నికల పనులు పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువు తేదీ అని స్పష్టం చేసింది.
ఆ తేదీ లోపు ఎన్నికల ప్రణాళికల ప్రకారం పనులన్నీ పూర్తి చేయాలన్నది తమ లక్ష్యమని సీఈవో కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు సంబంధిత వర్గాలకు ఈ నెల 19న అధికారిక లేఖను జారీ చేశామని వెల్లడించింది. ఎన్నికల షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం సరైన సమయంలో ప్రకటిస్తుందని సీఈవో కార్యాలయం తెలిపింది.

# మెట్టు దిగిన అంగన్వాడీలు

### ఎట్టకేలకు సమ్మె విరమించి విధుల్లో చేరిక

### యూనియన్ నేతలతో ప్రభుత్వం చర్చలు సఫలం

### టెర్మినేషన్ ఆర్డర్లతో సాంకేతిక సమస్య



**అమరావతి, వెలుతురు:**
రాష్ట్రంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు 42 రోజులుగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెను ఎట్టకేలకు విరమించారు. యూనియన్ నేతలతో ఆదివారం రాత్రి మంత్రి బొత్స సత్యనారాయణ చేపట్టిన చర్చలు కొలిక్కివచ్చాయి. పలు డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా యూనియన్ నేతలు వెల్లడించారు. ఈక్రమంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరయ్యారు. ఇప్పటికే మూడు దఫాలుగా ప్రభుత్వం, అంగన్ వాడీల మధ్య చర్చలు కొనసాగినా ఉభయులూ అంగీకారానికి రాలేకపోయారు. దీంతో నాలుగో దఫా మంత్రి బొత్సతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చర్చల సందర్భంగా.. జూలైలో జీతాల పెంపునకు ఒప్పుకున్నారు. మొత్తం 11 డిమాండ్లలో పదింటికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.
జీవిత బీమా వర్తింపు, రూ.2 లక్షల ప్రమాద బీమా, మట్టి ఖర్చులు రూ.20 వేలు, అంగన్ వాడీ కేంద్రాల అద్దె బకాయిలు రూ.66.54 కోట్ల నిధుల విడుదల, 55,607 అంగన్ వాడీ కేంద్రాల్లో సామగ్రి కోసం రూ.7.81 కోట్ల నిధుల మంజూరు, అన్ని ప్రభుత్వ సంక్షమ పథకాల అమలు, 21206 అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నపాటి మరమ్మతులకు రూ.6.36 కోట్ల నిధుల విడుదల, అంగన్ వాడీ సహాయకులను కార్యకర్తలుగా నియమించేందుకు వయోపరిమితి పెంపు, నెలనెలా టీఏ, డీఏ క్లైయింలు, సమ్మె కాలానికి మొత్తం జీతం చెల్లింపు, విధుల నుండి తొలగింపు నిలుపుదల, సమ్మె కాలంలో కేసుల ఎత్తివేత, వయోపరిమితి, సర్వీసు ముగింపు ప్రయోజనాలు తదితర అంగన్ వాడీల ప్రధాన డిమాండ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను విరమించి, విధుల్లో చేరారు. కాగా సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు వచ్చిన అంగన్ వాడీలకు పాలనాపరమైన పలు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. జాయినింగ్ రిపోర్టు తీసుకుని టెర్మినేషన్ ఆర్డర్లు రద్దు చేయాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అంగన్ వాడీలు ససేమిరా అన్నారు. జాయినింగ్ రిపోర్టులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. మరోవైపు రిపోర్టు ఇవ్వకపోతే అంగన్ వాడీ కేంద్రం తాళం ఇవ్వమంటూ ఆశాఖ అధికారులు పేర్కొనడంతో సాంకేతిక సమస్య ఎదురైంది.

# ఐరాసలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం

### మద్దతు తెలిపిన ఎలాన్ మస్క్

**న్యూయార్క్, వెలుతురు:**
స్పేస్ఎక్స్, టెస్లా, ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ భారత్‌కు మరోసారి మద్దతు పలికారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్)లో శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం చేస్తున్న డిమాండ్ న్యాయమైనదేనని ఎక్స్‌లో



పోస్ట్ చేశారు. ప్రపంచంలోనే ఎక్కువ జనాభా కలిగిన దేశానికి యూఎన్‌లో సరైన ప్రాతినిధ్యం లేకపోవడంఅసమంజసంగా ఉందని అభిప్రాయపడ్డారు. భారత్‌తో పాటు ఆఫ్రికా ఖండానికి కూడా యూఎన్‌లో మెరుగైన పాత్ర లభించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. 'ఏదో ఒక సమయంలో యూఎన్‌లో సంస్కరణలు జరగాలి. కానీ సమస్య ఏమిటంటే.. ఇప్పుడు అపరిమితమైన అధికారాలను అనుభవిస్తున్నవారు.. దానిని వదులుకోవడానికి సిద్ధంగా లేరు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకు ముందు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్.. సమితిలో సంస్కరణలకు అవకాశం ఇవ్వాలని శాశ్వత సభ్యత్వ దేశాలైన రష్యా, యూకే, చైనా, ఫ్రాన్స్, అమెరికాలకు విజ్ఞప్తి చేశారు. ఈ అయిదు దేశాలకు మాత్రమే వీటో అధికారం ఉండటంతో ప్రతి అంశంలోనూ ఈ దేశాలది మాత్రమే తుది నిర్ణయంగా చెల్లుబాటు అవుతోంది. 'అంతర్జాతీయ వ్యవస్థలు ఇప్పటి తరాన్ని ప్రతిబింబించాలి కానీ 80 ఏళ్ల గతాన్ని కాదు. ఇప్పటి వరకు ఆఫ్రికాకు శాశ్వత సభ్యత్వం లేకపోవడమేమిటి? సెప్టెంబరులో జరిగే సదస్సు అంతర్జాతీయ గవర్నెన్స్‌పై కీలక సంస్కరణలకు వేదిక కావాలని ఆశిస్తున్నా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిని రీ పోస్ట్ చేసిన మైఖేల్ ఐసన్‌బర్గ్ అనే పెట్టుబడిదారుడు.. భారత్ గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. 'భారత్‌కు దక్కాల్సిన ప్రాతినిధ్యం సంగతేంటి? యూఎన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి.. అసలైన నాయకత్వంతో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమ ఆలోచన' అని వ్యాఖ్యానించారు. దీనికి సమాధానంగానే.. ఎలాన్ మస్క్ పై విధంగా స్పందించారు.
అత్యంత జనాభా కలిగి, ప్రపంచంలోనే అయిదో పెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం.. యూఎన్‌లో శాశ్వత సభ్యత్వం కోసం ఎప్పటికప్పుడు తన గొంతుకను వినిపిస్తూనే ఉంది.




వైసీపీ నేతల్ని ప్రశ్నించిన షర్మిల
మీకు అభ్యంతరమైతే జగనన్న గారు అని పిలుస్తానన్న షర్మిళ

# జగన్ రెడ్డి అంటే తప్పేంటి..?

**శ్రీకాకుళం, వెలుతురు:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను ఇకపై జగనన్న గారూ అనే సంబోధిస్తానంటూ ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. జగన్ రెడ్డి గారూ అని పిలిస్తే అధికార పార్టీ నేతలకు నచ్చడంలేదని, అందుకే ఇకపై జగనన్న గారూ అనే పిలుస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల.. మంగళవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా పలాస సమీపంలో షర్మిల ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. కాంగ్రెస్ స్థానిక నేతలతో కలిసి బస్సెక్కిన షర్మిల.. ప్రయాణికులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి, సమస్యల గురించి ఆరా తీశారు.
బస్సు ప్రయాణంలోనే షర్మిల మీడియాతో మాట్లాడారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తి అంటూ అధికారపార్టీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి తనపై చేసిన ఆరోపణలను ఆమె తిప్పికొట్టారు. వైవీ సుబ్బారెడ్డి గారికి తాను జగన్ రెడ్డి అనడం నచ్చలేదని చెబుతూ.. ఇకపై జగనన్న గారూ అనే సంబోధిస్తానని సుబ్బారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడైనా సరే అధికార పార్టీ చేసిన అభివృద్ధి చూపించాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతమైనా.. ఏ రోజు.. ఏ సమయంలోనైనా వచ్చి చూసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తాము చేసిన అభివృద్ధిని చూపించే ధైర్యం అధికార పార్టీ నేతలకు ఉంటే వచ్చి చూసేందుకు తమతో పాటు ప్రతిపక్ష నేతలు, మీడియా ప్రతినిధులు, మేధావులు సిద్ధమని వివరించారు



# జర్మనీలో అర్ధరాత్రి అద్భుతం

### కెమెరాకు చిక్కిన ఆస్టరాయిడ్

**బెర్లిన్,వెలుతురు:**
జర్మనీలో అర్ధరాత్రి వేళ ఆకాశంలో అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది. భూ వాతావరణంలోకి ప్రవేశించిన ఒక చిన్న సైజు గ్రహశకలం మండిపోతూ కింద పడిపోయింది. తూర్పు జర్మనీలో జరిగిన ఈ ఘటనను అక్కడి స్థానికులు వీడియో తీయగా అవి వైరల్‌గా మారాయి. చిమ్మ చీకట్లో నిప్పులు చిమ్ముకుంటూ ఆస్టరాయిడ్ పడుతున్న తీరు అద్భుతంగా ఉందని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తొలుత కొందరు ఇది యూఎఫ్ఓ అని.. కూలిపోతున్న విమానం అని భావించినప్పటికీ.. అది ఒక గతితప్పిన గ్రహశకలమని శాస్త్రవేత్తలు తర్వాత ప్రకటించారు. అంతరిక్ష పరిశోధకులు, ఔత్సాహికుల కథనం ప్రకారం.. 2024 బీఎక్స్1 అనే ఈ ఆస్టరాయిడ్.. జర్మనీ రాజధాని బెర్లిన్‌కు దగ్గర్లోని నెన్‌హౌసెన్ వద్ద వాతావరణంలోకి ప్రవేశించింది. హంగేరీకి చెందిన ఆస్ట్రనామర్ క్రిస్టియన్ హార్నెక్‌జీ ఈ ఆస్టరాయిడ్‌ను భూమి మీదకు వస్తుండగా మొట్టమొదటిగా గుర్తించారని తెలుస్తోంది. ఆస్టరాయిడ్ భూమిని తాకడానికి 20 నిమిషాల ముందు నాసా కూడా ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించింది. ఆకాశంలోకి చూడండి. గతి తప్పిన ఒక చిన్న ఆస్టరాయిడ్ శకలం.. భూ వాతావరణంలోకి ప్రవేశించనుంది. దీని వల్ల ఎలాంటి హానీ లేదు. జర్మనీ తూర్పు ప్రాంతంలో ఉన్న వారు దీనిని నిరభ్యంతరంగా చూడొచ్చే అని ప్రకటనలో పేర్కొంది. జర్మనీలో పడిన ఈ ఆస్టరాయిడ్.. ఒక మీటరు పరిమాణంలో ఉంటుదని శాస్త్రవేత్తల అంచనా. ప్రపంచ ఆస్టరాయిడ్ ప్రాజెక్టు ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన డెనిస్ విడా ఈ మేరకు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా శక్తివంతమైన కెమేరాలను ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటు చేసి.. ఆస్టరాయిడ్‌ల రాకను నిశితంగా పరిశీలించడం వీలవుతుంది. అలా జర్మనీలో ఏర్పాటు చేసిన లైవ్ కెమేరాలో ఈ ఆస్టరాయిడ్ భూమిపై పడటం కూడా కనిపించింది. భూ వాతావరణంలోకి ప్రవేశించగానే.. ఏర్పడే ఘర్షణ వల్ల అది కాలిపోయి తునాతునకలుగా మారిపోతుంది.



వంటచేయడం రాదనే బెంగ అవసరం లేదుబంధువులొచ్చినా భయం వద్దుపిల్లలకు రోజూ వెరైటీ వంటకాల విందుఆన్ లైన్ లో వెలిసిన కిచెన్లుఫుడ్ బిజినెస్‌లో దూసుకుపోతున్న మహిళలు మనకు ఎన్నో పండుగలున్నాయి. పండుగల రోజు మనం ఏం చేస్తాం ? కేవలం పూజలు, వ్రతాలతోనే సరిపెడ తామా? పండుగలనేవి.. రకరకాల పిండివంటలు, రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసుకుని కడుపారా ఆరగించి ఆనందించే సందర్భాలు. ఆ రోజుల్లో పేద, ధనిక తేడాలేకండా అందరి ఇంటి వంటగదులూ హడావుడిగా ఉంటాయి. గిన్నెలు, గరిటెల శబ్దాలు వినసొంపుగా చెవులను చేరుతుంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం... వెంటనే లాగిన్ అవ్వండి... నోరూరించే వంటలను చూసి నేర్చుకోండి.



# విభిన్న రుచుల లోగిళ్లు...
# ఆన్‌లైన్ వంటిళ్లు



ఇలాంటి సందర్భాల్లో కొత్తగా ఏం వంటలు చేయవచ్చు? కుటుంబ సభ్యులకు కొత్త రుచులను ఏ రకంగా అందించాలి? ఇవి సాధారణంగా ప్రతి మహిళకీ, ప్రతి గృహిణికీ ఎదురయ్యే సందేహాలు. అయితే మీ కోసమే ఈ ఆర్టికల్. చదవండి. ఆన్‌లైన్ వంట ఇళ్లలో లాగిన్ అవ్వండి. పెద్ద పెద్ద చదువులు చదివి కూడా ఆన్ లైన్ కిచెన్‌ని ప్రారంభించి, వంటలు, చెఫ్‌ల సమాచారాన్ని సృజనాత్మకంగా అందించి, తమ ప్రొడక్ట్‌కి బ్రాండ్ వేల్యూ పెంచుకుంటున్నారు. పాతకాలం అమ్మమ్మలు, బామ్మల కాలం నాటి పిండివంటల నుంచి నేటి తరం ఆధునిక యువత ఇష్టపడే ఫాస్ట్ ఫుడ్ వరకూ అన్ని రకాల సమాచారం ఒక్క క్లిక్‌లో లభ్యం.

**అర్చనాస్ కిచెన్:**

అర్చన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యోగా టీచర్. కొద్ది కాలానికి వివాహం, తల్లిగా కొత్త బాధ్యతలు. అంతటితో



ఆగలేదు. మరో కొత్త విభిన్న పాత్రకు సిద్ధమయ్యారు అర్చన. అలా మొదలైంది... అర్చనాస్ కిచెన్. ఆధునిక జీవనశైలి మన ఆరోగ్యంపై ఎంతో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోందనేది కాదనలేని సత్యం. దీనిలో ముఖ్యమైనది ఫాస్ట్ ఫుడ్స్. అందుకే అర్చన దీనిపైనే దృష్టిపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫాస్ట్ ఫుడ్స్ రెసిపీలకి పోషక విలువలను జోడించి తన వెబ్ సైట్లో పోస్ట్ చేయసాగారు. అంతే కాదు... వివిధ సందర్భాలకు తగిన రెసిపీలు, సీజనల్ వంటలు... మరెన్నో రకాలు అర్చనాస్ కిచెన్ లో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.



**సుబ్బూస్ కిచెన్:**

దక్షిణ భారత వంటల ప్రత్యేకం "సుబ్బూస్ కిచెన్". దక్షిణ భారత ఆహార పదార్థాలకు ఎంతో పురాతన ప్రాశస్త్యం ఉన్నవి. ఆ సంప్రదాయ వంటకాలను తన సైట్ లో ఉంచారు సుబ్బు. "ఇవన్నీ నేను మా అమ్మ నుంచి నేర్చుకున్నా" అని గర్వంగా చెబుతారు ఆమె. చాలామందికి వంట చేయడం అంటే ఇష్టం ఉండదు. అలాంటివారికి దానిపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ బ్లాగ్ ప్రారంభించారు. వంట అంటే బ్రహ్మవిద్యేమీ కాదు... ఇష్టంతో చేస్తే ఎంతో ఆనందంగా, సులభంగా నచ్చిన వంటకాన్ని వండివార్చేయొచ్చు. దానికి కావలసినదంతా సుబ్బూస్ కిచెన్ లో చూడవచ్చు.

**మంజులాస్ కిచెన్:**

జైనుల సిద్ధాంతం... "లివ్ అండ్ లెట్ లివ్" (బ్రతకండి, బ్రతకనివ్వండి). ఇదే మంజులాస్ కిచెన్‌ని నడిపించే మూలసూత్రం. కూరలు అందంగా కనబడేందుకు ఫ్లేవర్లను కలిపే బదులు... రుచి పెంచేందుకు కొద్ది మొత్తంలో మసాలా దినుసులు, సుగంధ దినుసులు కలపడం ఉత్తమం. పైగా ఇది పురాతన కాలం నుంచీ వస్తున్న అలవాటు. ఈ రకంగా సహజసిద్ధమైన పద్ధతుల్లో తయారయ్యే పదార్థాల వివరాలెన్నో మనం ఈ సైట్ ని బ్రౌజ్ చేస్తుంటే తెలుసుకోవచ్చు. ఇక్కడున్న వీడియోలు, ట్యుటోరియల్స్ చూసి ఎవరైనా... చాలా సులభంగా రుచికరమైన పదార్థాలు తయారుచేయవచ్చు.

**బేకర్ ఇన్ డిస్గైజ్:**

బేకింగ్... ఇదొక ఆర్ట్. మన చుట్టూ ఎన్నో బేకరీలు ఉంటాయి... కానీ అన్నింట్లో ఐటమ్స్ రుచిగా ఉండవు కదా. అందుకే బేకింగ్ ఈజ్ యాన్ ఆర్ట్. ఆ ఆర్ట్‌లో ప్రత్యేకత సాధించింది శర్వాణి. ఏ పదార్థాన్ని ఎంత పాళ్లలో కలపాలి, ఏ టెంపరేచర్ వద్ద ఎంతసేపు ఒవెన్‌లో ఉంచాలి... ఇవన్నీ ఒకరు చెబితే వచ్చేవి కాదు అంటారు శర్వాణి. చేస్తున్న పనిపై ఆసక్తి, అభిరుచి ఉన్నప్పుడే ఫలితం కూడా గొప్పగా ఉంటుందనేది ఆమె నమ్మకం. ఈ నమ్మకమే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. బేకర్ ఇన్ డిస్గైజ్‌లో మీరు శర్వాణి సొంత రెసిపీలతో పాటు మరెన్నో రెసిపీల గురించి తెలుసుకోవచ్చు.

**శైలూస్ ఫుడ్:**

ఫుడ్ బ్లాగుల్లో ప్రముఖమైన వాటిలో శైలూస్ ఫుడ్ ఒకటి. ఇలా ఎందుకంటున్నామో తెలియాలంటే ఓసారి మీ కంప్యూటర్లో "శైలూస్ ఫుడ్" ఓపెన్ చేయండి. కంప్యూటర్ స్క్రీన్ పై ఫొటోలు చూస్తుంటేనే మనకు నోరూరుతుంది. అంత అందంగా ఉంటాయి శైలూస్ కిచెన్ లో సిద్ధమైన ఆహారపదార్థాలు. ఈ బ్లాగ్ లో భారత్ లోని అన్ని ప్రాంతాల ఫుడ్ ఐటమ్స్ వివరాలు ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రా రెసిపీలకు ఇది ప్రత్యేకమని చెప్పుకోవచ్చు.

**షో మి ద కర్రీ:**

వంట ఎలా చేయాలి అనేది తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వంట ఎలా చేయకూడదు అనేది తెలుసుకోవడం అంతకన్నా ముఖ్యం. హేతల్, అనూజ... వీరిద్దరూ తమ పిల్లలకి, కుటుంబానికి చాలా సంవత్సరాలు ఆహారం వండిపెట్టారు. ఎవరికైనా సర్వసాధారణం... అప్పుడప్పుడూ రుచి కొద్దిగా అటూఇటూ అవ్వడం. దీనికి వీరిద్దరూ అతీతులేమీ కాదు. అలా వారి కుటుంబం, పిల్లలూ నిత్యం ఇస్తున్న ఫీడ్ బ్యాక్ వారిలో ఓ కొత్త ఆలోచన రేకెత్తించింది. ఎందుకు ఓ వెబ్ సైట్ ప్రారంభించకూడదు అని. అంతే... దక్షిణ భారత వంటల రెసిపీలతో సైట్ సిద్ధం చేశారు. ఇందులో కేవలం వారి రెసిపీలే కాదు... వంట చేస్తున్న సమయంలో మీ అనుభవాలు, అభిప్రాయాలు ఇతరులతో పంచుకోవచ్చు. అలాగే మీ కొత్త వంటలు, ఫెయిలైన రెసిపీలు... తద్వారా కలిగిన అనుభవాలను సరదాగా వీడియోలు, పాడ్ కాస్ట్‌ల రూపంలో పోస్ట్ చేయవచ్చు.

**మై డైవర్సిటీ కిచెన్:**

ఇది కేవలం ఓ రెసిపీ బ్లాగ్ మాత్రమే కాదు... అపర్ణ జీవితం. అపర్ణకి ఓ ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. అదేమిటంటే... రకరకాల ఆహార పదార్థాలను తయారుచేసి, వాటిని తన సొంత కెమెరాతో ఫొటోలు తీసుకుని చూసి మురిసిపోయేది. ఆ ఆసక్తే ఈరోజు "మై డైవర్సిటీ కిచెన్"లో విస్తృత ఫొటో లైబ్రరీ ఏర్పాటుని సులభం చేసింది. ఈ బ్లాగ్‌కి ఉన్న మరో ప్రత్యేకత... ఇందులో ఉన్నవన్నీ వెజిటేరియన్ రెసిపీలు మాత్రమే. బియ్యం, కూరలు, పప్పులు, కొబ్బరి... ఇలా సాధారణంగా ఇంట్లో లభించేవాటితోనే విభిన్న రుచులను సిద్ధం చేసే మెళకువలు ఎన్నో ఈ బ్లాగ్ లో లభ్యమవుతాయి. కేవలం భోజన సంబంధ పదార్థాలే కాదు... వెనిలా వంటి వివిధ ఫ్లేవర్ల ఐస్ క్రీమ్, చాక్లెట్ తయారీ వంటివి కూడా "మై డైవర్సిటీ కిచెన్" మనకు నేర్పిస్తుంది.

**ఎడిబుల్ గార్డెన్:**

నాగ్స్... ఈమె కేరళ, హైదరాబాద్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరాల్లో వివిధ ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ... పెళ్లి, భర్త, పిల్లలు... ఇవే జీవితంగా గడిపేవారు. అయితే ఇది ఆమెకు సంతృప్తి నివ్వలేదు. ఇంకా ఏదో ప్రత్యేకంగా చేయాలని నిరంతరం తపనపడేవారు. ఆ తపన నుంచి పుట్టినదే "ఎడిబుల్ గార్డెన్". ఆన్ లైన్ లో విహరించే మహిళల్లో ఈ బ్లాగ్ పేరు తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! తన కేరళ, తమిళనాడు వంటకాలకు, విదేశీ రెసిపీలను జతచేసి అందించడమే ఈ గార్డెన్ ప్రత్యేకత. కొత్త కొత్త వంటకాలను ఎలా తయారుచేయాలనేదానిపైనే నాగ్స్ దృష్టి. అందుకే ఈ బ్లాక్ మిగిలిన వాటికంటే భిన్నంగా ఉంటుంది.

**నిషా మధులిక:**

నిషా వివరించే వంటకాలను మనం కూడా చాలా సులభంగా మన ఇళ్లలో తయారుచేసుకోవచ్చు. భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధిచెందిన వంటలను అందించడమే ఈ వెబ్ సైట్ ప్రత్యేకత. మొదట్లో కేవలం రెసిపీలకు సంబంధించిన ఆర్టికల్స్ మాత్రమే ఈ సైట్ లో ఉండేవి. క్రమంగా వీడియో ట్యుటోరియల్స్ కూడా పోస్ట్ చేయసాగారు. ఈ వీడియోలు, రెసిపీలు అన్నీ హిందీభాషలో ఉండటం ఈ సైట్ ప్రాచుర్యానికి మరింత దోహదపడింది.



# 100 వంటలు చేస్తుంది!

బెంగళూరుకి చెందిన మెకానికల్ చెఫ్ ఘుమఘుమలాడే భారతీయ వంటకాలు చేస్తుంది. సుమారుగా 100 వంటలను అవలీలగా చేసి పెడుతుంది. ఇందులో ఉండే సూచనలను పాటిస్తూ రుచికరమైన వంటకాలను మనకు రుచి చూపిస్తుంది.

వంట వండాలంటే పెద్ద ప్రహసనమే చేయాలి. కొన్నిసార్లు ఉప్పు, కారాలు ఎక్కువైతే.. కొన్నిసార్లు ఏ రుచిపచి ఉండవు. అన్నీ కుదిరినప్పుడు మాత్రం అవురావురుమంటూ లాగించేస్తాం. అలా రోజూ లొట్టలేసుకుంటూ తినడానికి



ఓ రోబో వంట చేయబోతున్నది. మనకు కావాల్సిన వంటకాలకు సంబంధించిన పదార్థాలను ఈ రోబో పైన ఉండే బాక్సుల్లో నింపాల్సి ఉంటుంది. అది వంటకాలకు కావాల్సినంత మోతాదులో తీసుకొని వంట పూర్తి చేస్తుంది. ముందుగా మనకు కావాల్సిన వంటకమేదో దీనికి అనుసంధానమై ఉన్న కంప్యూటర్ సహాయంతో దానికి అసైన్ చేయాలి. దీన్ని బెంగళూరుకి చెందిన సోహన్ సుజే కార్లోస్, అర్పిత్ శర్మ అనే ఇద్దరు తయారుచేశారు. ఇందులో సోహన్ మెషీన్ లెర్నింగ్ రీసెర్చర్, అర్పిత్ ఎయిరోస్పేస్ ఇంజినీర్. వీళ్లిద్దరూ కలిసి ఎంతో శ్రమపడి దీన్ని తయారు చేశారు.

అయితే ఇంకా గ్రైండింగ్, ప్రెషర్ కుక్కింగ్‌లాంటివి ఈ రోబోకు పెద్దగా చేయడం రాదు. ఇప్పటిదాకా ఉప్మా, చోలే మసాలా, మటర్ పన్నీర్, దాల్ తడ్‌ఖా.. ఇలాంటి వందకు పైగా వంటకాలను ఇది చేయగలదు. వంటరాని అమ్మాయిలకు, బ్రహ్మచారులకు ఇదో పెద్ద వరమే అని చెప్పొచ్చు. ఇది ఇంకా ప్రయోగదశలోనే ఉంది. అతి త్వరలోనే దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు.

# పెండలంతో వంటలు


దుంప జాతికి చెందిన పెండలం వాడకం ఆహార పదార్థాల్లో తక్కువే. విలువైన పోషకాలున్న ఈ దుంపలతో చేసే విభిన్నమైన వంటలు మంచి రుచినే కాదు, శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తాయి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, పొటాషియం, పీచు వంటి పోషకాలు వీటిలో సమృద్ధిగా లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఒమెగా 3 ఫ్యాటీయాసిడ్లు అధికంగా ఉంటాయి. మహిళల్లో ఈజెన్ స్థాయిల్ని పెంచేందుకు దోహదపడతాయి. పెండలం ఆకులను నీటిలో మరగబెట్టి తాగితే విరేచనాలు, తలనొప్పి, తిమ్మిర్లు తగ్గుముఖం పడతాయి. చేదు తగ్గడానికి పెండలం ఆకుల రసంలో కాస్త తేనె వేసుకుని తాగితే శరీరం తక్షణం శక్తిని పుంజుకుంటుంది. పెండలంతో పలురకాల కూరలు, చట్నీలు, గ్రేవీలు, కెబాబ్‌లు, పులుసు, చిప్స్ వంటివి చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని 'తెల్లకంద'గా వ్యవహరిస్తారు.

**చిప్స్**



పెండలం 1 కేజీ
కారం 1/2 కప్పు
పుట్నాల పప్పు 1 కప్పు
వేరుశెనగ పప్పు 1 కప్పు
కరివేపాకు కాస్త
నూనె 250 గ్రా.
ఉప్పు 5 చెంచాలు
జీలకర్ర 2 చెంచాలు

పెండలం దుంపలపై చెక్కు తీసి ఉప్పు రాసి కాసేపు ఎండలో పెట్టాలి. నీరంతా ఇగిరిపోయాక దుంప ముక్కలను సన్నగా తరగాలి. బాణలిలో నూనె కాగాక వేరుశెనగ పప్పు, పుట్నాల పప్పు, జీలకర్ర, పెండలం ముక్కలను దోరగా వేయించాలి. చివరగా ఉప్పు, కారం కలపాలి. ఈ చిప్స్‌ను సాయంత్రం వేళ స్నాక్స్‌గా తినొచ్చు.



**పులుసు**

పెండలం ముక్కలు 5 కప్పులు
చింతపండు రసం 8 కప్పులు
కొత్తిమీర కొంచెం
నువ్వుల పొడి 1/2 కప్పు
కరివేపాకు కొంచెం
కొబ్బరి కోరు 1/2 కప్పు



బియ్యప్పిండి 1 కప్పు, మెంతులు 1 చెంచా
జీలకట్ట 1 చెంచా, ఇంగువ కాస్త
పసుపు కొంచెం, , ఎండుమిర్చి 5
పచ్చిమిర్చి 5, ఉల్లిముక్కలు 1 కప్పు
ఉప్పు 2 చెంచాలు

బాణలిలో పోపులు వేయించి, అందులో కొబ్బరి కోరు కలపాలి. చింతపండు రసాన్ని మరగించాక పోపు కలపాలి. వేరే గిన్నెలో ఉల్లి, పెండలం ముక్కలు ఉడికించి, మరగించిన చింతపండు రసంలో వేయాలి. చివరగా ఇంగువ, బియ్యప్పిండి కలిపి, పొంగు వస్తుండగా పులుసును కిందకు దింపేయాలి.

**కూర**



పెండలం ముక్కలు 2 కప్పులు
ఉప్పు 1 చెంచా
పసుపు 1/2 చెంచా
ఎండుమిర్చి 5
మినప్పప్పు, శెనగపప్పు 4 చెంచాలు
ఆవాలు, జీలకట్ట 2 చెంచాలు
పచ్చిమిర్చి 6
కరివేపాకు కొంచెం

పసుపు, ఉప్పు వేసి పెండలం ముక్కల్ని నీటిలో ఉడికించి వార్చి పెట్టాలి.

బాణలిలో పోపులు వేయించాక అందులో నలగ్గొట్టిన ఎండుమిర్చి, పచ్చిమిర్చి, పెండలం ముక్కలు, ఉప్పు కలపాలి. చివరగా నిమ్మరసం వేయాలి. ఈ కూర అన్నం, చపాతీ, పూరీల్లోకి బాగుంటుంది.

**అల్లం కూర**

అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ 1/2 కప్పు
పెండలం ముక్కలు 4 కప్పులు
నూనె 5 చెంచాలు, ఎండుమిర్చి 4
కరివేపాకు కొంచెం,
పోపులు 4 చెంచాలు
ఉప్పు 2 చెంచాలు
పసుపు 1/2 చెంచా

ముందుగా ఉప్పు, పసుపువేసి పెండలం ముక్కలను ఉడికించాలి. బాణలిలో పోపులు వేయించి, పచ్చిమిర్చి పేస్ట్ కలపాలి. ఇందులో పెండలం ముక్కలు, ఉప్పు వేస్తే రుచికరమైన కూర సిద్ధం.



# యువత మదిలో ఫ్యాషన్ మంత్ర

ఫ్యాషన్ రంగంలో యువత ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. అందుకే ఏ ఊళ్లో చూసినా ఫ్యాషన్ అంటే యువత ప్రత్యేక ఆసక్తి చూపుతోంది. ఇక ఫ్యాషన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ ఫ్యాషన్ డిజైనర్లు జాతీయ, అంతర్జాతీయ వేడుకల్లో టాలెంట్ చూపిస్తున్నారు. సత్తా చాటుతున్నారు. ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ రోజురోజుకు కొంతపుంతలు తొక్కుతోంది. నయా ట్రెండ్‌కు భాగ్యనగరం కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.

ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌లు, ఎక్స్‌పోలు, ర్యాంప్ వాక్‌లు సిటీలో 24/7 ఫ్యాషన్ హంగామా నడుస్తోంది. అందుకే యువత కూడా ఫ్యాషన్‌పై క్రేజ్ పెంచుకుంటున్నారు. ప్రతీదాన్ని ఫ్యాషన్ యాంగిల్‌లో థింక్ చేస్తున్నారు. లైఫ్‌స్టైల్ మొత్తం మార్చేసుకుంటున్నారు. తమ జీవితాన్ని తామే అందంగా తీర్చదిద్దుకుంటున్నారు. చదువులోనూ ఫ్యాషన్ కోర్సులనే ఎంచుకుంటున్నారు. పెద్దపెద్ద ఫ్యాషన్ డిజైనర్లను ఆదర్శంగా తీసుకుని ట్రెండ్ ఫాలో అవకుండా ట్రెండ్ సెట్ చేస్తున్నారు.

ఫ్యాషన్....ఫ్యాషన్....ఫ్యాషన్... ఎక్కడ చూసినా...ఏ నోట విన్నా... ఎవరిని కదిలించినా ఇదే మాట వినిపిస్తోంది. లైఫ్‌లో ఎన్ని టెన్షన్లు ఉన్నా, ఎన్ని ప్రాబ్లమ్స్ ఫేస్ చేస్తున్నా ఫ్యాషన్‌ను మాత్రం ఎవ్వరూ మిస్ అవడం లేదు. కాలం కంటే స్పీడ్‌గా పరిగెత్తి ప్రపంచాన్నే దున్నేయాలని అమ్మాయిలు, అబ్బాయిలు ఉత్సాహంగా ఉన్నారు. వ్యాపార రంగంలో అద్భుతాలు సృష్టించాలి అనుకునే వారికి ఫ్యాషన్ రంగంలో టన్నుల కొద్దీ అవకాశాలు ఉన్నాయి. నగరానికి చెందిన అనేక మంది ఫ్యాషన్ డిజైనర్లు ట్రెండ్స్‌ను ఒడిసి పట్టుకోవడం ద్వారా



**ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌లు, ఎక్స్‌పోలు, ర్యాంప్ వాక్‌లు సిటీలో 24/7 ఫ్యాషన్ హంగామా నడుస్తోంది. అందుకే యువత కూడా ఫ్యాషన్‌పై క్రేజ్ పెంచుకుంటున్నారు. ప్రతీదాన్ని ఫ్యాషన్ యాంగిల్‌లో థింక్ చేస్తున్నారు. లైఫ్‌స్టైల్ మొత్తం మార్చేసుకుంటున్నారు. తమ జీవితాన్ని తామే అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు. చదువులోనూ ఫ్యాషన్ కోర్సులనే ఎంచుకుంటున్నారు. పెద్దపెద్ద ఫ్యాషన్ డిజైనర్లను ఆదర్శంగా తీసుకుని ట్రెండ్ ఫాలో అవకుండా ట్రెండ్ సెట్ చేస్తున్నారు.**

వ్యాపార, వాణిజ్య రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు.

ఒకప్పుడు ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలకు పరిమితమైన ఫ్యాషన్ ఉత్పత్తులు ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా జెండా పాతేశాయి. దీంతో దేశ విదేశాలకు ఫ్యాషన్ డిజైనర్లను ఎగుమతి చేసే స్థాయికి భాగ్యనగరం చేరుకుంది. ఫ్యాషన్ డిజైనింగ్ అంటే కేవలం డిజైనింగ్ మాత్రమే అనే అపోహ చాలా మందిలో ఉంది. కానీ ఇది నిజం కాదు. డిజైనింగ్ అంటే ఏ రంగంలో అయినా కొత్తగా ఆలోచిస్తేనే అదే ఫ్యాషన్...అదే లేటెస్ట్ ట్రెండ్. ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా...బుల్లెట్టు దిగిందా లేదా? అన్నది పాయింట్ అనేది ఓల్డ్ డైలాగ్. సిట్యువేషన్ ఏదైనా... సీన్ ఎలాంటిదైనా చించేశామా లేదా అన్నదే లేటెస్ట్ వెపన్ అంటోంది యువత.

స్టైలింగ్, స్టిచిస్, క్లాత్ డిజైనింగ్, టైలరింగ్ కూడా ఫ్యాషన్ డిజైనింగ్ కిందకే వస్తాయి. ఫ్యాషన్ డిజైనర్లుగా స్థిరపడాలనుకునే వారికి ఈ రంగంలో ట్రైనింగ్ ఇవ్వడానికి సిటీలో చాలా కాలేజీలు ఉన్నాయి. ఫ్యాషన్ ప్రతిఒక్కరి లైఫ్‌స్టైల్‌ను మార్చేస్తోంది. హెయిర్ స్టైల్ నుంచి షూవేర్ వరకు ఫ్యాషన్ మంత్రి ఉండాల్సిందే. అందుకే సిటీలోని యువతే కాకుండా చిన్నచిన్న పట్టణాల్లో యువత కూడా ఫ్యాషన్‌కే జై కొడుతోంది. మొత్తానికి హైదరాబాద్ ఫ్యాషన్ హబ్‌గా మారుతోంది.

# లవ్లీ లాంగ్ గౌన్స్!

సెలబ్రేషన్స్‌లో వెలిగిపోవాలంటే... ఆకర్షణీయమైన ఈవెనింగ్ గౌన్స్ తప్పనిసరి. శాటిన్, నెటెడ్, సెక్విన్, ఎంబ్రాయిడరీ... ఇలా లాంగ్ గౌన్స్‌లో బోలెడన్ని వెరైటీలు. వాటిలో నప్పే గౌన్ ఎంచుకుంటే సెలబ్రేషన్ 'స్టార్' మీరే!



## బుట్ట బొమ్మల్లా!



నడుము కింద నుంచి వెడల్పుగా విస్తరించినట్టు కనిపించే గౌన్‌లో కూడా దేవకన్యలా వెలిగిపోవచ్చు. ఇందుకోసం గౌన్‌లో ఎక్కువ లేయర్లు ఉండేలా చూసుకోవాలి. అలాగని గౌన్ అసౌకర్యంగా, బరువుగా ఉండకూడదు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉండాలి.



## శాటిన్ గౌన్

సింపుల్‌గా, ఎలిగెంట్‌గా కనిపించాలనుకుంటే శాటిన్ మేడ్ లాంగ్ గౌన్ ధరించాలి. పార్టీలకు నప్పే ఈ గౌన్ బరువు కూడా చాలా తక్కువ. కాబట్టి క్రిస్మస్ వేడుకల్లో హుషారుగా పాల్గొనాలనుకుంటే, శాటిన్ గౌన్ బెస్ట్ ఆప్షన్!

## లేయర్ లాంగ్ గౌన్!

నిలువుగా ఒకే పొడవుతో ఉండే గౌన్ బోరు కొట్టిందా! అయితే అలలు అలలుగా ఎగసిపడే లేయర్ గౌన్ ఎంచుకోండి. ఛాతీ దగ్గర సెక్విన్ వర్క్‌తో, నడుము కింద నుంచి ప్లెయిన్‌గా ఉండే లేయర్ లాంగ్ గౌన్ నాజూకుగా కనిపించేలా చేస్తుంది. ఈ డ్రెస్‌తోపాటు, మెడలో చోకర్, చెవులకు స్టడ్స్ జోడిస్తే అలంకరణ పూర్తయినట్టే!

## గోళ్ళపై పూల పరిమళం!

కాస్త ఆసక్తి, అభిరుచి ఉంటే గోళ్ళను కూడా కాన్వాసుగా చేసుకోవచ్చు. నెయిల్ ఆర్ట్‌లో ప్రస్తుతం ఫ్లోరల్ డిజైన్స్ ట్రెండ్ నడుస్తోంది. నియోన్, కూల్ రంగుల నెయిల్ పాలిష్‌లను ఉపయోగించి గోళ్ళపై రకరకాల పూలను డిజైన్ చేసుకోవచ్చు. మీ వ్యక్తిత్వం, మూడ్, వేడుకను బట్టి కూడా ఫ్లోరల్ డిజైన్లను గోళ్ళపై వేసుకోవచ్చు. మెనిక్యూర్ చేసిన తర్వాత గోళ్లను హైలైట్ చేస్తూ వాటిపై నచ్చిన పువ్వులను వేస్తే ఆ లుక్కే వేరు. అప్పుడు చేతికున్న పది వేళ్లు పది కాన్వాసులను తలపిస్తాయి.

ఒక గోరుపై పూలు వేయాలంటే చుక్కల కోసం చిన్న పిన్ను, స్లెండర్ డిజైన్ బ్రష్, మూడు నెయిల్ పాలిష్ రంగులు అవసరమవుతాయి. ముందుగా హైలెట్ కావాలనుకుంటున్న రంగు నెయిల్ పాలిష్‌ను స్లెండర్ డిజైన్ బ్రష్‌తో గోరుపై వేయాలి. నెయిల్ ఆర్ట్‌లో డాటింగ్ టూల్స్ రకరకాల సైజుల్లో ఉంటే పువ్వులు మరింత క్లారిటీగా కనిపిస్తాయి. వాటితో చుక్కలు బాగా ఎలివేట్ అవుతాయి. గోళ్లపై పువ్వుల డిజైన్లు వేయడానికి బద్ధకించే వారి కోసం మార్కెట్లో ఫ్లోరల్ స్టెన్సిల్స్ కూడా లభిస్తాయి.

## ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్

ఆన్‌లైన్ అలవాటయ్యాక ఫ్యాషన్ మంత్రం పఠించేవాళ్ల సంఖ్య పెరిగిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన కాస్ట్యూమ్స్ వచ్చేస్తుండటంతో ఆన్..లైన్స్ ఆర్ బిజీ అయిపోతున్నాయి. ఓ కన్సల్టింగ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆన్‌లైన్ అంగట్లో ఫ్యాషన్ పొటెన్షియల్ ఏ రేంజ్‌లో ఉందో వెల్లడైంది.

**ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్ చేస్తున్న మహిళల సంఖ్య..**

2015లో 1.5 కోట్లు , 2020లో 7.5 కోట్లు

**ఫ్యాషన్ ట్రెండ్స్ గురించి ఆన్‌లైన్‌లో షేర్ చేసుకుంటున్న మహిళల సంఖ్య గతేడాదితో పోలిస్తే 2020 నాటికి 110% పెరగనుంది.**

2015లో 20% , 2020లో 42%

గూగుల్‌లో సెకనుకొకరు నయా ఫ్యాషన్స్ గురించి సెర్చ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ రిటైల్ మార్కెట్‌లో ఫ్యాషన్ సెక్టార్ వాటా ఈ ఏడాది 20% ఉంటే..



వచ్చే ఏడాది నాటికి 2325% వరకు పెరగనుంది.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ రెవెన్యూ వచ్చే ఏడాది 3540% అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులదే రాజ్యం. అయితే 2020 నాటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్లలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు లైఫ్‌స్టయిల్‌ఫ్యాషన్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేస్తారని అంచనా.



# బంగారంలాంటి మాట


మెరిసేదంతా బంగారం కాదు! అలాగని మేలిమి పసిడి తళుకులను అనుమానించ రాదు. నిన్నటి ధనత్రయోదశి మొదలు రేపటి దీపావళి, ఆపై వచ్చే కార్తీక మాసం, ఆ నెలలో వచ్చే వివాహాది శుభకార్యాలు వెరసి రానున్న రోజుల్లో మార్కెట్ స్వర్ణకాంతులీననుంది. ఇదే అదునుగా బంగారంలాంటి ఆఫర్లు ఊరిస్తున్నాయి. అయితే ఈ ప్రకటనలకు చిత్తుకాకుండా నిఖార్సయిన పుత్తడిని పొందాలంటే ఈ జాగ్రత్తలు పాటించండి.


మజూరీ లేదు.. తరుగూ లేదు.. జీరో మేకింగ్ చార్జెస్.. కనీవినీ ఎరుగని మెగా డిస్కౌంట్.. ఈ ప్రకటనలు వింటే చాలు ఎంత కాంతలైనా కనక దాసులు అయిపోతారు. పసిడి మెరుపులు మెరిసే దుకాణాల్లో నగనిగలు చూసి కాసేపు అన్నీ మర్చిపోతారు. ఈ వీక్‌నెస్ ఉన్నట్లయితే పైడి మాయలో పడి అసలు విషయాలను విస్మరించే ప్రమాదం ఉంది. అందుకే దుకాణాదారులు ఎంత తెలివిగా మాట్లాడినా.. ప్రాథమిక విషయాలపై స్పష్టత ఉండాలి. ఇన్ని ఆఫర్లు ఇస్తున్నారంటే కాస్త ఆలోచించాల్సిందే.

బిస్కెట్ బంగారం తీసుకున్నా.. జ్యువెలరీ తీసుకున్నా.. బంగారం స్వచ్ఛత గురించి ముందుగా అడిగి తెలుసుకోవాలి. దక్షిణభారతంలో చాలావరకు నగలన్నీ 22 క్యారెట్ల బంగారంతో చేస్తుంటారు. అయితే ధరల విషయంలో హెచ్చుతగ్గులు గోల్డ్ ప్యూరిటీని బట్టే ఉంటాయి. సదరు వస్తువు 22 క్యారెట్లతో చేసిందా? 18 క్యారెట్లా, 14 క్యారెట్లతో తయారు చేసిందా..? అని వస్తువు కొనడానికి ముందే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. గోల్డ్ మంచిదైనా ఆభరణంలో పొదిగిన రాళ్లు, రత్నాల నాణ్యతపైనా ఓ కన్నేయాలి. ముఖ్యంగా సేల్స్‌పర్సన్ చెప్పే మాటలు గుడ్డిగా నమ్మెయొద్దు. కొనడానికి ముందే ఎక్స్‌చేంజ్ చేయడానికి ఎలాంటి షరతులు ఉన్నాయో గమనించాలి. అన్నీ ఓకే అనుకుంటే తప్ప కొనుగోలు చేయరాదు.

పండుగల వేళ ఎక్స్‌చేంజ్ ఆఫర్లు బాగా ఆకర్షిస్తాయి. అయితే తెలియని నిబంధనలు చాలానే ఉంటాయి. ఆ నిబంధనలు మీకు అర్థమైతే తప్ప ముందడుగు వేయరాదు. స్వచ్ఛత విషయంలో ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నది కాదనలేని సత్యం. కాకపోతే 'ప్యూరిటీ తక్కువగా ఉందని, తరుగు ఎక్కువ అవుతుందని' ఏవో మాటలు చెప్పి దాని విలువ అమాంతంగా తగ్గించేస్తారు. అందుకే.. పాతనగలు మార్చే విషయంలో కాస్త మంచిచెడులు బేరీజు వేసుకోండి. బంగారం తూకంలో మిల్లీగ్రాములు లెక్కించడం కూడా చాలా ముఖ్యం. ఒకటికి రెండు సార్లు వెయిట్ చెక్ చేయడం తప్పనిసరి. ఇవన్నీ పాటిస్తేగాని మీ ఇల్లు మేలిమి బంగారం కాదు! చిన్న ఉంగరమైనా.. పెద్ద వడ్డాణమైనా.. ఏదైనా సరే బంగారంతో చేసిందైతే ఆ వస్తువుపై ఈ అయిదు గుర్తులు ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించండి.

## 'చెవి' కెక్కిన టాటూ!





టాటూలు చెవికెక్కుతున్నాయి అంటే ఎవరూ చెవికెక్కించుకోకపోవచ్చు. ఇది నిజం. ఇపుడిదే ఇన్‌స్టాగ్రమ్‌లో లేటెస్ట్ ట్రెండ్. దీన్ని 'హెలిక్స్ టాటూ ట్రెండ్' అంటూ పిల్చుకుంటున్నారు. ప్రకృతిని చూసి దీన్ని వేస్తున్నామని టాటూ వేసేవారంటున్నారు. చెవిపై నుంచి కిందకు అందంగా ఆకులు, పువ్వులు స్టిక్కరింగ్ చేశారేమో అని భ్రమించేట్లు.. టాటూ వేయించుకుంటున్నారు. జుట్టుకు రబ్బర్ బాండ్ వేసుకుని మరీ అందమైన హెలిక్స్ ఆర్ట్ ఉన్న చెవుల్ని యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన అమ్మాయిలు చూపిస్తున్నారట. వీరందరూ దాదాపు తమ చెవుల సోయగాల్ని ఫొటోతీసి ఇన్‌స్టాగ్రమ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గర్వంగా హెలిక్స్ టాటూ వేయించుకున్నామని ఫోజులు కొడుతూ కామెంట్స్ రాస్తున్నారు.

# హనుమాన్ సీక్వెల్.. జై హనుమాన్!



తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన 'హను-మాన్' చిత్రం ఈ సంక్రాంతికి విడుదలై ఎంతగా విజయం సాధించిందో తెలిసిందే! సూపర్ హీరో కథకు ఇతిహాసాన్ని జోడించి ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్'ను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని ఉద్దేశించి ప్రశాంత్ వర్మ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సీక్వెల్‌లో తేజ హీరో కాదని తెలిపారు. 'హను-మాన్' సక్సెస్‌లో భాగంగా ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని పంచుకున్నారు.
'హను-మాన్' కంటే వందరెట్లు భారీ స్థాయిలో 'జై హనుమాన్' ఉండబోతోంది. ఈ సీక్వెల్‌లో తేజ సజ్జా హీరో కాదు. 'జై హనుమాన్'లోనూ అతడు హనుమంతుడు పాత్రలో కనిపిస్తాడు. కానీ, ఆ సినిమా హీరో ఆంజనేయ స్వామి. ఆ పాత్రను స్టార్ హీరో చేస్తారు. 2025లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. దీనికంటే ముందు నా నుంచి మరో రెండు చిత్రాలు రానున్నాయి. అందులో ఒకటి 'అధీర'. మరొకటి 'మహాకాళి' అని ప్రశాంత్ వర్మ వెల్లడించారు. రూ.45 కోట్ల బ్జడెట్‌తో 'హను-మాన్' చేశామని చిత్ర బృందం తెలిపింది. విడుదలైన పది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లు వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దేశం మొత్తం వినిపిస్తున్న మాటలు రెండు మాత్రమే అందులో ఒకటి జై శ్రీరామ్ కాగా మరోటి హనుమాన్. మొదటిది అయోధ్యలో రామ మందిర ప్రారంభం, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశం మొత్తం జై శ్రీరామ్ నామ స్మరణలతో మారుమ్రోగుతుండగా మరోవైపు హనుమాన్ సినిమా ప్రపంచవ్యాప్తంగా అప్రతిహాతంగా దూసుకెళుతూ కలెక్షన్ల రికార్డులు సృష్టిస్తుండడంతో పాటు తెలుగు వారి గురించి మరోసారి చర్చించేలా చేస్తోంది. ఇప్పటికి రిలీజైన అన్ని చోట్ల నుంచి సూపర్ పాజిటివ్ తెచ్చుకుంది. గతంలో ఎప్పుడు చూడని రికార్డులను తిరగ రాస్తున్నది. రోజురోజుకు కలెక్షన్లను పెంచుకుంటూ పోతుంది. ఈ హవా మరో వారం పదిరోజులు ఉండేలా కనిపిస్తోంది. ఓవర్సీస్‌లో 4కోట్ల 10 లక్షల బ్రేక్ ఈవెన్‌తో విడుదలైన హనుమాన్ సినిమా ఈరోజు వరకు రూ33 కోట్లకు పైగా కలెక్షన్లు సంపాదించి గుంటూరు కారం వసూళ్లను దాటేసింది.

## లావణ్య త్రిపాఠీ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్

### మిస్ పర్‌ఫెక్ట్ వెబ్ సీరిస్




తెలుగు వెబ్ సిరీస్‌లు ఇప్పుడు విరివిగా వస్తున్నాయి. ప్రముఖ నటి లావణ్య త్రిపాఠీ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో 'మిస్ పర్ఫెక్ట్' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ని నిన్న విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్‌లో అభిజీత్ మెయిన్ రోల్ చేస్తున్నారని అన్నప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను అని చెప్పాడు దర్శకుడు విశ్వక్. 'నేను బిగ్ బాస్ చూడలేదు, కానీ అభిజీత్ చేసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్', మరికొన్ని ప్రాజెక్ట్స్ చూశాను. తను ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం లేకున్నా..ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు'. అని చెప్పాడు దర్శకుడు. ఇందులో లావణ్య లీడ్ రోల్ చేస్తున్నారు అనగానే ఆమె చేసిన 'అందాల రాక్షసి' లో ఆమె పర్ ఫార్మెన్స్ ఎలా ఉందో అలాంటి పర్ ఫార్మెన్స్ ఈ వెబ్ సిరీస్ లో కూడా తీసుకురావాలని అనుకున్నాను. కొత్త టాలెంట్ ను ప్రోత్సహించడం అంటే నాగార్జునకి చాలా ఇష్టం. న్యూ టాలెంట్ ను వెలుగులోకి తీసుకురావడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇప్పుడు ఈ 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ తో మేము అదే ప్రయత్నం చేశాం, అని చెప్పారు నిర్మాత యార్లగడ్డ సుప్రియ. ఈ జర్నీలో హాట్ స్టార్ చాలా సపోర్ట్ చేసింది. ఈ సిరీస్ కోసం చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన క్యారెక్టర్ చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఎంటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. 'సోగ్గాడే చిన్ని నాయన' టైమ్ నుంచి లావణ్యతో నాకు మంచి స్నేహం ఉంది. మిస్ పర్ఫెక్ట్ కు తనే పర్ఫెక్ట్ అనిపించింది. ఒక చిన్న కథలో బలమైన క్యారెక్టర్స్ ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. ఫిబ్రవరి 2న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో చూడండి, అని చెప్పారు సుప్రియ. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున మా సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేసుకోవడం హ్యాపీగా ఉంది అని చెప్పారు ఈ వెబ్ సిరీస్ లో ప్రధాన పాత్ర పోషిస్తున్న లావణ్య త్రిపాఠి. 'ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. సిరీస్ కంప్లీట్ అయ్యేలోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యాను. ఈ సిరీస్ కు ముందు నేను చేసిన కొన్ని ప్రాజెక్ట్స్ కు స్ట్రెస్ ఫీలయ్యాను. అలాంటి టైమ్ లో 'మిస్ పర్ఫెక్ట్' లాంటి ఒక స్క్రిప్ట్ దొరకడం రిలీఫ్ లా ఫీలయ్యాను. పాజిటివ్ ఫీలింగ్ కలుగుతోంది. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ట అభిజీత్ ముహూర్తంలో చేశారు. నా లైఫ్ లో ఇది మర్చిపోలేని సందర్భం అనుకుంటా, అని చెప్పాడు ఈ వెబ్ సిరీస్ లో లీడ్ యాక్టర్ గా వేసిన అభిజీత్. 'అన్నపూర్ణ సంస్థలో పనిచేయడం ఎప్పుడూ హ్యాపీగా ఉంటుంది. ఈ వెబ్ సిరీస్ స్క్రిప్ట్ బాగా నచ్చింది,లావణ్య గారితో కలిసి నటించడం సంతోషంగా ఉంది, అని చెప్పాడు అభిజిత్.

## రాముడి ప్రాణప్రతిష్ట.. నాకు ప్రత్యేకం


### నటి లావణ్యత్రిపాఠి వెల్లడి

అయోధ్యలో బాలరాయుని ప్రాణప్రతిష్ఠ సోమవారం శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా మెగా కోడలు లావణ్య త్రిపాఠీ ఓ ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. అయోధ్యలో పుట్టిన ఆమె ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది. రాముని జన్మస్థలమైన అయోధ్యలో పుట్టిన నేను ప్రాణ ప్రతిష్ట వేడుకను తిలకించటం అదృష్టంగా భావిస్తున్నాను. నాతో సహా భారతీయులందరికీ ఇది గర్వించదగ్గ విషయం. ఈ పండగ వాతావరణంలో నేను రామ్ పరివార్ జ్యువెలరీ ధరించడం సంతోషంగా ఉంది. విగ్రహ ప్రాణప్రతిష్ట కేవలం అయోధ్యలోనే కాదు దేశమంతా ప్రాధాన్యత సంతరించుకుంది. దేశమంతా ఏకతాటిపైకి వచ్చి రాముడి రాకను సంబరాలు చేసుకుంటోంది. ఇది మనందరినీ ఏకం చేసే ఉత్సవం. ఇది మనలో ఐకమత్యాన్ని, అన్ని వర్గాలవారూ ఒక్కటే అన్న భావాన్ని పెంపొందిస్తుంది. మనసులో అపార భక్తిని నింపుకుందాం.. అయోధ్యలోనే కాకుండా దేశమంతా శాంతియుతంగా ఉండాలని కోరుకుందాం.. జై శ్రీరామ్' అని తన పోస్ట్‌లో పేర్కొంది మెగా కోడలు లావణ్యా త్రిపాఠీ. ఈ పోస్ట్‌కు చీరకట్టులో ఉన్న ఫోటోను జత చేసింది. శ్రీరామపట్టాభిషేకాన్ని సూచిస్తున్నట్లుగా ఉన్న రామ్ పరివార్ ఆభరణం ఆకట్టుకుంది.



## సిద్దార్థ్ రాయ్ ట్రైలర్ విడుదల

చాలా చిత్రాల్లో బాల నటుడిగా నటించిన దీపక్ సరోజ్ ఇప్పుడు కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్దార్థ్ రాయ్'. దీనికి వి యశస్వి దర్శకత్వం వహించాడు. రధన్ సంగీతాన్నందించిన ఈ సినిమా ట్రైలర్ ఈరోజు విడుదలైంది. ఇందులో దీపక్ సరోజ్ సిద్దార్థ్ రాయ్ గా కనిపిస్తాడు, అలాగే అతని పాత్రకి రెండు వైవిధ్యాలున్నాయని అర్థం అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ చూసాక ఇది కొంచెం అర్జున్ రెడ్డి సినిమాతో పోలుస్తారు అని అనిపిస్తోంది. ఈ సినిమా టీజర్ గత సంవత్సర విడుదలైంది, అప్పుడే ఈ సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథా చిత్రమని తెలిసింది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ చూసాక ఈ సినిమా కచ్చితంగా వైవిధ్యంగా వుండబోతోంది అని కూడా తెలుస్తోంది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పనిచేశారని చిత్ర నిర్వాహకులు చెపుతున్నారు. కెమెరా శ్యామ్ కె నాయుడు, ఎడిటర్ ప్రవీణ్ పూడి పనిచేస్తుండగా ఈ సినిమాకి నిర్మాతలు జయ ఆడపాక, ప్రదీప్‌పూడి, సుధాకర్ బోయిన. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వి.యశస్వి. ఈ సినిమా ఫిబ్రవరి లో విడుదలవుతుందని ఈరోజు ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో చెప్పడం జరిగింది. ఇందులో కథానాయికగా తన్వి నేగి నటించగా, కీర్తన ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనుంది.




## అయలాన్-2 కూడా రెడీ

తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న నటుడు శివకార్తికేయన్. ఈ టాలెంటెడ్ హీరో నటించిన చిత్రం అయలాన్. ఆర్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో టాలీవుడ్ భామ రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించింది. తమిళనాట పొంగళ్ కానుకగా జనవరి 12న విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. అయలాన్ తెలుగు వెర్షన్ జనవరి 26న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా తెలుగు రిలీజ్ డేట్ ఇంకా రాకముందే మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ అందించారు. ఈ సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కూడా రెడీ అవుతున్నట్టు ప్రకటించారు. అయలాన్ 2 ఒకే అయింది. కేజేఆర్ స్టూడియోస్, ఫాంటోమ్‌ఎఫ్ ఎక్స్ స్టూడియో సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించాయి. అయలాన్ సక్సెస్‌తో తాము రెండో పార్టును మీ ముందుకు తీసుకురాబోతున్నట్టు తెలియజేశారు. కోలీవుడ్ నుంచి రాబోతున్న పర్‌ఫెక్ట్ పాన్ వరల్డ్ సినిమా కావడం ఖాయమని అంటున్నారు ట్రేడ్ పండితులు. ఇండియన్ సినిమాలో మాస్టర్ లాంటి సినిమా కోసం జనవరి 18న అయలాన్ 2 కోసం అధికారికంగా ఒప్పందం చేసుకోవడం జరిగింది. అయలాన్‌లో శరద్ కేల్కర్, ఇషా కొప్పికర్, భానుప్రియ, యోగి బాబు, కరుణాకరన్, బాల శరవణన్ ఇతర కీలక పాత్రలు పోషించారు.
శివకార్తికేయన్ మరోవైపు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ సినిమా కూడా చేస్తున్నాడని తెలిసిందే. ఎస్‌కె21గా వస్తున్న ఈ మూవీలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన నయా అప్‌డేట్ రావాల్సి ఉంది.



## ఇండియానా జోన్స్‌లా మహేశ్ సినిమా



సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, అగ్ర దర్శకుడు రాజమౌళి కలయికలో 'ఎస్ఎస్ఎంబీ29' రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులు ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిత్ర రచయిత వి.విజయేంద్ర ప్రసాద్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. ఆ చిత్రం 'ఇండియానా జోన్స్'లా ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఈ సినిమాకి టైటిల్ ఖరారు కాలేదు. కథ ఎక్కువగా అడవి నేపథ్యంలో సాగుతుంది. పీరియాడికల్ కథ కాదు. స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని తెలిపారు. 'ఈ సినిమాతో మహేశ్‌బాబు ఇమేజ్ మరింత పెరిగే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు 'ఏ సినిమాలో అయినా ప్రధాన పాత్ర పోషించే నటులకు మంచి గుర్తింపురావాలని మా వంతు ప్రయత్నం చేస్తాం' అని విజయేందప్రసాద్ పేర్కొన్నారు. అంతే కాదు బాలీవుడ్‌లో 'బజరంగి భాయిజాన్' సీక్వెల్ కథ పూర్తయిందని, సల్మాన్‌ఖాన్‌కు వినిపించానని చెప్పారు. చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవు తుందనేది చూడాలన్నారు. తన డ్రీమ్ ప్రాజెక్టు అయిన 'సీత'ను హాలీవుడ్ స్థాయిలో రూపొందిస్తామని, ఆ పాత్రకు సరిపడ కొత్త నటి కోసం అన్వేషిస్తున్నామని చెప్పారు.

## జబర్దస్త్ ధన్‌రాజ్ దర్శకత్వంలో రామం రాఘవం

కోలీవుడ్ దర్శకుడు, నటుడు సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రామం రాఘవం' సినిమాతో టాలీవుడ్ నటుడు ధనరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పొలవరపు నిర్మిస్తున్నాడు. నేడు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ ను విడుదల చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్‌ను 22 మంది సినీ ప్రముఖులు విడుదల చేయడం విశేషం. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ గమనిస్తే.. తండ్రి కొడుకులుగా సముద్రఖని , ధనరాజ్ డైనమిక్ గా కనిపిస్తున్నారు. ఇంటెన్స్ తో కూడిన పోస్టర్ కు విశేష స్పందన లభిస్తోంది. ఇదివరకు ఎప్పుడూ చూడని ఒక తండ్రి కొడుకుల కథను అద్భుతంగా తెరమీద ఆవిష్కరిస్తున్నామని దర్శకుడు ధనరాజ్ కొరనాని తెలిపారు.. ఈ సినిమాలో మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య పృద్వి, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చ రవి, ఇంటూరి వాసు, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి విమానం చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానా కథ ను సమకూర్చగా అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నాడు, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. దుర్గా ప్రసాద్ ఈ సినిమాకు కెమెరామెన్. హైదరాబాద్, చెన్నై, అమలాపురం, రాజమండ్రి, రాజోలు, పరిసర ప్రాంతాల్లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 'రామం రాఘవం'తమిళ తెలుగు భాషలలో ఒకేసారి విడుదల కానుంది.



# వైసీపీని వీడిన నరసరావుపేట ఎంపీ

- పార్టీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా

**నరసరావుపేట, వెలుతురు:**
రాష్ట్రంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు, పార్టీ సీనియర్ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు మంగళవారం వైసీపీకి గుడ్ చెప్పారు. అలాగే



లోక్‌సభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. 'అవును. నిజమే నేను వైసీపీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశానని శ్రీకృష్ణ దేవరాయలు మీడియాకు వెల్లడించారు. తన నియోజకవర్గాన్ని మారుస్తారని వస్తున్న వదంతుల నేపథ్యంలో ఆయన నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. గత కొన్ని నెలలుగా నరసరావుపేట లోక్ సభ నియోజకవర్గ స్థానం నుంచి శ్రీకృష్ణ దేవరాయలును పార్టీ అధినేత, ఏపీ సీఎం జగన్ మారుస్తారని ప్రచారం జరుగుతున్నది. నరసరావుపేట స్థానాన్ని వదులుకోవడానికి ఇష్టపడని శ్రీకృష్ణ దేవరాయలు పార్టీ నుంచే వైదొలిగినట్టు తెలుస్తున్నది. 40 ఏండ్ల శ్రీకృష్ణ దేవరాయలను మార్చాలని గత ఆరు నెలలుగా పార్టీ అంతర్గతంగా భావిస్తున్నప్పటికీ 15 రోజులుగానే ఈ వ్యవహారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ డ్రామాకు తెర దించాలనే ఉద్దేశంతోనే ఆయన పార్టీకి గుడ్‌బై చెప్పినట్టు తెలుస్తున్నది. రాజీనామాలో బాటలోనే మరో ఇద్దరు వైసీపీ నేతలు ఉన్నట్టు సమాచారం. అయితే, తాను ఏ పార్టీలో చేరబోయేది, తన భవిష్యత్తు కార్యాచరణ ఏమిటనేది త్వరలోనే వెల్లడిస్తానని శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.

# రాష్ట్రమంతా దొంగలమయం

## వైసీపీ ప్రభుత్వంపై బిజెపి అధికార ప్రతినిధి భాను ప్రకాష్ విమర్శ

**విజయవాడ, వెలుతురు:**
దేశమంతా రామ మయం అయిపోతే.. ఆంధ్రప్రదేశ్ అంతా దొంగలమయం అయిపోయిందని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దొంగ ఓట్లు, కరెన్సీ నోట్లతో ఎన్నికల్లో గెలవాలని అధికార పార్టీ



పన్నాగాలు పన్నుతోందని విమర్శించారు. నకిలీ ఎపిక్స్ కార్డులపై రాష్ట్ర వ్యాప్తంగా దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అక్రమాల బాగోతంలో అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం.. దీని వెనుక ఉన్న పెద్దలను కూడా శిక్షించాలని కోరారు. నకిలీ ఎపిక్స్ కార్డులపై నిజాయితీగా దర్యాప్తు చేపడితే.. అప్పటి ఎన్నికల్లో ఎన్నికైన అధికార పార్టీ నేతలు తమ పదవికి అనర్హులవుతారని అన్నారు. దొంగ ఓట్లు, కరెన్సీ నోట్లనే నమ్ముకుని వైసీపీ ఈ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని చూస్తున్నట్లు అర్థమవుతోందని చెప్పారు. తిరుపతి లో 34 వేలకు పైగా ఎపిక్ కార్డులు డౌన్ లోడ్ చేసుకోవడం వైసీపీ అక్రమాలను తేటతెల్లం చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఫిర్యాదుతోనే బట్టబయలైందన్నారు. ఈ కేసును పోలీసులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే తిరుపతి ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశామని, నిష్పక్షపాతంగా విచారించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఏపీలో ఐపీసీ సెక్షన్లు పని చేయడం లేదు.. వైసీపీ సెక్షన్లు పని చేస్తున్నాయని సెటైర్ వేశారు. దొంగఓట్ల వ్యవహారంలో న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఒక్క తిరుపతిలోనే 34వేల దొంగ ఓట్లు ఉంటే.. ఇతర నియోజకవర్గాల్లో వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. తిరుపతి ఎంపీని అనర్హుడిగా ప్రకటించి తొలగించాలని డిమాండ్ చేశారు.

# గ్రూప్ 1 దరఖాస్తు గడువు పెంపు

**అమరావతి, వెలుతురు:**
ఏపీలో గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తొలుత పేర్కొన్న ప్రకారం గ్రూప్-1 ఉద్యోగ దరఖాస్తుల గడువు జనవరి 21తో ముగిసింది.
అయితే, దరఖాస్తుల గడువును ఏపీపీఎస్సీ నేడు పొడిగించింది. జనవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు అభ్యర్థులు ఆన్ లైన్ లో గ్రూప్-1 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పొడిగింపు నిర్ణయం తీసుకున్నామని, మరోసారి పొడిగించేది లేదని స్పష్టం చేసింది.
నోటిఫికేషన్ లో పేర్కొన్నట్టే... మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమ్స్ జరుగుతుందని వెల్లడించింది. గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు https://psc.ap.gov.in వెబ్ పోర్టల్‌ను సందర్శించాలని ఏపీపీఎస్సీ సూచించింది.

# ఎమ్మెల్యే గంటా రాజీనామా ఆమోదం

- విశాఖ ఉక్కు పరిశ్రమకు మద్దతుగా గతంలో గంటా రాజీనామా
- ఇప్పటిదాకా పెండింగ్ లో ఉంచిన అసెంబ్లీ స్పీకర్
- త్వరలో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక
- కీలక సమయంలో గంటా రాజీనామా ఆమోదం!

**విశాఖపట్నం, వెలుతురు:**
విశాఖ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండేళ్ల కిందట స్టీల్ ప్లాంట్ కు మద్దతుగా తన పదవికి రాజీనామా చేశారు. ఎవరూ ఊహించని విధంగా, అసెంబ్లీ స్పీకర్ ఇన్నాళ్ల తర్వాత గంటా రాజీనామాను ఆమోదించారు. ఏపీలో త్వరలోనే రాజ్యసభ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఇవి పరోక్ష ఎన్నికలు కాగా, ఈ సమయంలో గంటా రాజీనామాను ఆమోదించడం వైసీపీ రాజకీయ వ్యూహంలో భాగమేనన్న ప్రచారం జరుగుతోంది.



ఏపీలో కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేశ్ (బీజేపీ), వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (వైసీపీ) పదవీకాలం పూర్తికావొస్తోంది. వీరిస్థానాల్లో ముగ్గురు కొత్తవారిని రాజ్యసభకు పంపాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఓటు హక్కు ఉంటుంది. సరిగ్గా రాజ్యసభ ఎన్నికల సమయంలో గంటా శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యేగా మారిపోవడంతో, ఈసారి ఆయన ఓటు హక్కు కోల్పోయినట్టే. ఇది ఆయనకు మింగుడుపడని పరిణామమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టీడీపీకి కూడా ఇది నిరాశ కలిగించే విషయం కానుంది.

# మత్స్యకారులను ఆదుకుంటా...

- బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి
- రూ.రూ.5.38కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడి
- పార్లమెంట్ పరిధిలో మత్స్యకారుల కష్టాలు తీర్చి , జీవన ప్రమాణాలు పెంచుతానని స్పష్టం
- రెండు అతిపెద్ద ఫిషింగ్ ఓడలు, ఫిషింగ్ ప్లాట్‌ఫాంలు, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు...

**బందరు, వెలుతురు:**
మత్స్యకారులకు మౌలిక వసతులు కల్పించి, వారి జీవనప్రమాణాలు పెంచి, ఆర్థికవృద్ధికి తోడ్పాటు అందించే విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పష్టం చేశారు. బందరు పార్లమెంట్ పరిధిలోని అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో నివశిస్తున్న మత్స్యకారుల ఇబ్బందులు, కష్టాలను దగ్గర నుంచి తెలుసుకున్నానని ఆయన తెలిపారు. మత్స్యకార సామాజిక వర్గాన్ని అన్నివిధాలుగా ఆదుకునేందుకు గతంలో చెప్పిన విధంగానే కేంద్ర ప్రభుత్వ సంస్థతో మాట్లాడి దాదాపు రూ.5.38 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు ఎంపీ బాలశౌరి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో సంబంధిత వివరాలను తెలియజేశారు. కేంద్ర సంస్థ నిధులతో మత్స్యకార సామాజిక వర్గాన్ని అన్నిరకాలుగా ఆదుకుంటామని ఎంపీ పేర్కొన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సముద్రంలోపలికి వెళ్లి డీప్ ఫిషింగ్ చేసేందుకు వీలుండే అత్యాధునిక సాంకేతికతతో కూడిన రెండు అతిపెద్ద బోట్లు, చేపలను తీసుకొచ్చే వాహనం, మత్స్యకార గ్రామాల్లో ఫిషింగ్ ఫ్లాట్‌ఫాంలు ఏర్పాటు, ఆయా గ్రామాల్లో శుద్ధిచేసిన తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు ఎంపీ తెలిపారు.

దీనికి సంబంధించి ఇప్పటికే సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇక త్వరలో పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేసి మత్స్యకారులను అన్నివిధాలుగా ఆదుకునేందుకు చొరవ తీసుకుంటున్నట్లు ఎంపీ బాలశౌరి అన్నారు.



## మత్స్యకారులకు జరిగే అభివృద్ధి ఇలా..

మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో గత అయిదేళ్లుగా మత్స్యకారుల అభివృద్ధి కోసం జరిగిన పనులు గతంలో ఎన్నడూ జరగలేదని ఎంపీ బాలశౌరి స్పష్టం చేశారు. బందరు పోర్టుకు శంకుస్థాపన చేయడం, ఆ పోర్టుకు సంబంధించి నిధులు తీసుకురావడం వల్ల నేడు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపీ తెలిపారు. పోర్టు అందుబాటులోకి వస్తే కృష్ణా జిల్లాలోని మత్స్యకార యువతకు ఉపాధి లభిస్తుందని, ఆయా వర్గాలు పెద్ద పెద్ద వ్యాపారాలు చేసుకునే వీలుందని ఆయన చెప్పారు. ఇక తాజాగా కేంద్ర ప్రభుత్వ సంస్థతో మాట్లాడి.. మత్స్యకార యువతకు ఉపాధి అవసరాలు తీరేలా రెండు అతిపెద్ద బోట్లను రూ.3.22కోట్లు పెట్టి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎంపీ తెలిపారు. వీటి ద్వారా సముద్రంలో లోపలికి వెళ్లి ఖరీదైన చేపలను పట్టి వాటిని విక్రయించుకోవడం వల్ల ఆర్థికంగా యువత ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా మరో రూ.14లక్షలు వెచ్చించి చేపలను తరలించే వాహనాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు మహిళలు సైతం చిరు వ్యాపారాలు చేసుకునేలా వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో సకల సౌకర్యాలతో ఫిష్ ఫ్లాట్‌ఫాంలు రూ. 1.66కోట్లు వెచ్చించి మత్స్యకార గ్రామాల్లో ఏర్పాటు చేయించనున్నట్లు ఎంపీ బాలశౌరి చెప్పారు. ఫిష్ ఫ్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసే ప్రాంతంలో విద్యుత్తు, నీరు ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మత్స్యకార గ్రామాల్లో తాగునీరు, మెరుగైన వైద్యం అందించేందుకు మరో రూ.33లక్షలను వెచ్చించి తాగునీరు అందించే మైక్రోవాటర్ ఫిల్టర్లు, పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. తుఫానుల సంభవించినప్పుడు, భారీ వర్షాల సమయంలో చేపలు తడిచిపోకుండా, పాడవకుండా మరో రూ.12 లక్షలతో మత్స్యకార రైతుల కోసం షెడ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. ఇవన్నీ కలిపి దాదాపు రూ.5కోట్ల 38 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## బందరు పోర్టుతో మొదలైన అభివృద్ధి..

మచిలీపట్నం పోర్టు పనులతో అభివృద్ధి పనులు మొదలైనట్లు ఎంపీ బాలశౌరి తెలిపారు. పోర్టు పూర్తయితే ఎంతో మంది యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. గత కొంతకాలంగా మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ప్రజల ఇబ్బందులు, కష్టాలను గుర్తించి తనకు మద్దతుగా ఉన్న ప్రజల కోసం ఏదైనా చేయాలని సంకల్పంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీ తెలిపారు. మచిలీపట్నం పేరులోనే మచిలీ అనగా చేపలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో విరివిగా ఉన్న అగ్నికుల క్షత్రియులను ఎప్పుడు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఎంపీ బాలశౌరి తెలిపారు.
వారి అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తూనే ఉంటానన్నారు. ఇప్పుడు చేస్తున్న సాయంతో పాటు మత్స్యకార సామాజిక వర్గాలకు వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి చిన్న చిన్న పడవలు, వలలు, ఫిష్ డ్రై ప్లాట్ ఫారంలు నిర్మాణం మొదలైన వాటి కోసం ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయించే కార్యక్రమం అతి త్వరలో చేపడుతున్నట్లు ఎంపీ తెలిపారు. త్వరలోనే అతి పెద్ద లోన్ మేళా కార్యక్రమం నిర్వహించి ప్రతి మత్స్యకార కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించబోతున్నట్లు ఎంపీ బాలశౌరి స్పష్టం చేశారు.

# వైసిపికి కౌంట్ డౌన్ స్టార్ట్..

- పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర
- సొంత పార్టీ ఎమ్మెల్యేలే జగన్ ను నమ్మడం లేదని విమర్శ

**గుంటూరు, వెలుతురు:**
వైసీపీలో రాజకీయ బదిలీలను ప్రస్తావిస్తూ టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి నిన్నటి వరకు గొప్పలు... నేడు తిప్పలు అంటూ వివిధ గణాంకాలతో ట్వీట్ చేశారు. వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని స్పష్టం చేశారు.
"నన్ను మించిన సంక్షేమ ప్రభుత్వం లేదు... 175 గెలుస్తా అని జగన్ నిన్నటి వరకు గొప్పలు చెప్పారు. వాస్తవం ఏంటంటే... జగన్ కు తన పాలనపైనే నమ్మకం లేదు. తన ఎమ్మెల్యేల పనితీరునూ నమ్మడం లేదు. జనం జగన్ ను నమ్మడం లేదు. జగన్ ఎమ్మెల్యేలను నమ్మడం లేదు. అందుకే 68 మంది బదిలీలు చోటుచేసుకున్నాయి.
68 రాజకీయ బదిలీల్లో సీట్లు కోల్పోయిన వారు 29 మంది...
సీట్లు ఎగ్గొట్టిన వారిలో దళితులు 11 మంది... సీట్లు పీకేసిన వారిలో బీసీలు నలుగురు...
సైకోతో వేగలేం అంటూ రాజీనామా చేసిన ఎంపీలు నలుగురు (రఘురామ రాజు, బాలశౌరి, సంజీవ్ కుమార్, శ్రీ కృష్ణ దేవరాయలు)....
మాకొద్దీ తుగ్లక్ అంటూ పార్టీ వీడిన ఎమ్మెల్యేలు ఆరుగురు (ఆనం, కోటం రెడ్డి, మేకపాటి, ఆళ్ల, ఉండవల్లి శ్రీదేవి, పార్థ సారథి)...
రివర్స్ సీఎంతో కష్టం అంటూ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎమ్మెల్సీలు ఇద్దరు (విశాఖ ఎమ్మెల్సీ వంశీ కృష్ణ యాదవ్, కడప ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య)...
వైసీపీలో దళితుల ఆత్మగౌరవంపై నిజాలు చెప్పిన ఎస్సీ ఎమ్మెల్యేలు నలుగురు (పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, నంది కొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి)...



ఇప్పుడు చెప్పండి... జగన్ కు తన ప్రభుత్వంపై నమ్మకం ఉందా?
ఇప్పుడు చెప్పండి... వైసీపీలో దళితులకు గౌరవం ఉందా?
ఇప్పుడు చెప్పండి... బీసీలకు వైసీపీలో విలువ ఉందా?
ఇప్పుడు చెప్పండి... జగన్ కు అసలు తనపై తనకు నమ్మకం ఉందా?
వైనాట్ 175 నుంచి వుయ్ ఆర్ గోయింగ్ టు ఔట్ అనే పరిస్థితికి వైసీపీ దిగజారింది.
సైకో పోవడం ఖాయం....టీడీపీ-జనసేన ప్రభుత్వం తథ్యం!" అంటూ ధూళిపాళ్ల తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# జగన్ బాధితులంతా స్టార్ క్యాంపెయినర్లే

- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వ్యంగ్యం
- ఉరవకొండ సభలో జగన్ కొత్త అబద్ధాలు చెప్పారని విమర్శ

**గుంటూరు, వెలుతురు:**
"షిక్కటి చిరునవ్వుతో, షక్కటి అబద్ధాలతో అక్కచెల్లెమ్మల్ని 5 ఏళ్లుగా మోసగిస్తూనే ఉన్నావుగా జగన్ రెడ్డీ... వచ్చే ఎన్నికల్లో నీకు బుద్ధి చెప్పడానికి మహిళలు సిద్ధమయ్యారు" అంటూ సీఎం జగన్ పై టీడీపీ నేత నక్కా ఆనంద్ బాబు ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి అక్కచెల్లెమ్మలను మోసగించడానికి సరికొత్తగా నేడు ఉరవకొండలో కొత్త అబద్ధాలు చెప్పాడని, చిక్కటి చిరునవ్వుతో నాలుగున్నరేళ్ల నుంచీ రాష్ట్రంలోని కోటిమందికి పైగా డ్వాక్రా మహిళల్ని వంచిస్తూనే ఉన్నాడని, త్వరలో జరగబోయే ఎన్నికలు తనకు, తన ప్రభుత్వానికి చివరి ఎన్నికలని ముఖ్యమంత్రే నోరుజారాడాని నక్కా ఆనంద్ బాబు ఎద్దేవా చేశారు.

## మహిళలను నిలువునా మోసం

డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించి, వారిని పాలనలో భాగస్వాముల్నిచేసింది టీడీపీనే జగన్ రెడ్డీ. మహిళలకు ఆస్తిలో సమానహక్కు, రాజకీయాల్లో 9 శాతం రిజర్వేషన్లు కల్పించింది తెలుగుదేశమే. ఐదేళ్లలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రూ.24,669 కోట్లు అందించారు. మహిళలకు ఇది చేశానని చెప్పుకోలేని దుస్థితిలో ఉండే జగన్ రెడ్డి ప్రతిపక్షాల్ని, ప్రసారమాధ్యమాల్ని దూషిస్తున్నాడు.



జగన్ రెడ్డి బాధితులంతా ఆయన స్టార్ క్యాంపెయినర్లే!

డ్వాక్రా మహిళలు, అంగన్ వాడీ సిబ్బంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇలా అందరూ క్యాంపెయినర్లే! అవమానాలు, దాడులు, శిరోముండనాలు కానుకగా పొందిన దళితులు, కుటుంబాలను పోగొట్టుకున్న మైనారిటీలు జగన్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్లే. ఇప్పటివరకు జగన్ రెడ్డి మార్చిన వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రధాన స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించబోతున్నారు" అంటూ వ్యంగ్యం ప్రదర్శించారు.

## ఓటమి భయంతో సిట్టింగ్‌ల మార్పు

జగన్ రెడ్డి మాట్లాడితే సింగిల్‌గా పోటీ చేస్తాను అంటాడు. అంత దమ్ము, ధైర్యం ఉంటే తన పార్టీలో గెలిచిన అభ్యర్థుల్ని ఎందుకు మారుస్తున్నాడు? ఓటమి భయంతో మార్పులు చేస్తూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల్ని పక్కనపెడుతూ నాటకాలు ఆడుతున్నాడు. ప్రజలు తరిమి కొడతారని అర్థమయ్యే జగన్ రెడ్డి ఇప్పటికీ నిస్సిగ్గుగా టీడీపీ, జనసేనపైనా, ప్రసార మాధ్యమాలపైనా, గిట్టనివారిపైనా విషం కక్కుతున్నాడు.

## టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీయే!

జగన్ రెడ్డి నియంతృత్వ పోకడలు, అప్రజాస్వామిక విధానాలు తట్టుకోలేకనే వైసీపీకి ఆ పార్టీ నేతలు గుడ్ బై చెబుతున్నారు. మేం గేట్లు బార్లా తెరిస్తే వైసీపీ ఖాళీ కావడం తథ్యం. జగన్ రెడ్డి ఓటమి ఒప్పుకున్నాడు కాబట్టే, ఇప్పటికే 68 మంది సిట్టింగ్ లను మార్చాడు.
శ్రీ కృష్ణ దేవరాయలు ఒక్కడే కాదు.. మచిలీపట్నం ఎంపీ, మరో ఎంపీ సంజీవ్ కుమార్ ఇప్పటికే బయటకు వచ్చారు" అని ఆనంద్ బాబు చెప్పారు.

# కొడుకువైపా..! కూతురు వైపా..?

## విజయంపై పెరుగుతున్న ఒత్తిడి

**విజయవాడ, వెలుతురు:**
వైఎస్ విజయమ్మ పై ఒత్తిడి పెరుగుతోంది. ఆమెను కాంగ్రెస్ పార్టీలో చేర్చేందుకు బలమైన ప్రయత్నం జరుగుతోంది. కానీ ఒక వైపు కుమారుడు జగన్.. మరోవైపు కుమార్తె షర్మిల.. ఎవరి వైపు అడుగులు వేయాలో తెలియక విజయమ్మ సతమతమవుతున్నారు. తటస్థంగా ఉండిపోవాలని చూస్తున్నారు. కానీ ఆమెపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఒత్తిడి పెరుగుతోంది. కుమార్తె షర్మిలతో పాటు రాజశేఖర్ రెడ్డి సన్నిహితుడు కెవిపి రామచంద్ర రావు సైతం విజయమ్మను కాంగ్రెస్ పార్టీలో చేర్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆమె కానీ కాంగ్రెస్ పార్టీలో చేరితే.. జగన్ కు ఇబ్బందికరమే.
రాజశేఖర్ రెడ్డి భార్యగా విజయమ్మ అందరికీ సుపరిచితం. భర్త ఉన్నంతవరకు ఆమె రాజకీయాల గురించి ఆలోచించిన సందర్భాలు లేవు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం తర్వాత కుటుంబంతో పాటు పిల్లల కోసం ఆమె బయటకు రావాల్సి వచ్చింది. తండ్రి అకాల మరణంతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించడానికి జగన్ సిద్ధపడ్డారు. అందుకు కాంగ్రెస్ నాయకత్వం ఒప్పుకోలేదు. ఆ సమయంలో తొలిసారిగా విజయమ్మ బయటకు వచ్చారు. నేరుగా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశం అయ్యారు. తన కుమారుడు జగన్ ఓదార్పు యాత్రతో పాటు రాజకీయ అంశాలకు సంబంధించి చర్చలు జరిపారు. కానీ కాంగ్రెస్ నాయకత్వం నుంచి సానుకూలత రాలేదు. ఆపై కుమారుడు జగన్ పై కేసులు పెరిగాయి. 16 నెలల పాటు ఆయన జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనే విజయమ్మ తన కుమారుడికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వైసిపి ఏర్పాటు వెనుక కీలక పాత్ర పోషించారు.
తన కుమారుడు స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గౌరవ అధ్యక్షురాలిగా విజయమ్మ వ్యవహరించారు. కానీ అన్నతో విభేదించిన షర్మిల తెలంగాణలో పార్టీని స్థాపించారు. దీంతో వైసిపి గౌరవ అధ్యక్షురాలి పదవికి రాజీనామా చేసిన విజయమ్మ తెలంగాణలో కుమార్తె వెంట నడిచారు. కానీ తెలంగాణ రాజకీయాల్లో షర్మిల రాణించలేకపోయారు. అనూహ్య స్థితిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ సారథ్య బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడు ఏపీలో విజయమ్మ పాత్ర ఏమిటి? అనేది చర్చనీయాంశంగా మారింది. అన్నకు ఎదురొడ్డి వెళ్లేందుకు షర్మిల డిసైడ్ అయ్యారు. రాజకీయ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇటువంటి సమయంలో విజయమ్మను తన వెంట తీసుకెళ్లేందుకు షర్మిల ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.
అయితే విజయమ్మ కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లేందుకు



సంశయిస్తున్నట్లు సమాచారం. కుమార్తెకు అండగా నిలవాలని ఉన్నా.. కాంగ్రెస్ పార్టీలో చేరిన మరుక్షణం కుమారుడికి వ్యతిరేకంగా మారాల్సి ఉంటుంది. అది కుటుంబానికి వాంఛనీయం కాదని.. తల్లి స్థానంలో ఉన్న తనకు అది తగదని విజయమ్మ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రాజశేఖర్ రెడ్డి ఆత్మగా భావించే కేవీపీ రామచంద్రరావు షర్మిలకు అండగా నిలుస్తున్నారు. అటు విజయమ్మ ను సైతం ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా.. తాను తటస్థంగా ఉండేందుకే విజయమ్మ మొగ్గు చూపుతున్నారు. అయితే ఆమె అలానే ఉండిపోతారా? లేకుంటే ఒత్తిడితో కాంగ్రెస్ లో చేరుతారా? అన్నది తేలాల్సి ఉంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com